సాహితీ
నవలల సమీక్షలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

5-4-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 63 పేజీలు: 10+4 వెల: 6.50

నీట్ వ్యతిరేక బిల్లును తిరస్కరించిన రాష్ట్రపతి
బావిలో విషవాయువు: 8మంది దుర్మరణం
5లో

## ప్రవాసాంధ్రుల కోసం 33 అంతస్తుల ఐకానిక్ భవనం




ఐకానిక్ భవనం నమూనా

### అమరావతిలో నిర్మాణానికి ప్రణాళిక

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయిలో నిలిపేందుకు ప్రభుత్వ అడుగులు ముందుకు వేస్తోంది. అందులో భాగంగాపరిపాలన నగరంలో ప్రవాసాంధ్రుల ఐకానిక్ భవన నిర్మాణంలో మొదటి దశకు ఏపీఎన్ఆర్‌టీ సొసైటీ (ఆంధ్రప్రదేశ్ నాన్‌రెసిడెంట్ తెలుగు సొసైటీ ఐకాన్ టవర్) టెండర్లు పిలిచింది. టెండరు దాఖలుకు ఈ నెల 10వ తేదీ వరకు గడువిచ్చింది. రూ.600 కోట్ల వ్యయపుటంచనాతోఅమరావతిలో జగన్ పక్కనబెట్టిన ఒక్కో కీలకప్రాజెక్టు కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టాలెక్కుతోంది. 2014-19 మధ్య ఎన్‌ఆర్‌టీ ఐకాన్ భవనానికి నాటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన కూడా చేశారు. ఐకాన్ భవనంలో ఫ్లాట్ల కొనుగోలుకు 104 మంది ప్రవాసాంధ్రులు 33కోట్ల రూపాయల డబ్బు కూడా చెల్లించారు. భవన నిర్మాణం వేగం పుంజుకుంటున్న దశలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అమరావతిపై కత్తిగట్టిన జగన్ APNRT భవనాన్నీ మూలన పడేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో న్యాయపరమైన సమస్యలన్నీ అధిగమించి ఈ భవన నిర్మాణానికి మార్గం సుగమం చేసింది. ఎన్‌ఆర్‌టీఐకాన్ పేరుతో ఐదెకరాల్లో నిర్మించే భారీ భవనానికి సంబంధించి ఫౌండేషన్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ టెండర్లు పిలిచింది. పోడియంతో కలిపి 36 అంతస్తుల ఎన్‌ఆర్‌టీ ఐకాన్ భవనాన్ని 3 దశల్లో నిర్మిస్తారు. మొదటి దశలో నిర్మించే ఫౌండేషన్‌కు ఇప్పుడు టెండర్లు పిలిచారు. తదుపరి బిల్డింగ్ సూపర్ స్ట్రక్చర్‌కు, ఆ తర్వాత బయటకు కనిపించే భాగానికి టెండర్లు పిలిచి నిర్మాణం చేపట్టనున్నారు. దాదాపురూ.600 కోట్ల అంచనా >>2

## ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రులు



### అవసరాన్ని బట్టి పిహెచ్‌సి, సిహెచ్‌సిలో వైద్యసేవలు

### అమరావతిలో మెగా గ్లోబల్‌మెడిసిటీ ప్రాజెక్టు

### కేన్సర్‌స్క్రీనింగ్ ప్రక్రియ మెరుగుపరచాలి

### వైద్యఆరోగ్యశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100పడకల నుంచి 300 పడకల సామర్థ్యంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు స్థాపించేలా కార్యాచరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మొత్తం 175 నియోజకవర్గాలకుగాను 100 పడకలకు పైగా సామర్థ్యం ఉన్న ఆస్పత్రులు ఇప్పటికే 70 వరకు ఉన్నాయని, మిగిలిన 105 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్ నిర్మాణం జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీపీపీ పద్ధతిలో ఆస్పత్రులు నిర్మించి, నిర్వహించేలా ఆలోచన చేయాలని, ఇందుకోసం ముందుకొచ్చే సంస్థలకు పరిశ్రమల తరహాలోనే సబ్సిడీలు ఇచ్చే విధానం రూపొందించాలని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తృత పరచాలని చెప్పారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం అమరావతి వచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని చెప్పారు. గ్రామీణ స్థాయి నుంచి వైద్య ఆరోగ్యసేవలను విస్తృతంగా పెంచుతామన్నారు. తరుణవ్యాధుల సమయంలో స్థానికంగా వైద్యసేవలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడా వైద్య సేవలు అందుబాటులో లేక రోగులు ఇబ్బంది పడ్డారనే సమస్య రాకూడదన్నారు. క్షేత్ర స్థాయిలోనే క్యాన్సర్ స్క్రీనింగ్ నుంచి కీలకమైన వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. కీలకంగా ఆస్పత్రుల్లో అన్ని విభాగాల్లో వైద్యులు, పారా వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తృత పరచాలని చెప్పారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం అమరావతి వచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని చెప్పారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులకు చెప్పారు. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూతో ఒక బాలిక మరణించిన సందర్భంలో వైద్యశాఖ అప్రమత్తం కావాలని, ఈ వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

**వర్చువల్ వైద్య సేవలు:** విద్యవైద్య రంగాలు తమ ప్రాధామ్యాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో >>2

## పట్టాల పంపిణీ తొలి అడుగు

### మంగళగిరిని అన్ని రంగాల్లో నం-1 చేస్తా: మంత్రి లోకేష్

**మంగళగిరి,ఏప్రిల్ 4,ప్రభాతవార్త :** ఇళ్ల పట్టాల పంపిణీ తొలి అడుగు మాత్రమే అని, అన్ని రంగాల్లో మంగళగిరిని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దుతామని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లు-మన లోకేష్ పేదలకు పట్టాభిషేకం కార్యక్రమం



శుక్రవారం మంగళగిరిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి లోకేష్

లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం మంగళగిరి డాన్ బాస్కో ఉన్నత పాఠశాల పక్కన ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో నీరుకొండ గ్రామం, మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన పేద కుటుంబాలకు శాశ్వత ఇళ్లపట్టాలను మంత్రి లోకేష్ బట్టలు పెట్టి స్వయంగా అందజేశారు. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న నీరుకొండకు చెందిన 99మంది, మంగళగిరి రత్నాల చెరువుకు చెందిన 199మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది. 2019లో మంగళగిరిలో పోటీచేయాలనే ఐడియా వచ్చిందన్నారు. నాకు పరిచయంలేని నియోజకవర్గం ఇది. 21రోజుల ముందునాకు మంగళగిరి టికెట్ ఇచ్చారని చెప్పారు. నేనేంటో మీకు తెలియదు, మీ సమస్యలేంటో నాకు అర్థంకాలేదు 2019ఎన్నికల్లో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయా. దాంతో మరింతకసి పెరిగిందన్నారు. ఓడిపోయిన రెండోరోజు నుంచే కష్టపడి మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవాలని ఆనాడే నిశ్చయించుకున్నానని స్పష్టంచేశారు. ప్రతిపక్షంలో ఉన్నఐదేళ్లు మీకోసమే అహర్నిశలు కష్టపడ్డా. 26సంక్షేమ, అభివృద్ధికార్యక్రమాలు చేపట్టానని చెప్పారు.

**మంగళగిరి ప్రజలు చరిత్ర తిరగరాశారు:** 2024 ఎన్నికల సందర్భంగా రచ్చబండ నిర్వహించి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకున్నా. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత ఇంటి పట్టాలు అందించాలని ఆనాడు ప్రజలు నన్ను కోరారు. మేం నివసిస్తున్న ఇళ్లకే పట్టాలు ఇవ్వాలని కోరారు. దూరంగా ఇస్తే పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడతామని తనకు చెప్పారు. 53వేల మెజార్టీతో నన్ను గెలిపించాలని అప్పుడు కోరా. ఎన్నికల సమయంలో సర్వేలు చేస్తారు. ఆ సర్వేల్లో కుప్పం, మంగళగిరిని చూస్తే మన మెజార్టీ తక్కువగా కనపడేది. నేను చంద్రబాబుతో పోటీ పడేందుకు ప్రయత్నిస్తా. ఇంతచేసినా తక్కువ మెజార్టీ ఏంటని అనుకున్నాం. ఎన్నికల తర్వాత కుటుంబ సభ్యులం బయట దేశానికి వెళ్లాం. అప్పుడు కుప్పం కంటే ఒక్కఓటైనా నాకు ఎక్కువగా వస్తుందని బాబుతో చెప్పా. కుర్రోళ్లు స్పీడ్ కాబట్టి అంత సీన్ లేదన్నారని, మంగళగిరి ప్రజలు చరిత్ర తిరగరాశారని సంతోషం వ్యక్తం చేశారు. గౌరవంగా బట్టలు పెట్టి, పసుపు, కుంకుమతో పట్టాలు ఇస్తానని చెప్పా, 3వేలు పట్టాలు ఇచ్చేందుకు 6 రోజులు పడుతోంది. ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకే ఈ రోజు లోకేష్ మీ ముందుకు వచ్చాడు. మీరు ఏ బాధ్యత అయితే నాపై పెట్టారో ఆ బాధ్యతను నా భుజస్కంధాలపై మోస్తున్నా. మీరు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని ఆనాడేచెప్పా. అప్పుడే బాబుతో, పవనన్నతో పోరాడి నిధులు తెచ్చేందుకు బలమొస్తుందని చెప్పా. ఈ రోజు నాకు ఆబలం, శక్తిఇచ్చారు. అందుకే కేబినెట్‌లో మంగళగిరికి వంద పడకలఆసుపత్రి గురించి అడిగితే ఎవరూ కాదనలేదనీ >>2




శుక్రవారం బిమ్‌స్టెక్ దేశాల నేతలతో ప్రధాని మోడీ

## బిమ్‌స్టెక్ దేశాల్లో యుపిఐ అమలు

### ప్రధానిమోడీ పిలుపు

**బ్యాంకాక్,ఏప్రిల్ 4:** బిమ్‌స్టెక్‌సదస్సు కోసం థాయి లాండ్ పర్యటనలో ఉన్న ప్రధానిమోడీ ఈదేశాల మధ్య చెల్లింపు వ్యవస్థలతో యుపిఐని అనుసంధానం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ చర్యతో సభ్య దేశాల మధ్య వ్యాపారం వాణిజ్యం, పర్యాటకం కూడా అభివృద్ధిచెందుతాయన్నారు. అలాగే బిమ్‌స్టెక్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆరవ బిమ్‌స్టెక్ >>2

## 38 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లు

### ఎంసి ఛైర్మన్ పదవుల్లో టిడిపి-31, జనసేన-6, బిజెపి-1

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో నామినేటెడ్ పదవుల కేటాయింపు కొనసాగుతోంది. అందులో భాగంగా 38 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల పేర్లను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఈ ఏఎంసీ ఛైర్మన్ పదవుల్లో 31 టీడీపీ, 6 జనసేన, 1 బీజేపీ నేతలకు కేటాయించిందీ ప్రభుత్వం. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీల ఛైర్మన్లను ప్రకటిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అందుకోసం కసరత్తు జరుగుతోందని పేర్కొంది. నామినేట్ అయిన ఎంఎసీ ఛైర్మన్లుల్లో తుని అక్కమరెడ్డి సత్యవెంకట సూర్యనారాయణ రెడ్డి, రాప్తాడుకు సుధాకర్ చౌదరి, పత్తిపాడు బడ్డి మణి, పెడన బిమిని అనంత లక్ష్మి(జెఎస్పీ), గుడివాడ చాత్రగడ్డ రవికుమార్, పొత్తూరు డిఎస్ గణేష్, దర్శి దారం నాగవేణి, పాయకరావుపేట దేవర సత్యనారాయణ, గన్నవరం గరికపాటి శివశంకర్(జెస్పీ) వేమూరు గొట్టిపాటి జయవెంకట పూర్ణకుమారి, పర్చూరు గుంజి వెంకటేశ్వరరావు, ఐపూర్ జరపాల రాములుబాయి, ఉండి జగ్గుతా నాగరాజు,(జెఎస్పీ) విజయనగరం కర్రోతు వెంకట, పాలకోలేకు కోడివిజయభాస్కర్, ఆలమూరుకు కొత్తపల్లి >>2

## లైంగిక వేధింపులతో మహిళ ఆత్మహత్య



నాగాంజలి(ఫైల్)

**రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 4ప్రభాత వార్త:** లైంగిక వేదింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి పన్నిండు రోజులు మృత్యువుతో పోరాడి శుక్రవారం మరణించింది. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. ఆమె మరణంపై ఆసుపత్రి తీరుపట్ల విమర్శలు వస్తున్నాయి. రాజమహేంద్రవరం బొల్లినేని ఆసు పత్రిలో పని చేస్తున్న ఎంజిఎం దీపక్ ఉద్యోగి లైంగిక వేదింపులు తట్టుకోలేక గత నెలలో ఫార్మసీ విద్యార్థిని సూసైడ్‌నోట్ రాసి మత్తు ఇంజెక్షన్‌తో ఆత్మహత్య ప్రయత్నంచేసింది. ఇది రాష్ట్రంలో సంచలనంగా మారింది. బాధితురాలు తల్లిదండ్రులు, >>2

## సచివాలయంలో అగ్నిప్రమాదం

### పూర్తిస్థాయి విచారణకు హోంమంత్రి అనిత ఆదేశం

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సచివాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. రెండో బ్లాక్ లో ఉన్న బ్యాటరీలు ఉంచే ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సచివాలయ సిబ్బంది వెంటనే ఫైర్ సేఫ్టీ, ఎస్పీఎఫ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన చేరుకున్న ఫైర్ సేఫ్టీ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. సచివాలయం అగ్ని ప్రమాద ఘటనపై తుళ్లూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేయాల్సిందిగా హోం మంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు. అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న బ్యాటరీ, యూపీ ఎస్ రూంలో ఫైర్ అలారం లేకపోవడంపై హోం మంత్రి ఆరా తీశారు. సచివాలయంలో అన్ని బ్లాక్ లలో ఫైర్ అలారంలను తనిఖీ చేయాలని హోం మంత్రి సూచించారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లుగా ప్రాధమికంగా గుర్తించినట్లు అధికారులు వివరించారు. అగ్ని ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఫైర్ ఆడిట్ చేయించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఫోరెన్సిక్ విభాగం కూడా ఈ ఆధారాలు సేకరిస్తుందన్నారు. సచివాలయంలోని రెండో బ్లాక్‌లోనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్,



శుక్రవారం సచివాలయంలో ఆగ్ని ప్రమాద దృశ్యం

దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణ రామనారాయణరెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పేషీలు ఉన్నాయి.

అగ్నిప్రమాద ప్రదేశాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు 2లో

## బర్డ్‌ఫ్లూపై ఆందోళన అవసరం లేదు:సిఎం

**విజయవాడ, ఏప్రిల్ 4.ప్రభాతవార్తప్రతినిధి:** బర్డ్ ఫ్లూపై ప్రజలు ఆందోళన అవసరం లేదని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. నరసరావుపేటలో బర్డ్ ఫ్లూ వైరస్ (బీ5వి1) లక్షణాలతో ఇటీవల బాలిక మృతి చెందిన ఘటనపై అధ్యయనం కోసం రాష్ట్రానికి వచ్చిన ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. నరసరావుపేటలో పర్యటన అనంతరం తనను కలిసిన ఐసీఎంఆర్ బృందంతో బాలిక మృతికి గల కారణాలను చర్చించారు. బాలిక నుంచి సేకరించిన నమూనాలలో బీ5వి1 లక్షణాలు బయటపడినప్పటికీ, ఇతర అనారోగ్య కారణాలు కూడా బాలిక మృతి చెందడానికి దారితీశాయని బృందం సభ్యులు చెప్పారు. ఉడికించని మాంసంతినడం, చిన్నారి కావడంతో వ్యాధి నిరోధకశక్తి లేకపోవడం, లెప్టోస్పిరోసిస్(ఎలుకల విసర్జనవల్ల వ్యాపించే వ్యాధి), అపరిశుభ్ర వాతావరణం కూడా మృతికి కారణాలుగా తమ అధ్యయనంలో తేలిందన్నారు. ప్రస్తుతం ఆ పరిసర ప్రాంతంలో ఎలాంటి బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని, 8 బృందాలతో సర్వే చేపట్టామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. చిన్నారి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్థానికుల నమూనాలు పరీక్షించామని ఎవరికీ బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని చెప్పారు. దీనిపై ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని చెప్పారు. >>2

## సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్‌బుకింగ్‌లు

### ప్రస్తుతం 26 జిల్లా కేంద్రాల్లో ఆరంభం, 296 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దశల వారీగా అమలు: మంత్రి అనగాని



శుక్రవారం సచివాలయంలో స్లాట్ బుకింగ్ అవగాహన కరపత్రాన్ని, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, అధికారులు

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ సేవలను శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్‌స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా, రిజిస్ట్రేషన్స్ అండ్‌స్టాంప్స్ ఐజీ హరి నారాయణ, అడిషనల్ ఐజీ ఉదయ భాస్కర్, జాయింట్ ఐజీలు రవికుమార్, సరోజలతో కలిసి స్లాట్ బుకింగ్ అవగాహన కరప్రతాన్ని, పోస్టర్‌ను మంత్రి సత్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సులభతరంగా సేవలు అందించాలనే సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ >>2



శుక్రవారం మంగళగిరిలో లబ్దిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణి చేస్తున్న మంత్రి లోకేష్

# పట్టాల పంపిణి తొలి అడుగు

>> చెప్పారు. పార్కులు, చెరువులు అభివృద్ధి చేస్తున్నాం. కల్యాణ మండపాలు కడుతున్నాం. డ్రైనేజీకి శాశ్వత పరిష్కారం కోసం భూగర్భ డ్రైనేజీ, నీరు, భూగర్భ గ్యాస్ అందిస్తాం. భూగర్భ కరెంట్ కూడా అందిస్తాం. మీరు పవిత్రమైన కార్యక్రమం కోసం వచ్చారు. దశాబ్దాలుగా అనేకమందికి శాశ్వత పట్టాల కోసం విజ్ఞాపనలు అందించారు. జిరాక్స్ ల కోసమే వేల రూపాయలు ఖర్చుపెట్టారు. ఎవరూ న్యాయం చేయలేదు. వేదికపై ఉన్న జనసేన, బీజేపీ, తెలుగుదేశం కలిసికట్టుగా మీ ఇంటికి వచ్చి కచ్చితమైన కొలతలు తీశారు. మీవద్ద నుంచి టీ కూడా తాగకుండా పారదర్శకంగా పట్టాలు అందజేస్తున్నాం. 3వేల కుటుంబాలకు వెయ్యి కోట్ల రూపాయల విలువైన పట్టాలు ఎన్డీయే ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. ఇది తొలిఅడుగు మాత్రమే. చరిత్ర రాసేం దుకు వచ్చా. మీ అందరి ఆశీస్సులతో అన్ని రంగాల్లో మంగళగిరిని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దుతాం. స్వచ్ఛ భారత్ లో మంగళగిరిని నెం.1గా చేయడమే నా లక్ష ్యం స్వచ్ఛ మంగళగిరికోసం అధికారులు బాగా కష్టపడుతున్నారు. పూడిక, చెత్తను తొలగి స్తు న్నారు. 30రోజుల్లో వెయ్యిటన్నుల చెత్త బయటపడింది. స్వచ్ఛభారత్‌లో మంగళగిరిని నెం.1గా చేయ డమే నాలక్ష ్యం. అధికారులు, ప్రజాప్రతినిధులుగా మేము కష్టపడతాం. ప్రతిరోజు చెత్త ఎత్తే కార్యక్రమం తీసుకుంటాం. పారిశుద్ధ్యకార్మికులు బాగా కష్టపడుతున్నారు. దయచేసి తిరిగి చెత్తవే యవద్దని కోరు తున్నా. చెత్తనురోడ్లపై వేయకుండా డస్ట్ బిన్‌లలో వేయాలని కోరుతున్నా. సంవత్సరం ఓపిక పడతా. ప్రజల్లో చైతన్యం తీసుకువస్తా. రెండోఏడాది కర్రపట్టుకుని తిరుగుతత. ఎవరి ఇంటి ముందైనా చెత్త కన పడితే మిమ్మల్నేనిలదీస్తా. ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.మనలో కూడా మార్పు రావాలి. నాపై పెద్దబాధ్యత పెట్టారు. ఎన్నో ఆశలతో నన్ను గెలిపిం చారు. మొదటి పదినెలల్లోనే శాశ్వతపట్టాలు అందిస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలు, నేను వ్యక్తిగతంగా ఇచ్చి న హామీలు నెరవేరుస్తా. వందపడకల ఆసుపత్రిని కార్పోరేట్ స్థాయిలో నిర్మిస్తాం. అందుకు మీ అందరి సహకారాలుకావాలి. నేను ఎక్కడికి వెళ్లినా మంగళగిరి నా గుండెల్లో

# సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్‌బుకింగ్‌లు

>> డిపార్ట్‌మెంట్ అధికారిక వెబ్ సైట్ లో స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏ రోజు వీలుంటే ఆరోజు ఆ సమయానికి కొచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా స్లాట్ బుక్ చేసు కోవచ్చని తెలిపారు. దీని ద్వారా ప్రజలు రిజిస్ట్రేషన్ చేయించుకు నేందుకు వేచి ఉండాల్సి న అవసరం లేదన్నారు. అమ్మకందారులు, కొనుగోలుదారులు, సాక్షులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తమకు కుదిరిన సమయాల్లో వచ్చి పని పూర్తి చేసుకోవచ్చన్నారు. స్లాట్ ఆధారిత అపాయింట్మెంట్లు మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గిస్తాయ న్నారు. ఈరోజున మొత్తం 26 జిల్లా ప్రధాన కార్యాల యాల రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, మొత్తం 296 సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాల్లో ఈ స్లాట్ బుకింగ్ సిస్టమ్ దశలవారీగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు.ఇప్పటికే గాంధీనగర్, కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశామని, ప్రజల నుండి సానుకూల స్పందన వస్తోందని తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా ఆన్లైన్ లో డేటా ఎంట్రీ చేసి డాక్యుమెంట్ ప్రీపేర్ చేసుకొని ఫీజు కూడా కట్టేసి ఆ తర్వాత స్లాట్ బుక్ చేసుకుంటే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చిన 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తయిపోతుందన్నారు. ఒక వేళ స్లాట్ బుకింగ్ చేసుకోలేకపోయిన వారు సబ్ రిజిస్టార్ ఆఫీసుకు వస్తే సాయంత్రం ఐదు గంటల తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా రూ. ఐదు వేల రూపాయల ప్రత్యేక ఫీజు తీసుకొని రిజిస్ట్రేషన్లు చేస్తామని చెప్పారు. ఉగాది,రంజాన్ పండుగల సందర్భంగా వరుసగా వచ్చిన మూడు రోజుల సెలవుల్లో దాదాపు రూ.74 కోట్ల రూపాయల రిజిస్ట్రేషన్ ఆదాయం లభించిందన్నారు. రిజిస్ట్రేషన్ తర్వాత ఆటోమ్యూటేషన్ను సులభతరం చేయడం కోసం రిజిస్ట్రేషన్ సాఫ్ట్ వేర్ ను రెవెన్యూ డేటాబేస్ తో అనుసంధానం చేశామన్నారు. ఇతర శాఖలతోనూ అనుసంధానం ప్రారంభించామన్నారు. ఈ ప్రక్రియ 2025 ఏప్రిల్ 15వ తేదీ నాటికి పూర్తవుతుందని తెలిపారు. ఈ అనుసంధానంతో ఆస్తిపై యాజమాన్యం ఉన్న వ్యక్తి మాత్రమే రిజిస్ట్రేషన్ చేయగలుగుతారని చెప్పారు. డబుల్ రిజిస్ట్రేషన్, నకిలీ డాక్యుమెంట్ల సృష్టి లాంటి రియల్ ఎస్టేట్ మోసాలను నివారించేందుకు శాఖ అనేక చర్యలు తీసుకుందన్నారు. ఆధార్ సేవలను రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. డాక్యుమెంట్లను సమర్పించినప్పుడు పార్టీల డిజిటల్ సంతకాలు కూడా తీసుకోబడతాయని, పేద ప్రజ లకు న్యాయం చేయాలనే లక్ష్యంతో రెవెన్యూ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న, భూ యజమానులకు ఇబ్బందిగా ఉన్న నాలా యాక్ట్ ను రద్దు చేస్తున్నామన్నారు. 2024-25 ఏడాదికి రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గిందని అవినీతి పుత్రికగా ఉన్న ఒక పత్రిక వార్తలు రాసిందని, డబ్బు కోసం గడ్డితినే ప్రభుత్వం మాది కాదని అన్నారు. పేదల అభ్యున్నతి తోపాటు, అభివృద్ధిని కూడా సాధిస్తూ ఆదాయాన్ని పెంచుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వం భూ అరచాకాలు చేసిందని, ఫ్రీ హోల్డ్ పేరుతో పెద్ద కుంభకోణానికి పాల్పడిందని విమర్శించారు.ంవెన్యూ శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఆర్ పి సిసోదియా మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల శాఖలో వరుసగా తీసుకొస్తున్న సంస్కరణల కారణంగా అవినీతి తగ్గిపోయి పారదర్శకత పెరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ఫేస్ లెస్, పేపర్ లెస్, క్యాష్ లెస్ గా రిజిస్ట్రేషన్లు జరపాలనేది తమ లక్ష్యమని చెప్పారు.

# ముంబయి ఇండియన్స్ ఆశలు చిత్తుచేసిన లక్నో సూపర్ జెయింట్స్

## 12 పరుగుల తేడాతో ముంబయి జట్టు ఓటమి

**లక్నో, ఏప్రిల్ 4:** ఐపిఎల్ 2025 సీజన్‌లో 15వ మ్యాచ్‌గా జరిగిన లక్నోసూపర్‌జెయింట్స్, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్యజరిగిన శుక్రవారం మ్యాచ్ చివరివరకూ ముంబయి ఇండియన్స్ గెలుస్తుందన్న ధీమాను లక్నోజట్టు పటాపంచలుచేసింది. 12 పరుగులతేడాతో ముంబయిపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన లక్నోసూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 203 పరుగులుచేసి ముంబయికి 204 పరుగుల లక్ష్యం విధించింది. అయితే కేవలం 191 పరుగులుమాత్రమే చేసిన ముంబయి చేతులెత్తేసింది. ముంబయి స్టార్‌ప్లేయర్ సూర్యకుమార్‌యాదవ్ ఒక్కటే అద్భుత బ్యాటింగ్‌చూపించాడు. 43 బంతుల్లో 67 పరుగులుచేసారు. ఇందులో తొమ్మిది ఫోర్లు ఒక సిక్స్ బాదాడు.చివరి ఓవర్‌లో ముంబయి గెలవడానికి 22 పరుగులు అవసరం అయింది. మొదటి బంతికి సిక్స్‌కొట్టిన కెప్టెన్ హార్దిక్‌పాండ్యా రెండో బంతికి 2 పరుగులుతీసాడు. మూడో బాల్ డాట్ అవ్వగా నాలుగోబాల్‌కూడా డాట్‌చేసాడు. బౌలర్ ఆవేశ్‌ఖాన్ ఇక ఐదో బంతికి కేవలం సింగిల్ మాత్రమే వచ్చింది. తొలుత బ్యాటింగ్‌చేసిన ఎల్ఎస్‌జి 20 ఓవర్లలో 8 వికెట్లనష్టంతో 203 పరుగులుచేసింది. ఓపెనర్లు మిచెల్‌మార్ష్,మార్క్‌రమ్‌లు అద్భుత ఓపెనింగ్ అందించారు. మార్ష్‌కేవలం 31 బంతుల్లో 60 పరుగులుచేసాడు. ఇందులో రెండు సిక్స్‌లు తొమ్మిది ఫోర్లు ఉన్నాయి.

# 100 పడకల ఆసుపత్రులు

>> అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధి కారులకు చెప్పారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలో వైద్యులు అందుబాటులో లేని సమయంలో రోగులకు వర్చు వల్ విధానంలో ప్రాథమిక సేవలు అందేలా చూడాల న్నారు. అనారోగ్యం బారిన పడిన తర్వాత వైద్యసేవలు అందించే పరిస్థితి నుంచి ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకునేలా అవగాహన కల్పించాల న్నారు. ఆహారపు అలవాట్లను, జీవన విధానాన్ని మార్చు కోవడం ద్వారా హైపర్ టెన్షన్, డయాబెటిస్ వంటి వ్యాధు ల నుంచి చాలావరకు బయటపడవచ్చన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. గతం లో ఎన్నడులేని రీతిలో ఈ టెస్టులు ప్రజలకు అందుబా టులోకి తీసుకుని వస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. త్వరలో భారీ స్థాయిలో పెట్టుబడులు రానున్నాయి. పలు మెడికల్ కాలేజీలు ఏర్పాటు కాబోతున్నాయి. వీటికి సంబంధించి ఇప్పటికే ఒప్పందాలు జరిగాయి అని తెలిపారు. ఉద్యోగులు, జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని, సంచార వైద్యం కింద 200కి పైగా వాహనాలు ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఎన్టీఆర్ బేబీ కిట్ లాంటి కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తృత పరచాలని చెప్పారు. అమరా వతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం అమరావతి వచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని చెప్పారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులకు చెప్పారు.

**కొత్తగా 13 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లు :** రూ.32.5 కోట్లతో 25 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను బలోపేతం చేయడంతో పాటు, కొత్తగా మరో 13 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సమావేశంలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే ఏజెన్సీ ఏరియాలోని పీహెచ్‌సీల్లో వైద్య ఖాళీల భర్తీ, విజయ నగరంలో కొత్తగా 8డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు, ఎన్టీఆర్, విజయనగరం, బాపట్ల జిల్లాల్లో డయా లసిస్ మెషిన్లు పెంచడం, కొవ్వూరునిడదవోలు సీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేయడం తదితర అంశాలపైన మార్గదర్శకాలు జారీ చేశారు.

**కుప్పంలో డిజిటల్ నెర్వ్ సెంటర్:** కుప్పంలో అమలు చేస్తున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అభివృద్ధి చేసిన వినూత్న ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం డిజిటల్ నెర్వ్ సెంటర్ (డ్రివిది) పురోగతి గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి ఆరోగ్య సంరక్షణ అందించడానికి డిజిటల్ నెర్వ్ సెంటర్ దోహదపడుతుంది. దేశంలోనే అత్యధికంగా 4.47 కోట్ల (88 శాతం) మందికి రాష్ట్రంలో అభా కార్డులు జారీ అయ్యాయి. అలాగే, పీఎం జన్మాన్‌లో భాగంగా టీబీ ఎలిమినేషన్ కింద 82,693 గిరిజనులకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ చేయగా 5,072 మందికి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 10,11,461 మంది గిరిజనులకు స్క్రీనింగ్ చేయగా 1,977 మందికి సికిల్ సెల్ ఎనీ మియా పాజిటివ్‌గా తేలింది.రాష్ట్రంలో 95.60శాతం జనన, మరణాల నమోదు జరిగింది. 13,26,621 శిశుఆధార్‌లు జారీఅయ్యాయి.?వ్యాధులను గుర్తించే దిశలో ఆరోగ్యకార్యకర్తలు విస్తృతంగా సర్వే లు నిర్వహించాలన్నారు. ఆరోగ్య శ్రీసేవలు విస్తృతంగా అందాలన్నారు.ఆరోగ్యబీమాపై అందరికి అవ గాహన కలగాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముద్దా తిరుమల కృష్ణబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బిమ్‌స్టెక్ దేశాల్లో యుపిఐ అమలు

>> సదస్సులో ప్రధాని మోడీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో స్థానిక కరెన్సీలో వ్యాపారాన్ని ప్రోత్సహించే మార్గాలను అన్వేషించాలనిసూచించారు. విపత్తు సంసిద్ధత పునరావాసంపై ఒకరికొకరు సహకరించుకునేందుకు భారత్‌లో బిమ్‌స్టెక్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ఫర్ డిజాస్టర్‌మేనేజ్‌మెంట్ ఏర్పా టుగురించి ప్రస్తావించారు. ఇటీవలే మైన్మార్, థాయిలాండ్‌లో భూకంపం సంభవించింది. థాయి లాండ్‌లో ఈ విపత్తు తీవ్రత స్వల్పంగానే ఉన్నా మైన్మార్‌లో తీవ్ర ప్రాణ ఆస్తినష్టాన్ని చవిచూసింది. ఈ క్రమంలోమోడీనుంచి ఈ ప్రతిపాదన వచ్చింది. సదస్సులో బ్యాంకాక్ విజన్ 2030కి ఆమోదం లభించింది. బంగాళాఖాతంలో ఉమ్మడిశ్రేయస్సు భద్రతకు పరస్పరం కట్టుబడి ఉంటామని సభ్యదేశాలు అందులో స్పష్టంచేసాయి. బంగ్లా కేర్‌టేకర్ చీఫ్ మహ్మద్‌యూనస్‌తోప్రధాని భేటీ అయ్యారు. బిమ్‌స్టెక్ సదస్సు సందర్భంగా బ్యాంకాక్‌లో బంగ్లా చీఫ్‌తోపాటు మైన్మార్‌చీఫ్ మిన్ ఆంగ్ హ్లెయిర్‌తో కూడా భేటీ అయ్యారు. యూనస్ బాధ్యతలుచేపట్టాక భారత ప్రధానితో తొలిభేటీ ఇదే కావడం గమనార్హం. థాయిలాండ్‌నుంచి శ్రీలంకకు బయలుదేరిన మోడీ ఆదేశంలో మూడు రోజులపాటు పర్యటిస్తారు.

# అమరావతికి రండి:సీఎం చంద్రబాబు

**విజయవాడ ఏప్రిల్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** కృత్రిమ మేధలోనే కాదు క్వాంటమ్ టెక్నాలజీ రంగంలోనూ ముందంజలో ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.తదుపరి భారత్ పర్యటన సందర్భంగా అమరావతికి ఆహ్వానిస్తు న్నామని,మా లక్ష్యాలను మీతో పంచుకుని భాగస్వాములమవుతాం అని ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మన్‌ను ఉద్దేశించి అన్నారు. ఏఐ ఇతర సాంకేతికతలను వినియోగించే విషయంలో భారత్‌లో చూపి స్తున్న సృజనాత్మకత ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రపంచాన్ని భారత్ అధిగమిస్తోందంటూ సామ్ ఆల్ట్‌మన్ చేసిన ట్వీట్‌పై సీఎం చంద్రబాబు రీట్వీట్ చేశారు. భారత్ ఇప్పుడే తన ప్రయత్నాన్ని ప్రారం భిస్తోంది. ఏఐ టెక్నాలజీలో ప్రధా కేంద్రంగా మారడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉంది అని పేర్కొన్నారు.

# విడదల రజనీ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి విడదల రజనీ ముందస్తు బెయిల్ పిటిషన్ పై ఏపీ హైకోర్టులో విచారణ వాయిదాపడింది.ఈ కేసును నేడు విచారించిన ఏపీ హైకోరువచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.విడదల రజని తరఫున న్యాయవాది తన వాదనల్లో రాజకీయ కక్షతో రజని పై కేసు నమోదు చేశారని హైకోర్టు దృష్టికి తీసుకుని వెళ్ళారు.

2021లో ఘటన జరిగిందంటూ ఇప్పుడు కేసు నమోదు చేశారుఈ కేసులో ఏ2గా ఉన్న ఐపీఎస్ జాషువా ఇచ్చిన స్టేట్మెంట్ ను ప్రస్తుత ఎంపీ లావు శ్రీకృష్ణదే వరాయలు సోషల్ మీడియా లో పోస్ట్ చేశారు లావు శ్రీకృష్ణదేవరాయలు గత ప్రభుత్వంలో రజనీతో పాటు ఒకే పార్టీలో అదే జిల్లాలో ఎంపీ గా ఉన్నారు ఇప్పుడు అధికార పార్టీలో ఉన్నారు. విజిలెన్స్ కు విచారణ లో ఏ2 ఇచ్చిన స్టేట్మెంట్ కి సంబంధించిన నివేదిక లావు శ్రీకృష్ణదేవ రాయలు బయట పెట్టరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చుప్రభుత్వం సమయం కొరటంతో తదుపరి విచారణ వచ్చే మంగళ వారానికి ఏపీ హైకోర్టు వాయిదా వేసింది.

# కోలుకుంటున్న కొడాలి నాని

## బైపాస్ సర్జరీ సక్సెస్

**విజయవాడ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు కు ముంబయిలోని ఏషియన్ హార్ట్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 2న నిర్వహించిన బైపాస్ సర్జరీ విజయవంతమైనట్లు వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతురావు తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ ఆసుపత్రి చీఫ్ సర్జన్ రమాకాంత్ పాండే సుమారు 8 నుంచి 10 గంటల పాటు శస్త్ర చికిత్స చేశారు. కొన్ని రోజులపాటు నాని ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉంటారు. ఆయన అవయవాలన్నీ బాగా స్పందిస్తున్నా యని వైద్యులు ధ్రువీకరించారు. మరో నెల రోజులపాటు నాని ముంబయిలోనే ఉంటారు. వీలైనంత త్వరగా ఆయన కోలుకుని తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నాం అని పేర్కొన్నారు.

# కసిరెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సన్నిహితుడు కసిరెడ్డి రాజశే ఖర్‌రెడ్డికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగి లింది. మద్యంకుంభకోణం కేసులో సాక్షిగా తమ ముందు హాజరుకావాలని కసిరెడ్డికి సీఐడీ) నోటీసులు (సీఆర్పీసీ సెక్షన్ 160) ఇచ్చింది. అయితే సీఐడీ నోటీసులను కొట్టివేయాలని కోరు తూ కసిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. సీఐ డీ ఇచ్చిన నోటీసులపై జోక్యం చేసుకునేందుకు న్యాయస్థానం నిరాకరించింది. తదుపరి నోటీసు జారీ చేసి విచారణకు పిలిచే ముందు సహేతుకమైన సమయం ఇవ్వాలని సీఐడీకి హైకోర్టుఆదేశాలు జారీ చేసింది. మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి కూడా హైకోర్టులో చుక్కెదురైన విషయం తెలిసిందే. ఈ కేసులో మిథున్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నిన్న హైకోర్టులో విచారణ జరిగింది. అయితే మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది .



బొడ్డపాడు గ్రామం నుంచి డోలీలో రోగిని తరలిస్తున్న దృశ్యం

# గిరిజన మంత్రి ఇలాకాలో గిరిపుత్రులకు తప్పని డోలీ మోతలు

**సాలూరు, ఏప్రిల్ 4(పార్వతీపురం మన్యం జిల్లా) ప్రభాతవార్త :** ఎవరో వస్తారని ఏదో చేస్తారని మొదటి నుండి మోస పోతున్న గిరిజనుల తలరాతలు మారడం లేదు. తమ డోలి కష్టాలకు తెరపడటం లేదు. సాక్షాత్తు గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇలాకాలో సైతం డోలిమోతలు తప్పడం లేదు. మంత్రి సంధ్యారాణి స్వంత నియోజకవర్గం, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం జిల్లేడు వలస పంచాయతీలో ఉన్న బొడ్డపాడు గ్రామంలో ఉంటున్న సీదరపు నాగేశ్వరరావు అనే గిరిజనుడి ఆరోగ్యం చావుబతుకుల మధ్య ప్రమాదకరమైన పరిస్థితిలో ఉండగా ఆ గ్రామస్తులు డోలికట్టి ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లే ఘటన చోటు చేసుకుంది. మండుటెండలు ఆ గ్రామం నుండి అనారో గ్యంతో ఉన్న ఆ గిరిజనుడ్ని డొలి సాయంతో కాలినడక న సుమారు మూడు కిలోమీటర్లు భుజాలపై మోసుకొని జిల్లేడువలస తీసుకువచ్చారు. అక్కడ నుండి ఆటోలో తరలించి సాలూరు ఏరియా ఆసు పత్రికి వైద్యం కోసం చేరుకున్నారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నాగేశ్వరరావును విజయనగరం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ సంఘటన ఒక ఉదాహరణ మాత్రమే. ఈతరహా క్లిష్టమైన, కష్టతరమైన గిరిజనుల ప్రయాణాలు ఈ ప్రాంతంలో నిత్య కృత్యమయ్యాయి. దీనిపై ఆది వాసి గిరిజనసంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సీదరపు అప్పారావు తీవ్రంగా స్పందించారు. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్ళు గడిచిన గిరిజనులకు ఈ డోలిమోత కష్టాలు తీరండం లేదని ఆవేదన చెందారు. అంతే కాకుండా గిరిజనశాఖమంత్రి ప్రకటనలు చేస్తున్నారే తప్ప సమస్యలు పరిష్క రించడంలేదని ఆరో పించారు.ఇప్పటికైనా గిరిశిఖ గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించి డోలి మోతలు లేకుండా చేయాలని కోరారు.నాయకులు రాంబాబు సీదరపు బాలకృష్ణ వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



సచివాలయం దగ్గర జరిగిన అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్నచంద్రబాబు

# సచివాలయంలో అగ్నిప్రమాద ప్రదేశాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 4 :** వెలగపూడి సచివాలయంలోని రెండవ బ్లాక్‌లో తెల్లవారుజామున చోటు చేసుకున్న అగ్నిప్రమాద ప్రదేశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు. సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, హోంమంత్రి అనిత, జీఏడీ పొలిటికల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనాతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందని, ఏ సమ యంలో చోటు చేసుకుందని సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రతిచోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రమాదానికి గల కారణాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్ బృందం ఎన్ని గంటలకు వచ్చిందని అడిగారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అవసరమైన ఆధారాలను సేకరించిందీ లేనిది అడిగారు. సచివాలయంలో అన్ని చోట్లా భద్రతా ప్రమాణాలన్నీ పాటిస్తున్నారా లేదా అన్నది ఆడిట్ చేయాలని సూచించారు. అనంతరం మొదటి బ్లాక్‌లోని బ్యాటరీ రూమ్‌ను కూడా సీఎం పరిశీలించారు. ఇటువంటి బ్యాటరీ గ్యాలరీనే రెండవ బ్లాక్‌లో అగ్నిప్రమాదానికి గురైందని సీఎంకు సీఎస్ వివరించారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ విభాగాన్ని పరిశీలించారు. అక్కడి అపరిశుభ్రతపై అసం తృప్తిని వ్యక్తం చేసిన సీఎం, 24 గంటల్లో చెత్తనంతా క్లీన్ చేయాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో ఎక్కడా తాత్కాలికంగా కూడా చెత్త కనబడటానికి వీల్లేదని అన్నారు.

# 38 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లు

>> వెంకటలక్ష్మి(జెఎస్పీ),చీరాలకు కౌతారపు జనార్ధనరావు,భీమునిపట్టణంకు కురిమిన రామస్వామి నాయుడు,మద్దిపాడు మన్నం రాజేశ్వరి,రెపల్లె మత్తి అనురాధ,వినుకొండ మీసాల మురళీకృష్ణ,రోంపిచర్ల మొండితోక రాణి,పెద్దాపురం నూనె మంగాలక్ష్మి,కూచినపూడి ఓజిగిబోయిన వెంకటేశ్వరరావు,గజపతినగరం పీవీవీ గోపాలరాజు,నరసన్నపెట పొగాటి ఉమామహేశ్వరి,రాజం పొగిరి కృష్ణ వేణి(జెఎస్పీ), కంభం పోనూరు భూపాల్‌రెడ్డి, యర్రగుంట్ల రామిరెడ్డిపల్లి నాగరాజు(బిజెపి) తిరువూరు రెగళ్ళ లక్ష్మీఅనిత,కమలపాలెం సిరిగిరెడ్డి రాఘవరెడ్డి, జములూరు తర్ర బలరామ్, సంతమగులూరు తేలప్రోలు రమేష్, రాయదుర్గం ఉండాల హనుమంతరెడ్డి,దుగ్గిరాల ఉన్నం ఝాన్సీరాణి, నంది కోట్కూరు వీరం ప్రసాదరెడ్డి,గోపాలపురం యద్దనపూడి బ్రహ్మ రాజు, కనిగిరి యర్వ రమాదేవిలు ఉన్నారు.

# బర్డ్‌ఫ్లూపై ఆందోళన అవసరం లేదు: సిఎం

>>భవిష్యత్‌లో ఇలాంటి కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులకు ముఖ్య మంత్రి సూచించారు. రాష్ట్రంలో యాంటీవైరల్ డ్రగ్స్ సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. ఈ విషయంలో వైద్యాధికారులు పూర్తి అప్ర మత్తతో వ్యవహరించాలని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఆదేశించారు.ప్రజారోగ్య సిబ్బం ది చికెన్ దుకాణాల దగ్గర పారిశుద్ధ్యం తది తరంశాలపై దృష్టి పెట్టాలన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 05-04-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల అష్టమి రా.7.32
పునర్వసు తె.5.32
వర్జ్యం మ.1.49 - మ.3.29
దు.ఉ.6.00-ఉ.7.37
శుభసమయం : లేదు
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. కుటుంబంలో ఏర్పడిన తగాదాలు పరిష్కారం.

**వృషభం :** దూరపు బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**మిథునం:** పారిశ్రామిక, రాజకీయ రంగాల వారికి విదేశీపర్యటన అవకాశాలు పొందుతారు.

**కర్కాటకం :** భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. జీవితభాగస్వామి నుండి ధనలాభం.

**సింహం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. పనులు నిదానంగా సాగుతాయి.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. విలువైన పత్రాలు జాగ్రత్త అవసరం.

**వృశ్చికం:** ఉద్యోగాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**ధనుస్సు:** మీ అంచనాలు ఫలిస్తాయి. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. నూతన వస్తుసేకరణ.

**మకరం:** చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది.

**కుంభం:** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. అనుకోని అతిథులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

**మీనం :** ఋణ ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. గృహ నిర్మాణం ఆలోచనలు నిదానంగా సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రవాసాంధ్రుల కోసం 33 అంతస్తుల ఐకానిక్ భవనం

>> వ్యయంతో జంట టవర్లుగా దీన్ని నిర్మిం చనున్నారు. 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.కేవలం ప్రవాసాం ధ్రుల కోసం, వారి నిధులతోనే ఈ భవనం నిర్మిం చనున్నారు.

ఇందులో నివాస ఫ్లాట్లను, కార్యాలయ ప్రాంతాన్నీ వారికే విక్రయిస్తారు. పార్కింగ్ కోసం రెండంతస్తుల సెల్లార్, దానిపై మూడంతస్తుల పోడియం ఉంటుంది. దానిపై 33 అంతస్తుల్లో భవనం నిర్మిస్తారు. రెండు టవర్లలోనూ ఒక్కోదానిలో 29 అంతస్తులు ఉంటాయి. మొదటి టవర్‌లోని 29 అంతస్తుల్లో ఒక్కో అంతస్తుకు 2 చొప్పున రెసిడెన్షియల్ ఫ్లాట్లు ఉంటాయి. రెండో టవర్‌లో కార్యాల యాలు ఏర్పాటవుతాయి. ఈ కార్యాలయాల్లో ఏర్పాట య్యే కంపెనీలతో 30 వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశముంది.

**360 డిగ్రీల్లో అమరావతిని వీక్షించవచ్చు :** రెండు టవర్లను కలుపుతూ పైన నాలుగంతస్తులు నిర్మిస్తారు. దీన్ని పూర్తిగా వాణిజ్య అవసరాలకే కేటాయిస్తారు. రెండు టవర్ల మధ్యలో ఏర్పాటు చేసే గ్లోబ్ ఈ భవనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

అందులో కూర్చుంటే 360 డిగ్రీల్లో అమరావతి నగరం మొత్తాన్ని వీక్షించవచ్చు. గ్లోబ్‌లో 10 నుంచి 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెస్టారెంట్లు, కిచెన్, ఎగ్జిక్యూటివ్ డైనింగ్ హాల్, లాంజ్ వంటివి ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకంగా ఎన్ఆర్టీ క్లబ్ హౌస్ ఉంటుంది. సదస్సులు, సమావేశాల నిర్వహణకు 2 వేల సీట్ల ఆడిటోరియం, 1500 సీట్ల యాంఫీ థియేటర్ ఏర్పాటు చేస్తారు.

# లైంగిక వేధింపులతో మహిళ ఆత్మహత్య

>> రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు నిందిత డు దీపక్‌ను కఠి నంగా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. దీనిపై పోలీసులు నిందితుడుని అరెస్టు చేసి జైలుకు పంపారు. మృత్యువుతో పోరాడి మరణించిన నాగాంజలికి మాత్రం న్యాయం జరగలేదు. ఆసుపత్రి యాజమాన్యం నిరక్ష ్యం వలన ఆత్మహత్యకు కారణం అని ప్రజా సం ఘాలు ఆరోపిస్తున్నారు. లైంగికంగా వేధిస్తు న్నాడని యాజమాన్యానికి తెలిసినా పట్టించుకోలేదు. సరైన సమయంలో స్పందించి ఉంటే నాగాంజలి ఆత్మహత్య చేసుకునే కాదు అని అంటున్నారు. నాటకీయం గా ఆసుపత్రి యాజమాన్యం శుక్రవారం ఉదయం మరణించినట్లు ప్రకటించారు. ఇది అంతా ముందుగా ప్రణాళిక ప్రకారం జరిగిందని పలువురు నాయకులు తెలుపుతున్నారు. బాధితురాలు కుటుంబానికి అండగా ఉంటామని నాయకులు, అధికారులు చేతులు దులుపు కున్నారు. బాధితురాలు కుటుంబానికి ప్రభుత్వం తరుపున ఆర్థిక భరోసా లేక ఆసుపత్రి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసిన నాయకులు లేకపోవడం



# కోకోకు అంతర్జాతీయ ధరలపై 10% అధికంగా ఇవ్వాలి

## - వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ ఏప్రిల్ 04 ప్రభాతవార్త ప్రతినిధి:** కోకో గింజలను స్థానిక రైతుల నుంచి నాణ్యమైన అంతర్జాతీయ మార్కెట్ ధరల కంటే 5% నుంచి 10% అధికంగా చెల్లించి కొనాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రాసెసింగ్ సంస్థలను ఆదేశించారు. ఆఫ్ సీజన్ కోకో బీన్స్‌కు ఎంత చెల్లిస్తారో కూడా ముందే తెలియజేయాలని సూచించారు. ప్రాసెసింగ్ సంస్థలు దీనిపై సోమవారం లోపు తమ నిర్ణయాన్ని చెప్పాలన్నారు. కోకో రైతులు, ప్రాసెసింగ్ సంస్థల ప్రతినిధులు, ఉద్యానశాఖ అధికారులతో గురువారం ఆయన సచివాలయంలో సమావేశమయ్యారు. 700 టన్నుల ఆఫ్ సీజన్ కోకో బీన్స్ నిల్వలున్నాయని, వాటిని ముందు కొనుగోలు చేసేలా చూడాలని రైతులు మంత్రిని కోరారు. నాణ్యత పేరుతో ధర తగ్గిస్తున్నారని వాపోయారు. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధర కిలో రూ.680-720 ఉండగా, రాష్ట్రంలో రూ.550 మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. రైతుల సమస్యలపై ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. 25 ఏళ్లగా లేని నాణ్యత, గ్రేడింగ్ సమస్య ఇప్పుడే ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. కోకోలో నాణ్యతా ప్రమాణాలు పెంచేలా రైతులకు శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు.

# ఆస్తులు కాజేసిన మేనమామగా జగన్ చరిత్రలో మిగిలిపోతారు: వైఎస్ షర్మిల

**విజయవాడ ఏప్రిల్ 04 ప్రభాతవార్త ప్రతినిధి:** సరస్వతి పవర్ షేర్ల ఎంవోయూపై వైకాపా అధ్యక్షుడు జగన్ స్వయంగా సంతకం చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఇప్పటి వరకు ఒక్క ఆస్తి కూడా జగన్ తనకు ఇవ్వలేదని చెప్పారు. విజయమ్మకు సర్స్వతి పవర్ షేర్లను జగన్ గిఫ్ట్‌డీడ్ కింద ఇచ్చారు. ఇచ్చిన షేర్లు మళ్లీ తనకే కావాలని ఆయన కోర్టుకు వెళ్లారు. స్వయంగా తల్లినే జగన్ మోసం చేస్తున్నారు. తల్లిపై కేసు వేసిన కుమారుడిగా మేనల్లుడు, మేనకోడలి, ఆస్తులు కాజేసిన మేనమామగా ఆయన చరిత్రలో మిగిలిపోతారు. జగన్‌కు విశ్వసనీయత ఉందో లేదో వైకాపా వారే ఆలోచించాలి అని షర్మిల వ్యాఖ్యానించారు.

# రికార్డు స్థాయిలో రైలు బోగీల ఉత్పత్తి



రైలు బోగీల ఇమేజ్

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 4,ప్రభాతవార్త** రాబోయే భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే శాఖ రైలు బోగీలను ఉత్పత్తి చేయడంలో అభివృద్ధి పథం వైపు పయనిస్తోంది. 2024-25ఆర్థిక సంవత్సరంలో అత్యాధునిక యాంత్రిక, సాంకేతిక పరిజ్ఞానంతో 7,134రైలు బోగీలను ఉత్పత్తి చేసి రికార్డు నెలకొల్పింది. చెన్నైలోని ఇంటగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ(ఐసిఎఫ్) 3,007రైలు బోగీలను ఉత్పత్తి చేయగా, కపుర్తలలోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ (ఆర్‌సిఎఫ్)-2,102 బోగీలను, రాయ్ బరేలీలోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీ (ఎంసిఎఫ్) 2,025బోగీలను వెరసి మొత్తం 7,134రైలు బోగీలను అందుబాటులో తెచ్చింది.

# వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం ప్రజాస్వామ్య విజయం కంటే ఎక్కువ : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** వక్ఫ్ సవరణ బిల్లు పార్లమెంటు ఉభయ సభల ద్వారా ఆమోదం పొందడం కేవలం ప్రజాస్వామ్య విజయం కంటే ఎక్కువ ప్రతిబింబిస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ "ఎక్స్" ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. ఇది న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం వైపు ఒక చారిత్రాత్మక అడుగు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ఎన్డీయే పరిపాలన దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి తన నిబద్ధతను మరోసారి నిరూపించుకుందన్నారు. సంవత్సరాలుగా, వక్ఫ్ బోర్డుల కార్యకలాపాల గురించి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయన్నారు. వక్ఫ్ బోర్డు సవాళ్లను పరిష్కరించడం, పారదర్శకతను పెంచడం, వక్ఫ్ ప్రయోజనాలు పేద ముస్లింలకు చేరేలా చూడటం, ముస్లిం మహిళలకు బోర్డులో ప్రాతినిధ్యం కల్పించడం వైపు ఈ సవరణ ఒక ముఖ్యమైన అడుగు అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ బిల్లుపై ఏకపక్ష నిర్ణయం కాకుండా, ఈ బిల్లును లోక్‌సభలో దాదాపు 12 గంటలు, అలాగే రాజ్యసభలో దాదాపు 14 గంటలు పూర్తిగా చర్చలు జరిగాయని, ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రతి



ఆందోళనను పరిష్కరించారని, ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చారని పవన్ కల్యాణ్ అన్నారు. బాధ్యతాయుతమైన, రాజ్యాంగ బద్ధమైన ప్రభుత్వం ఇలా పని చేస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ముఖ్యమైన బిల్లును ప్రవేశ పెట్టడంలో.. మార్గనిర్దేశం చేయ డంలో నాయకత్వం వహించి నందుకు పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల సంక్షేమ మంత్రి కిరణ్ రిజిజు, హోం మంత్రి అమిత్ షా.. రాజ్యసభలో ఎన్డీయే నాయకుడు జేపీ నడ్డాలకు తాను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ సంస్కరణకు మద్దతు ఇచ్చిన ప్రతి ఎంపీకి, అలాగే వారి మద్దతుకు ముస్లిం సమాజానికి కూడా తాను కృతజ్ఞతలు తెలియజేసినట్లు చెప్పారు. 2008-2009 చట్టం చెప్పినట్లుగా, దేవుని ఆస్తి దోచుకోవడం కేవలం దేశ ద్రోహం కంటే ఎక్కువని.. ఇది దేవుడికి ద్రోహమని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కొత్త ఖిగేలీనినిదీఖి చట్టం కేవలం చట్టం కంటే ఎక్కువని.. ఇది ఒక నైతిక వైఖరి అని అన్నారు. ఇది పవిత్ర ఆస్తులను రక్షించడం, వక్ఫ్ బోర్డును బలోపేతం చేయడం, న్యాయమని,

న్యాయానికి ఎన్డీయే ప్రభుత్వం నిబద్ధతను ప్రదర్శించడం గొప్ప విషయమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. సుదీర్ఘ చర్చ అనంతరం గురువారం అర్ధరాత్రి దాటాక సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ఈ బిల్లును బుధవారం అర్ధరాత్రి దాటాక లోక్‌సభ ఆమోదించిన సంగతి తెలిసిందే. లోక్‌సభలో 288-232 ఓట్లతో బిల్లుకు ఆమోదం లభించింది. వక్ఫ్ సవరణ బిల్లు(యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్ (యూఎంఈఈడీ- ఉమీద్)కు లోక్‌సభ ఆమోదం తెలపడంతో కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లును చట్టవిరుద్ధమైనదిగా పేర్కొన్న ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



సచివాలయంలో అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న హోంమంత్రి అనిత,జిఎడి సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా

# సచివాలయంలో అగ్ని ప్రమాదంపై విచారణ చేస్తాం : హోంమంత్రి అనిత

## - ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమిక నిర్ధారణ

**సచివాలయం,ఏప్రిల్ 4,ప్రభాతవార్త :** సచివాలయంలోని రెండో బ్లాక్‌లో జరిగిన అగ్ని ప్రమాదం ఘటనపై విచారణకు ఆదేశించామని రాష్ట్ర హోం,విపత్తు నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాటా ్లడి ఘటన పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉదయం 6.30గంటల సమయంలో రెండో బ్లాక్‌లోని బ్యాటరీల నుంచి పొగలు రావడాన్ని ఎస్పిఎఫ్ సిబ్బంది గమనిచి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారన్నారు. కేవలం 10నిమిషాల్లోపై అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారన్నారు. జిఎడి,సీఆర్డీఎ శాఖాధికారులు షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని ప్రాథమిక అంచనాకు వచ్చారని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదంలో కేవలం బ్యాటరీలు మా త్రమే దగ్ధమయ్యాయని, అంతకు మించి ప్రమాదం ఏమి లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

# ఘనంగా అమరావతి చిత్రకళా ప్రదర్శన

## సిఎం స్వీయ చిత్రం రూ.1,01,116లకు కొన్న డిప్యూటీ స్పీకర్

**ఉమ్మడితూర్పుగోదావరిజిల్లా బ్యూరో, ఏప్రిల్ 4 ప్రభాతవార్త** రాష్ట్రంలో కళలకి, కళాకారులకి పూర్వ వైభవం ఖచ్చితంగా వస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో కళకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. స్థానిక సెంట్రల్ జైలు ప్రధాన రహదారిపై అమరావతి చిత్రకళ



ప్రదర్శను ముఖ్య అతిథిగా పాల్గొని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రియేటీవ్ అండ్ కల్చరల్ కమీషన్ చైర్మన్ తేజస్వి పొడవాటి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లుగా రాజమహేంద్రవరం లో ఈ ప్రదర్శన నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శన చూడడంతో పాటు కళలు, కళాకారులను ప్రోత్సహిస్తూ చిత్రాలను కొనుగోలు చేయాలని కోరారు. కళ ప్రదర్శనకు అమరావతి పేరు పెట్టారు, అమరావతి లోనే ఇది నిర్వహిస్తే బాగుంటుంది అని నేను చెబితే, సాంస్కృతిక రాజధాని లో రాజమహేంద్రవరం లో పెట్టడం సముచితం అని మంత్రి దుర్గేష్ సూచించడం జరిగిందన్నారు. మరో ముఖ్య అతిథి మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఇక్కడ కు అనేక మంది కళాకారులు గీసిన చిత్ర పటాలు చూసి ప్రతిభను గుర్తించి కొనుగోలు చేస్తే కళాకారులకి ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. కల్చర్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం అంటే గుర్తుకు వచ్చేలా .. కళలకి కణాచికగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రన్నీ తీర్చి దిద్దేలా వుందన్నారు. శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామ కృష్ణ లు మాట్లాడుతూ, రాజమహేంద్రవరంలో గత ప్రభుత్వం హయంలో కళకి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వీయ చిత్రాన్ని ఉప సభాపతి కె. రఘు రామకృష్ణంరాజు రూ.1,01,116/ లకు కొనుగోలు చేశార. దీనిలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైను, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జిల్లా ఎస్పీ డి నరసింహా కిషోర్, సాంస్కృతిక శాఖ సంచాలకులు డి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. చిత్ర కళా ప్రదర్శనతో ట్రాఫిక్ ఇక్కట్లు.. రాష్ట్ర ప్రభుత్వం సృజనాత్మక సాంస్కృతి సమితి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ప్రధాన రహదారిపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న చిత్ర కళా మహోత్సవంలో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. జైలు రోడ్డు పూర్తిగా మూసి వేశారు.

# ఫార్మసి విద్యార్థిని నాగ అంజలి మృతి బాధాకరం

## - హోంమంత్రి వంగలపూడి అనిత...

**విజయవాడ ఏప్రిల్ 04 ప్రభాతవార్త ప్రతినిధి:** నిండు ప్రాణం కాపాడడానికి వైద్యులు చివరివరకూ ప్రయత్నం చేశారు. బతికించుకోవాలనే తపన మాది. శవరాజకీయం చేయాలనే ఆతృత విపక్షాలది. ఘటన తెలిసిన వెంటనే స్పందించాం. మెరుగైన వైద్యసేవలకు ఆదేశించాం. నాగ అంజలికి, బాధిత కుటుంబానికి అండగా ఉంటాం, న్యాయం చేస్తాం. విద్యార్థిని తండ్రి, పెదనాన్నతో నేరుగా ఫోన్ చేసి మాట్లాడి ధైర్యం చెప్పాం. ప్రాణం కాపాడుకోవాలనే విద్యార్థిని చికిత్సకు ప్రత్యేక వైద్యబృందం ఏర్పాటు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు చెందిన జనరల్ మెడిసిన్, న్యూరాలజీ, అనస్థిషియా డాక్టర్లతో కమిటీ వేశాం. హెల్త్ బులెటిన్‌ను విడుదల చేయడమే కాకుండా కలెక్టర్ ద్వారా నివేదికలు తీసుకున్నాం. స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాం. నిష్పక్షపాతంగా ఫార్మా విద్యార్థిని కేసు విచారణ. అబద్ధాలతో విషప్రచారం చేయడం తగదు. అనుమానాలు, అపోహలకు తావులేకుండా పాదర్శకంగా విచారణ. నిందితుడిని గాలించి పట్టుకున్నాం. దర్యాప్తు పూర్తికాగానే కఠిన చర్యలు. విపక్షాల విమర్శల్లో వాస్తవం లేదు. ఆడబిడ్డల రక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. చిన్నారులు, మహిళల రక్షణకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

# తిరుపతి ఐఐటిలో కోటుటెల్లే పిహెచ్‌డికి అగ్డర్ యూనివర్సిటితో ఒప్పందం

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 4 ప్రభాతవార్త** తిరుపతి ఐఐటిలో ఎప్పటి కప్పుడు విద్యార్థులకు ఉపయోగపడే సబ్జెక్టులతో ముందడుగు వేస్తుంది. పదేళ్ళలో ఎన్నో విజయాలతో శరవేగంగా అభివృద్ధి



నార్వే యూనిర్శిటిలో తిరుపతి ఐఐటి ఒప్పందం

దిశగా పయనిస్తున్న ఐఐటి మరో అడుగుముందుకు వేసింది. శుక్రవారం నార్వేలోని అగ్డర్ యూనివర్శిటీతో కోటుటెల్లే పిహెచ్‌డి కోర్సు కోసం ఒప్పందంపై సంతకాలు చేసారు. రెండుస ంస్థల మధ్య విద్యా,పరిశోధనా సహకారాన్ని పెంచుతుందని డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ సత్యనారాయణ మీడియాకు వివరించారు. ప్రపంచ భాగస్వామ్యాలను పెంపొందించటంలో ముఖ్యమైన మైలు రాయి అని అభివర్ణించారు. ఆగ్డర్ యూనివర్శిటి నుంచి వచ్చిన ప్రతినిధి బృందానికి ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ విభాగంలో ప్రొఫెసర్లు,రిసెర్చ్ గ్రూప్ లీడర్ ప్రొఫెసర్ లింగారెడ్డి సెంకెరమద్ది టెక్నాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పోల్కేహోంగ్లాండ్,ఇంజనీరింగ్ సైన్స్ విభాగంకుచెందిన ప్రొఫెసర్ పాల్ రాగ్నార్‌స్వెన్నెవిగ్ నాయకత్వం వహించారు. డైరెక్టర్ ప్రొఫెసట్ సత్యనారాయణ సీనియర్ అధ్యాపకులు డీన్, డాక్టర్‌శశీధర్‌గుమ్మా ల సారధ్యంలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి ఐఐటి కార్యకలాపాల అవలోకనంతో ప్రారంభం అయ్యిందన్నారు. లింగారెడ్డి మాట్లాడుతూ యుఐఏ విద్యాక్రమాలను ప్రశంసించారు. ఉమ్మడి పరిశోధన అధ్యాపకులు మరియు విద్యార్థుల మార్పిడికి రెండు సంస్థల నిబద్ధతలను ఉమ్మడి పర్యవేక్షణలో పరిశోధనలు చేస్తూనే డాక్టరల్ విద్యార్థులు రెండు సంస్థల నడుంచి డిగ్రీలను సంపాదించటానికి వీలు కల్పించే ందుకు కోటుటెల్ పిహెచ్‌టి ప్రోగ్రాంపై సంతకాలు చేసినట్లు వివరించారు. ఒప్పందంపై సంతకాలు చేసిన తరువాత రెండు సంస్థలు సంభావ్య ఉమ్మడి పరిశోధనల ప్రాజెక్టులు,అధ్యాపకులు మార్పిడి కార్యక్రమాలు,కోటుటెల్లే ఫ్రం వర్కు కింద విద్యార్థుల చలనశీతకు అవకాశాలను అన్వేషిస్తూ ముందుకు సాగేలా మార్గంలో చర్చలు జరిగాయి. ఈ ఒప్పందం తిరుపతి ఐఐటి యుఐఏ మద్యదీర్ఘకాలిక విద్యా సంబంధానికి నాంది పలికిందన్నారు. సహకార పిహెచ్‌టి ప్రోగ్రాం ద్వారా ప్రపంచ జ్ఞాన భాగస్వామ్యం సాంకేతిక పురోగతికి దోహదపడుతుందనే ఆశాభావం వ్యక్తం చేసారు.

# అన్న కర్మకాండ కార్యక్రమానికి వెళ్తూ సోదరులు మృతి

**అంబాజీపేట,ఏప్రిల్ 4, ప్రభాతవార్త..** మండలంలోని గంగలకుర్రు గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు సోదరులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగలకుర్రుకు చెందిన మంగిపూడి సూర్యనారాయణ, రామచంద్రరావు, నాగరాజులు సోదరులు. కాగా ముగ్గురులో పెద్దవాడైన సూర్యనారాయణ మార్చి 24న మృతి చెందారు. సూర్యనారాయణ కర్మకాండల కార్యక్రమంలో భాగంగా వారి ఇంటికి కొంత దూరంలో ఉన్న కౌశిక పాయకు తమ మోటార్ సైకిల్ పై రామచంద్రరావు, నాగరాజులు శుక్రవారం ఉదయం వెళ్తున్నారు. వారి ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న నాలుగు రోడ్ల సెంటర్ కు వచ్చేసరికి ముక్కామల, ఇరుసుమండ మీదుగా అంబాజీపేట వైపు వస్తున్న లారీ వీరి మోటార్ సైకిల్ ను బలంగా ఢీ కొట్టి, కొంత దూరం ఈడ్చికి వెళ్ళింది. ఈ ప్రమాదంలో ఇరువురు సోదరులకీ తీవ్ర గాయాలు కావడంతో 108 లో అమలాపురం ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. మార్గమధ్యంలో నాగరాజు (64) మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రామచంద్రరావు(67) కూడా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. 11రోజుల వ్యవధిలో ముగ్గురు సోదరులు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు భీతిల్లిపోయారు. రామచంద్ర రావు అవివాహితుడు కాగా నాగరాజుకు భార్య, కుమార్తు ఉన్నారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ కె.చిరంజీవి చేరుకుని ప్రమాదం జరిగిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్ అక్కడ నుండి జారుకుని పోలీస్ స్టేషన్ కి వచ్చాడని ఎస్ఐ తెలిపారు. ఈ కేసును పి. గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజు దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక సర్పంచి కాండ్రేగుల శ్రీనివాసరావు ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించేందుకు సహకరించారు.

## కన్నులపండువగా ముగిసిన కోదండరాముని బ్రహ్మోత్సవాలు

**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ఆధీనంలోని తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో తొమ్మిదిరోజులు అత్యంత వైభవంగా జరిగిన కోదండరాముని వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయంతో ముగిశాయి. ఉదయం కోదండరాముని ఉత్సవమూర్తులను ఆలయం నుండి ఊరేగింపుగా కపిలతీర్థంలోని పుష్కరిణి వద్దకు మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్ళారు. అక్కడ సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి శ్రీరామచంద్రమూర్తి ఉత్సవమూర్తులకు శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపనతిరుమంజనం వేదోక్తంగా నిర్వహించారు. ఇందులో ముందుగా విశ్వక్సే నారాధన, పుణ్యాహవచనం, ,ముఖప్రక్షాళన, దూపదీపనైవేద్యం,రాజోపచారం నిర్వహించారు.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)
NIT No. 04/CRDA-14023(34)/1/2025-ESM, Dated:03.04.2025
**E Procurement Tender Notice**
**Name of Work** :APCRDA-"Expression of Interest for Establishment and Operation of Construction and Demolition (C & D) Waste Recycling Plant of 50 TPD capacity in Amaravati capital city.
The bid can be downloaded on AP e-procurement portal from 07.04.2025 to 22.04.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 22.04.2025 up to 15.00 Hrs, Technical bid opening 22.04.2025 @16.00Hrs.For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Vijayawada.



**MUNICIPAL CORPORATION :TIRUPATI**

The Commissioner, Municipal Corporation, Tirupati invites Tender on e-procurement platform from the " **eligible contractors"** for the following works.

| IFB Nos | Name of the works | No of works | ECV amount in Rs. in Lakhs |
|---|---|---|---|
| IFB No: (Recalls RFP.03) & 01 to 03/ TPT/2025-26/GEN/T, Dated: -04-2025 | Providing Third Party Quality Assurance for the Works taken, Extension of VC Hall on 1st Floor of Temporary Municipal Office Building, Arrangement of shade by Providing Pre-painted Galvalune Trapexoidal Profile Roofing Sheets. | 4 works | 12.52 lakhs |
| Total | | 4 works | 12.52 lakhs |

For particulars please contact Municipal Engineer during office working hours (or) see e-procurement market place: https://tender.apeprocurement.gov.in
**Commissioner, Municipal Corporation, Tirupati**



మిగిలిన షేర్‌హోల్డర్‌ల యొక్క గమనిక నిమిత్తం ఎగ్జిట్ ఆఫర్
**స్కూటర్స్ ఇండియా లిమిటెడ్**
(ఒక భారత ప్రభుత్వ సంస్థ)
కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్ : L25111UP1972GOI003599
నమోదిత కార్యాలయం : 3/481, 1వ అంతస్తు, వికల్పఖండ్
గోమ్తీ నగర్, లక్నో, ఉత్తర ప్రదేశ్, ఇండియా-226010: ఫోన్ నం: 0522-3119593
వెబ్‌సైట్ : www.scootersindialimited.com, ఇ-మెయిల్ ID : csscootersindia@gmail.com

(ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్ చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి) (ఎగ్జిట్ దరఖాస్తు ఫారం చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి) (షేర్ ట్రాన్స్‌ఫర్ ఫారం చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి)

ప్రదేశం : లక్నో
తేదీ : ఏప్రిల్ 05, 2025
ఎక్వైరర్ తరఫున మరియు కొరకు
సం/- నవీన్ కౌల్
(అధీకృత సంతకందారులు)


# తిరుపతి ఐఐటి పదేళ్ల ప్రస్థానం: ఎన్నో విజయాలు

**ప్రభాతవార్తతో డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ సత్యనారాయణ మాటామంతి**
**(శ్రీకాళహస్తి-ప్రభాతవార్త)**

**తిరుపతి ఐఐటి కేంద్ర విద్యాసంస్థను 2014లో అప్పటి పాలకులు ప్రకటించారు.ఈ కేంద్ర విద్యాసంస్థను ఏర్పేడులో సుమారు 540 ఎకరాల్లో నిర్మించారు.శుక్రవారం పదవ వార్షికోత్సవం జరుపుకో నుంది. ఈ సందర్భంగా ప్రభాతవార్త డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌సత్యనారాయణను కలసినపుడు ఆయన పదేళ్ళ ప్రస్థానం ఒడుదుడుకులను పంచుకున్నారు. ఆయనతో సాగిన మాటా మంతిని యథాతథంగా అందిస్తున్నాము.**

**ప్రభాతవార్త: తిరుపతి పేరుతో స్థాపించిన ఐఐటి ఏర్పేడులో నిర్వహించటం పట్ల మీ అనుభూతి ఏమిటి?**

**డైరెక్టర్** :తిరుపతి,శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలు మధ్యలో ఏర్పేడులో మళయాళ సద్గురు ఆశ్రమం ఇక్కడ ఐఐటి ఏర్పాటు చేయటం ప్రశాంత వాతావరణంలో 2022 నుంచి పూర్తి స్థాయిలో నిర్వహించటం చక్కటి కాంపస్‌ను ఏర్పాటు చేసుకోవటం మరపు రాని అనుభూతి

**ప్రభాతవార్త:** పదేళ్ళ ప్రస్థానంలో మీరు ఎలా ఫీలౌతున్నారు?

**డైరెక్టర్** :2015 స్థాపించినప్పటికి దశాబ్ద కాలంలో విద్యానైపుణ్యం,మౌళిక సదుపాయాలు,శాశ్వత కాంపస్,పరిశోధనలు, అవిష్కరణలు,పరివర్తన ప్రభావాన్ని సాధించటంలో ఎంతో సంతృప్తి చెందాను

**ప్రభాతవార్త : కళాశాల అభివృద్ధి మాటేమిటి?**

**డైరెక్టర్** : పదేళ్ళుగా తమ కృషి ఫలించిందని భావిస్తున్నాను.జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రముఖ సంస్థగా తీర్చి దిద్దటంలో తమ కృషి ఫలించిదని భావిస్తున్నాను. భవిష్యత్ విద్యార్థి నాయకులుగా తీర్చి దిద్దటంలో తమ వంతు కృషి చేసాము.అత్యాధునిక పరిశోధనలు,పరిశ్రమల సహకారంద్వారా విజ్ఞానాన్ని పెంపోందించటానికి అంకితం చేసాము.

**ప్రభాతవార్త :** మీరు సాధించిన విజయాలేమిటి?

**డైరెక్టర్** : 2014లో కేంద్ర ప్రభుత్వం ఐదు కొత్త ఐఐటిలను ప్రకటించింది. అందుతో తిరుపతి ఐఐటి ఒకటి. 2015 మార్చి 28న పునాది రాయి వేసారు. 2015 ఆగస్టు 5న తాత్కాలిక క్యాంపస్ నుంచి దాని మార్గదర్శక సంస్థ ఐఐటి మద్రాస్ మద్దతుతో కార్యక్రమాలను ప్రారంభించాము. ఒక పర్వతంలో శాశ్వత క్యాంపస్‌ను బహుళ దశల్లో ప్రణాళిక బద్ధంగా చేపట్టాము. 12వేల మందికి అనుగుణంగా క్యాంపస్‌ను నిర్మించటానికిమూస్టర్‌ప్లాన్ రూపకల్పన



చేసాము. విద్యార్థులకు సరైన ప్రయోగశాలలు, హస్టళ్ళు, తరగతి గదులు,క్రీడాసౌకర్యాలతో కూడిన దాదాపు 35 ఎకరాల సౌత్ క్యాంపస్ 2018 నాటికి ప్రీఫ్యాబ్ మరియు స్థిరమైన సాంకేతికలను ఉపయోగించి పూర్తి చేసాము. నాల్గవ సంవత్సరం శాశ్వత క్యాంపస్ నుంచి పాక్షికంగా పనిచేయించాము. మొదటి బ్యాచ్ విద్యార్థులు వారిచివరి సంవత్సరం శాశ్వత క్యాంపస్‌లో గడిచేలా ఏర్పాటు చేసామన్నారు.

**ప్రభాతవార్త : విద్యా కార్యక్రమాల మాటేమిటి?**

**డైరెక్టర్** : తిరుపతి ఐఐటిలో 2015 విద్యాసంవత్సరం బిటెక్ సివిల్,కంప్యూటర్,,ఎలక్ట్రికల్ ఇంజనీర్,మెకానికల్ ఇంజనీరింగ్‌తో ప్రస్తానం ప్రారంభించాము. 106 మంది విద్యార్థులతో ప్రస్థానం ప్రారంభించారు. 2018లో కెమికల్ ఇంజనీరింగ్ బిటెక్‌లో ప్రారంభించారు. పరిశోధనల ద్వారా 2017లో ఎంఎస్,పిహెచ్‌డిల ద్వారా విద్యావ్యవస్థను విస్తరించుకున్నాము. 2018లో ఎంటెక్ ప్రారంభించాము. ఇప్పుడు 11 ప్రత్యేక రంగాల్లో అందుబాటులోకి తెచ్చాము. అదనంగా సైన్స్ విభాగాలు కెమిస్ట్రి,మ్యాథమ్యాటిక్స్ మరియు స్టాటిస్టిక్స్,ఫిజిక్స్‌లో ఎంఎస్‌సి ప్రారంభించాము. 2022లో ఇన్‌స్టిట్యూట్ పబ్లిక్‌పాలసీలో మాస్టర్ ప్రోగ్రామ్స్‌ను ప్రవేశపెట్టడం ద్వారా పాఠ్యాంశాలను మరింత వైవిధ్యపరిచింది. ఇలా అమలు చేసిన ఐఐటిల్లో భారత దేశంలో మూడవదిగా అనతి కాలంలోనే ఎదిగింది. సంస్థలో నేడు సుమారు 1700 మంది విద్యార్థుల భాగస్వామ్యం సాగుతుంది. 47మంది ఎంఎస్ పరిశోధన విద్యార్థులు, 346మంది పిహెచ్‌టి పరిశోధన విద్యార్తులు ఉన్నారు. కళాశాలలో 23.7 మంది మహిళలు ఉన్నారు.

**ప్రభాతవార్త** : క్యాంపస్‌లో మౌళిక సదుపాయాలు ఏం కల్పించారు?

**డైరెక్టర్:** : దశ ఏ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసాము. బిదశ నిర్మాణం కోసం వివరణాత్మక డిపిఆర్‌ను విద్యా మంత్రిత్వ శాఖకు సమర్పించింది. 10ఎకరాల విస్తీర్ణంలో రెండు సరస్సులు ఏర్పాటుచేసాము. ఇవి స్థిరమైన వర్షపు నీటి నిర్వహణ కోసం 80 మిలియన్ల లీటర్ల సామర్థ్యం కలిగి ఉన్నాయి. బలమైన నీటి నిర్వహణ వ్యవస్థలో 600 కెఎల్‌డి నీటి శుద్ధి కర్మాగారం రెండుమురుగునీటి శుద్ధి కర్మాగారాలు,మైక్రో ఇరిగేషన్ వ్యవస్థలు ఉన్నాయి. అలాగే 1 ఎండబ్లుయ రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టలేషన్ నీరు మరియుగాలి చల్లబడి చిల్లర్లతోకూడిన కేంద్రీకృత శీతలీకరణ వ్యవస్థను అగ్నిమాపక భద్రతావ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాము. 2024లో జాతీయ అంతర్జాతీయ అవార్డులను సంపాదించాము.

వార్త

కృతజ్ఞత మూడు రూపాల్లో ఉంటుంది. అది గుర్తుంచుకోవడంలోనూ, మాటల వ్యక్తీకరణలోనూ, తిరిగి ఇవ్వడంలోనూ కనిపిస్తుంది.

-ఇ. గిబ్బన్

# కాలం కాని కాలంలో..

తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నిన్నటివరకు వడగాల్పులు నేటి నుంచి వడగళ్లు. ఏదిఏమైనా సామాన్యునికి సైతం 'వడ' దెబ్బ తప్పడం లేదు. వేసవి తాపాన్ని ముందుగానే చవిచూసిన వారు అకాలవర్షాలకు ఆశ్చర్య పోతున్నారు. కాలాలు, రుతువులు, కార్తెలు.. ఇవన్నీ ప్రాచీనకాలం నుంచి ఖగోళ శాస్త్రం నుంచి వచ్చినవే. ఉరుములు, మెరుపులు, పిడుగులు ఇవేమీ ఇప్పటివి కాదు. సృష్టితో పాటే పుట్టాయి. అయినా ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానాభివృద్ధి జరిగాక ఏక్షణాన ఎక్కడ పిడుగులు పడతాయో చెప్పగలుగుతున్నారు. ఒకప్పుడైతే ఆకాశవాణి మాధ్యమంలో వర్షసూచన చెప్పిన సమయానికి వర్షంరాక, ఇక రాదనుకున్న సమయంలో వానచినుకుల గందరగోళం వలన రైతు దిగాలుపడేవాడు. పనల మీద నున్న పంటను జాగ్రతనతపరచుకునే సమయమూ ఉండేదికాదు. ఇప్పుడలాకాదు. చిరుజల్లుల సవ్వడిలు చిటపటలాడకుండానే వాతావరణ సూచన చెవిన పడుతుంది. ఇలా ఉంటే ఎల్‌నినో పుణ్యమా అని కాలంకాని కాలంలో వానలు,ఎండలు జనాన్ని ఇబ్బంది పెడుతున్నాయి.అకాల వర్షాలు వచ్చినప్పుడల్లా జనంపరుగులు తీస్తున్నారు. అయినా తమ పంట ఉత్పత్తులను కాపాడుకోలేకపోతున్నారు. ప్రధానంగా ఈ రోజుల్లో మామిడి తోటలకు బాగా నష్టం వాటిల్లుతోంది. పూత దశ దాటి కోత దశకు చేరుకునే సమయంలో వర్షాల ప్రభావం మామిడి దిగుబడిపై పడింది. అసలే మామిడి పూత ఆలస్యమైన కారణంగా మామిడి రైతులు లబోదిబోమంటున్నారు. రాబడి మీద ఆశ వదులుకున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడినట్లే ఉంది వారి పరిస్థితి. తెలంగాణలో గురువారం నాడు ఉన్నట్టుండి వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. సంగారెడ్డి జిల్లాలో ఒక్కసారిగా పిడుగులు పడి దాదాపు 20 మేకలు మృతిచెందాయి. పిడుగులపై హెచ్చరికలున్నా జీవాల మీద పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం సాధ్యమైన పనికాదు. రెండు,మూడు రోజుల పాటు కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరపులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని వాతావరణ కేంద్రం ముందుగానే హెచ్చరించింది. అయినా హైదరాబాద్ నగరం తడిసి ముద్దయ్యింది. ప్రధాన రహదారులు నీటితో నిండిపోయాయి. పలు చోట్లవృక్షాలు సైతం నేలవాలాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులతో వర్షానికి నేలకొరిగిన చెట్లను డిఆర్‌డిఎ బృందాలు తొలగిస్తే తప్ప ప్రయాణికులు గమ్యస్థానానికి చేరుకోలేకపోయారు. నగరంలోని భారీ సంపుల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుపడటంతో వరద నీటిలో జనావాసాలు మగ్గిపోయాయి. అటువైపుగా జనం కదలికలు ఆగిపోయాయి. జంట నగరం చాలాసేపు జల దిగ్బంధంలో ఉండిపోయింది. రోడ్లన్నీ ఏరులైపారింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పిడుగుపాటుకు నలుగురు రైతులు బలయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో చెట్లు కొమ్మలు విరిగి రహదారులను దిగ్బంధనం చేశాయి. కుండపోతవర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. సంగారెడ్డి, సిద్ధిపేట, నిజామాబాద్ లోనూ కుంభవృష్టి కురిసింది. ద్రోణి ప్రభావంతో క్యుములో నింబస్ మేఘాలు ఏర్పడినందున వివిధ ప్రాంతాలలో భారీవర్షాలు కురిశాయి. ఈ విషయాన్ని వాతావరణశాఖ ముందుగా చెప్పినా అప్రమత్తమయ్యే అవకాశం లేని చోటల్లా పంటలు నాశనమయ్యాయి.కళ్లాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. మరో మూడు రోజులు ఇలాంటి పరిస్థితులే ఉన్న కారణంగా వాటిని సంరక్షించుకోవడం కష్టమే. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గురువారం గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ ఉష్ణోగ్రతల కంటే మూడు డిగ్రీలు సెల్సియస్ మేరతగ్గాయి. నేడో రేపో ఉత్పత్తులు చేతికంది మార్కెట్‌కు తోలితే రాబడి దొరకబుచ్చుకోగలమన్న కన్న ధాన్యం, మామిడి కాయలు నేలనంటాయి. వ్యవసాయ మార్కెట్‌లలో ఎండబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. ఒకవేళ ఎండకు ఎండే పరిస్థితి వచ్చినా మొలక లొచ్చేస్తాయి. కొనేవారెవరూ ఉండరు. ఆరబెట్టిన పొగాకు వానకు తడిసింది. రోడ్లపై ఆరబోసిన ధాన్యాలన్నీ పాడయ్యాయి. పసుపు,మక్కలు తడిసిపోయాయి. మిర్చిబస్తాలు తడిసాయి. టమోటో తోటల్లోకి చేరిన నీరు ఆ పంట ఉత్పత్తులకు ఏమేరకు నష్టం చేకూరుస్తాయో అప్పుడే చెప్పలేం. ఆంధ్రా ప్రాంతంలో శుక్ర, శనివారాలు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కోస్తాజిల్లాలో పిడుగులు పడే అవకాశమున్నందున గాలివానకు తడిసి ఏ చెట్టు కిందకో చేరాలనేప్రయత్నం చేయవద్దని విపత్తు నిర్వహణ సంస్థ ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది. ఇలాంటి వర్షాలు పంటలకు ఎంత నష్టం కలిగిస్తాయో అంతేస్థాయి నష్టాలను భాగ్యనగర వాసులకు కలిగిస్తాయి. ట్రాఫిక్ రద్దీగా తయారై జనం ముందుకు కదిలేఆస్కారం కనిపించదు. నేలవాలిన చెట్లు, తెగిపడిన విద్యుత్ తీగలు ఇవన్నీ జనజీవనాన్ని స్తంభింపచేసే ఆటంకాలే! వరదనీటిలో మునిగిపోయిన వాహనాలకూ నష్టమే. నగరంలో తెరచి ఉన్నమ్యాన్‌హోళ్ల ఆచూకీ తెలియకపోతే ఆనక ఇబ్బంది పడాల్సిందే.ప్రజలు అందుచే వానాకాలంలో డీప్ మ్యాన్‌హోళ్ల దగ్గర ఖచ్చితంగా ఒక జవాబుదారీ వ్యక్తిని పురమాయించాలి. విశేషంగా చెప్పదగిన విషయం భారీ వర్షాల దెబ్బకు పెద్ద ప్రజలు ఎత్తున గాలి వీచి చార్మినార్ నిర్మాణం ఉంచి పెచ్చులు ఊడిపడ్డాయి. ఇలా జరగడం ఇదే మొదటిసారి కాకపోవడంతో ఆ ప్రాంతానికి వచ్చిన పర్యాటకులు భయభ్రాంతులయ్యారు.ఇలాంటి భారీవర్షాల వల్లదెబ్బతినకుండా జంట నగరాల్లోని చారిత్రిక కట్టడాలను సంరక్షించేందుకు ప్రత్యేక ఆర్కియాలజీ టీమ్‌ను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.



మనుషులను వారి మిత్రుల్ని బట్టి, వారి స్వభావాన్ని బట్టి అంచనా వేయవచ్చు.

స్వీడెన్‌బర్గ్



వయస్సులో ఉన్నప్పుడే మంచి పనులు చేయి. ఆలస్యం అయితే కాలం నీ చేతిలో ఉండదు.

స్పెన్సర్

# ప్రజావాక్కు

### విద్యా హక్కులపై ముసురు

**భూములపై** వివాదం మళ్లీఒక్కసారిగా చర్చనీయాంశంగా మారింది.గచ్చిబౌలిప్రాంతంలోని విశ్వవిద్యాలయ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించడంతో విద్యార్థులు, అధ్యాపకులు, సామాజిక కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈభూములు మొదట విశ్వవిద్యాలయానికి ఎలా కేటాయించబడ్డాయి? ఇప్పుడు ప్రభుత్వంవాటినిస్వాధీనం చేసుకోవడాన్నిఎలా సమర్థించుకోవచ్చు? ఈ ప్రశ్నలు గంభీరంగా మారాయి. హైదరాబాద్‌విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూములు విద్య, పరిశోధన, అభివృద్ధి కోసం మాత్రమే వినియోగించాలి అనే నిబంధనలున్నాయి.తాజాగా సుప్రీంకోర్టు ఈ భూసేకరణవ్యవహారంపై కీలకతీర్పు వెలువరించింది. విశ్వవిద్యాలయ భూములను మౌలిక సదుపాయాల కోసం వినియోగించడంలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని, విద్యార్థులప్రయోజనాలను దృష్టిలోఉంచాలనికోర్టు స్పష్టంగా పేర్కొంది.అంతేకాక, ఈభూముల స్వాధీనంపై తక్షణ స్టేవిధిస్తూ, మరింత విచారణ అవసరమని ప్రకటించింది.

-అప్పన్న గొనప, విశాఖపట్నం

### కాలనీలలో ఇండ్ల స్థలాల కబ్జాలు?

గతంలో ప్రభుత్వ ఆర్థిక సహాయంతో పేద ప్రజలకు పంచిన ఇండ్లస్థలాలు కబ్జాలుచేస్తున్నారు.ఇంటి ప్రక్కవారు కొంత స్థలాలు ఆక్రమించుకొనికొన్ని గజాలస్థలాలలో మరుగుదొడ్డి స్నానం గదులను నిర్మించడం జరుగుతుంది. పోలీస్ స్టేషన్ తహసిల్దార్ కార్యాలయాలలో ఫిర్యాదు చేసినా కూడా ఎవరు పట్టించుకోవడం లేదు. వికలాంగులకు సంబంధించిన ఇండ్ల స్థలాలు ఈవిధంగా కబ్జాలకు జరుగుతున్నాయి. అడిగితే దాడులు దౌర్జన్యాలు గొడవలు దూషణలు చేస్తున్నారు. రెవిన్యూశాఖవికలాంగుల సంక్షేమశాఖ తప్పనిసరిగా కబ్జాలకు గురైన వికలాంగుల భూములను వారికి ఇప్పించాలి.

-రాపాక రవీందర్, జనగాం

### ఉపాధ్యాయుల కొరత

తెలంగాణ ఆదర్శపాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థులకు ఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడు కూడాలేడు. ఉపాధ్యాయులను వలంటీర్లుగా నియమించుకుని అరకొరజీతాలతో నెట్టుకుస్తుంది ప్రభుత్వం. ఉపాధ్యాయులకొరతవలనవిద్యార్థులలోక్రమశిక్షణ లోపిస్తుంది.

-జి. ప్రశాంత్, గోధుర్, జగిత్యాల జిల్లా

### నేరాలు.. ఘోరాలు

**నవ మాసాలు** మోసి రక్తధారలతో కన్నతల్లికి తన బిడ్డల యోగక్షేమం కోసం ఎటువంటి త్యాగానికైనా తయారుగా ఉంటుందే. ఆ దేవుడు సృష్టించెను తనకు మారుగా అన్న కీర్తిని పొందినది మాత మాత్రమే.అమ్మ మొదటిగురువు, దైవం. తరువాత వరుసగా తండ్రి, విద్య నేర్పిన గురువు, నాలుగవ వారు దేముడు అని అన్ని శాస్త్రాలు విశదంగా చెప్పాయి. అటువంటి తల్లులు ఈ మధ్య తమ వివాహేతర సంబంధాలకు అడ్డు వస్తున్నారని తన పిల్లలను అతి క్రూరంగా చంపి, కట్టుకున్న భర్తను వదిలి లేదా అతన్నికూడా మట్టుబెట్టి పరపురుషుని చెంత చేరుతున్నారు.అలాగే భర్తలు కూడా భార్యలను పిల్లలను అంతమొందించి ప్రియురాళ్ల పాలన పడుతున్నారు. చివరకు జైళ్లకు చేరుతున్నారు. మరి వీళ్లు ఆశించినది దక్కినట్టా?

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### న్యాయ స్వతంత్రతే శ్రీరామరక్ష

**భారత** రాజ్యాంగ లక్షణాలలో ఒకటి న్యాయ స్వతంత్రత కూడా ఒక భాగం అయితే ఇప్పుడు అదే ప్రమాదంలో పడింది. ఎప్పుడెప్పుడు కొలీజియంలో తప్పులు దొరుకుతాయా అని ఎదురుచుస్తున్నట్టు ఉందిప్రభుత్వం పరిస్థితి.ఎందుకంటే జాతీయ న్యాయనియామకాల చట్టంతెచ్చి తలఊపేవాళ్లను నియమించుకోవాలి అని ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నది. తల ఊపి తీర్పులు చెబితే న్యాయమూర్తుల పదవీ విరమణ తరవాత పెద్దల సభకు పంపే ఏర్పాటుచేస్తుంది. ప్రభుత్వం లేదా గవర్నర్ గిరి అయిన ఇచ్చే సాంప్రదాయం ఉంది. ఇదే ఉదంతాలు జస్టిస్ రంజన్ గొగోయ్ కేస్‌లోను, జస్టిస్‌నజీర్ కేస్‌లోను చూడొచ్చు. రాజ్యాంగ సవరణ చట్టంను కొట్టివేస్తూ జస్టిస్ కెహార్ ఇచ్చిన తీర్పులో రాజ్యాంగం హామీపడిన హక్కులను రక్షించాలంటే న్యాయస్థానాల స్వతంత్రతను కాపాడడం ఒక్కటే మనం చేయాల్సింది.

-మిథునం, హైదరాబాద్

### ప్రమాదకరం !

ఈమధ్య కొందరు ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డు దాటుతున్న పాదచారులని ఢీకొడుతూ వారి ప్రాణాలు పోవడానికి, అంగవైకల్యానికి కారణమవుతున్నారు. ట్రాఫిక్‌రూల్స్ పాటించమని, హెల్మెట్ పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనం పైన ఇద్దరు కంటే ఎక్కువ మంది ప్రయాణించవద్దని, అతివేగం వద్దని జరిమానాలు విధిస్తున్నా కొందరు అసలు లెక్కచేయడం లేదు.

-ఎన్. కృష్ణ, హైదరాబాద్

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# శాస్త్రం ఒకటే.. భాష్యాలే వేరు!

**సన్మార్గంలో నడిపేందుకు సనాతన ధర్మకర్మిష్టులైన మన పూర్వీకులు ఎన్నో గ్రంథాలు రచించారు. సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తత్వరహస్యాలతో ఎన్నో ఇతిహాసాలు అందించారు. వీటి ప్రామాణికతను, ప్రాముఖ్యతను వివరించి ప్రజలకు అందించడంలో ఈ పెద్దలు పోటీపడాలి కానీ పొగడ్తల్లో కాదు. మఠాధిపతులు, స్వామిజీలు, సంతులు, పండితులు, వైజ్ఞవిజ్ఞానసంపన్నులు తదితర పెద్దలందరూ పెద్దమనసుతో ఆలోచించాలి. రాజకీయ నేతలకోసం కొందరు స్వామిజీలు శాస్త్రాలను వక్రీకరిస్తున్నారనే అనుమానాలకు బలం చేకూర్చేవిధంగా వ్యవహరించకూడదు. ఏదిఏమైనా పంచాంగశ్రవణ కర్తలు శతాబ్దాలతరబడి అనాదిగా వస్తున్న పంచాంగ శ్రవణాన్ని ప్రహసనం చేయడం ఏమాత్రం సమంజసం కాదు.**

దామెర్ల సాయిబాబ

ఏ శాస్త్రమైనా మధించే కొద్దీ కొత్త విషయాలను ఆవిష్కరిస్తుంది. శాస్త్రాలను అధ్యయనం చేసిన పండితులు స్వామిజీలు, పీఠాధిపతులు, ఇతర వైజ్ఞానిక సంపన్నులు వాటిలోని ఆంతర్యాన్ని, మారిన కాల,మాన పరిస్థితులకు అనుగుణంగా సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో విషయాలు అందించాలి. అప్పుడే ఆ శాస్త్రాలపైన, వాటిని బోధించే పెద్దలపైన వాటన్నింటికి మూలమైన దైవంపైన విశ్వాసమే కాదు, ఆరాధన కూడా పెరుగుతుంది. ఇందులో దైవం కంటే పెద్దల పాత్రేకీలకం. అందుకే వారు ప్రవచించడం, ప్రబోధించడమేకాదు వీలైనంతవరకు ఆచరించి చూపించే విధంగా ఆదర్శప్రాయంగా వారి ప్రవర్తన, వ్యవహార శైలి, వేషభాషలు కూడా వారి గౌరవం పెంచేలా ఉండాలి. అందుకు భిన్నంగా ప్రవర్తన ఉన్నట్లు ప్రజలు గ్రహిస్తే వారి బోధనలకు ప్రవచనాలకు ఏమాత్రం విశ్వసనీయతఉండదు. అందుకే కొందరు మఠాధిపతులకు, స్వామిజీలకు, పీఠాధిపతులకు ఎక్కడలేని ప్రజాదరణ ఉండి, జనం వారి ప్రవచనాలు వినేందుకు తండోపతండాలుగా తరలివస్తుంటే మరికొందరు స్వామిజీల ప్రసంగాలకు, రాజకీయ సమావేశాలకు తరలించినట్లు కూలి జనాన్ని తరలించాల్సి వస్తుంది.వాస్తవంగా భారత్‌లో శాస్త్రాలకు కొరతలేదు. ఏదిఎప్పుడు ఎలా చేయాలో అనే వివరాలు చాలాస్పష్టంగా మన పూర్వీకులు శాస్త్రాల్లో స్పష్టంచేశారు. దాన్ని అర్థంచేసుకొని అన్వయించుకోవడంలోనే అసలు విషయం దాగిఉంది. తెలుగు ప్రజలకు ప్రధానమైన పండుగలలో పవిత్రమైనది తొలి పండుగ ఉగాది. తెలుగువారు ప్రపంచంలో ఎక్కడున్నా ఈ పండుగకు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. వాస్తవానికి పండుగలు సమాజానికి జీవాధారం. అవి నూతన ఉత్తేజాన్ని ఇస్తాయనే విషయాన్ని కాదనలేం. అన్నింటికంటే మించి పల్లె సీమలకు ముఖ్యంగా రైతుల జీవనంతో ఈపండుగ కొంతవరకు ముడిపడి ఉంది. వ్యవసాయానికి సంబంధించి రైతులు భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకునేందుకు ఈ పండుగసందర్భంగా స్వామిజీలు, పీఠాధిపతులు, పండితులు చేసే పంచాంగ శ్రవణంపై ఆధారపడుతుంటారు. ఉగాదిరోజు తెలుగు రాష్ట్రాల్లో మారుమూల గ్రామంలో సైతం రాబోయేకొత్త సంవత్సరంలో వర్షాలు ఎలాఉన్నాయి? ఏ పంటలకు అనుకూలం? ఆదాయ వ్యయాల పరిస్థితి, ప్రభుత్వాల పరిస్థితి కూడా పంచాంగ శ్రవణంలో పంచాంగం చూసి పండితులు వివరిస్తుంటారు. అందుకోసం గ్రామాల్లో ఉన్న రైతులు ఉగాది రోజు సాయంత్రానికి దేవాలయాల వద్దనో, లేక గ్రామపంచాయతీ కార్యాలయాల వద్దనో అవీఇవి కాకపోతే రచ్చబండల వద్ద సమావేశమై పంచాంగ శ్రవణాన్ని శ్రద్ధాభక్తులతో ఆలకిస్తారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రభుత్వం అధికారికంగానే ఈ పంచాంగ శ్రవణాన్ని ఏర్పాటు చేయడం ఎంతోకాలంగా ఆనవాయితీగా వస్తున్నది. రాష్ట్రం విడిపోయిన తరువాత రెండు తెలుగురాష్ట్రాల్లోనూ ఈ పంచాంగ శ్రవణాలు జరుగుతున్నాయి. ఎందుకోఏమోకానీ రానురాను పంచాంగ శ్రవణాలు శాస్త్రానికి క్రమేపి దూరంఅవుతున్నా యోమోననే అనుమానాలు సామాన్యుల్లో సైతం రేకెత్తిస్తున్నాయి. పర్యావరణంలో వచ్చిన మార్పుల కారణంగా రుతువులు గతులు తప్పుతున్నాయి. వరుణదేవుడి అడుగులు వాతావరణ శాస్త్రజ్ఞుల అంచనాలకే అందడంలేదు. ఇక పంచాంగాలు లెక్కకు మించి తయారు చేస్తున్నారు. కానీ ఒక్క విషయం ఎన్ని పంచాంగాలు వచ్చినా, ఎన్నిరకాలుగా అన్వయించినా శాస్త్రం మాత్రం ఒక్కటే. కానీ అన్వయించే శాస్త్రుల ఆలోచనలను, అవసరాలను బట్టి అవి మారిపోతున్నాయి.ఇందులో కూడా రాజకీయాలు ప్రవేశించాక పరిస్థితి మరింత దిగజారింది.


ఒక్క మాట

ప్రతి యేడాది ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించి పార్టీ ఆఫీసుల్లో ఈ పంచాంగ శ్రవణం జరిపించుకుంటారు. కానీ ప్రతి పార్టీకి కొత్త సంవత్సరంలో ఎదురు ఉండదని, ముఖ్యంగా ఆపార్టీ నేత జాతకం ప్రకారం ఆయన మాటకు తిరుగు ఉండదని అధికారంలో ఉన్నవారైతే తిరిగి అఖండ విజయం సాధిస్తారని, ప్రతిపక్షంలో ఉన్నవారైతే అధికారంలోకి రావడం ఖాయమని చెబుతుంటారు. ఈసారి కూడా మొన్నటి విశ్వావసు నామ సంవత్సరం ఉగాది సందర్భంగా ఆదివారం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి పంచామాది, సప్తమాధిపతి వెళ్లి బుధ మహాదశ మొన్ననే ప్రారంభమైందని ప్రముఖ పండింతులు తన పంచాంగ పఠనంలో వెల్లడించారు. రిజిస్ట్రేషన్లు పెరిగి రియల్ ఎస్టేట్‌రంగం పరుగులు పెడుతుందని చెప్పారు. రాజు ఒంటిచేత్తో బాధ్యతలు మోస్తారని, సేనాధిపతి శని అయ్యాడని, శాంతిభద్రతల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలు మెచ్చే విధంగా పాలన చేస్తారని వివరించారు. ఇక బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన పంచాంగ పఠనం కార్యక్రమంలో మరొక ప్రముఖ పండితులు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి పదవీగండం ఉంటుందని చెప్పారు. కుజుడు నీచస్థానంలో ఉండటంతో ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు నామమాత్రంగానే అమలు అవుతాయని, రైతులను పట్టించుకునే పరిస్థితి ఉండదన్నారు. పాలకులు పదవులు కాపాడుకోవడమే ముఖ్యంగా పనిచేస్తారని, ప్రభుత్వం నడిపేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని, మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ప్రజాభీష్టం మేరకు ఈ యేడాది ఆయనకు ముఖ్యమంత్రిగా పట్టంకట్టే అవకాశం ఉందని చెప్పారు. ఇక కాంగ్రెస్ పార్టీ గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పంచాంగశ్రవణ కార్యక్రమంలో ఇంకొక ప్రముఖ పంచాంగ శ్రవణకర్త ఈసారి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, సంక్షేమపథకాలు బాగుగా అమలు అవుతాయని వెల్లడించారు.దేశమంతా గృహనిర్మాణపథకాలు అమల వుతాయన్నారు. ఇక బిజెపి రాష్ట్ర కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పంచాంగ పఠనం కార్యక్రమంలో పంచాంగ కర్త నరేంద్రమోడీ ఈయేడాది చండశాసనుడుగా ఉండబోతున్నారని ప్రపంచానికే దిశానిర్దేశనం చేయనున్నారనిచెప్పారు. భారతదేశ రాశి మకర రాశి. రామనామం దేశానికి అనుకూలమని, ఎంతమంది రామనామం జపిస్తే అంతమంచిదని సూచించారు. ఇక తెలంగాణ టిడిపి తన ప్రతిష్టను పెంచుకుంటుందని జ్యోతిష వాస్తు పండింతులు నాయకంటి మల్లిఖార్జున శర్మపంచాంగ శ్రవణంలో పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో టిడిపి ఆధ్వర్యంలో కూటమిగా ఏర్పడి తెలంగాణలో విజయం సాధిస్తుందని చెప్పారు. పంచాంగాలకుమూలమైన శాస్త్రం ఒక్కటే. శాస్త్రులే వేరు.కానీ వారివారిభాష్యాలు పూర్తిగా పరస్పర విరుద్ధంగా సాగాయి. ఇందులో ఏది నిజమో, ఏదికాదో కాలమే నిర్ణయించాలి. అందులో ఒక్కటి మాత్రమే వాస్తవరూపం దాల్చే అవకాశంఉంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పంచాంగ శ్రవణాలు ఇందుకు భిన్నంగా జరగలేదు. ఇలాంటి పంచాంగ శ్రవణాలవల్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గిపోతున్నది. రాజకీయ నేతల కోసం కొందరు స్వామిజీలు, పంచాంగ శ్రవణకర్తలు శాస్త్రాలను కూడా వక్రీకరిస్తున్నారనే అభిప్రాయాలు జనంలో బలపడుతున్నాయి. ముఖ్యంగా హిందూమత సంప్రదాయాన్ని, దైవాలను విశ్వసించేవారిలో ఎలాంటి ప్రభావం చూపుతాయో పండితులు, స్వామిజీలు ఆలోచించాలి. సాంకేతిక పరిజ్ఞానం ఇంత పెరుగుతున్నా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి విజ్ఞానం అందుబాటులోకి వస్తున్నా అంతకు రెట్టింపు స్థాయిలో మానసిక ఒత్తిడి నుంచి బయటపడి ప్రశాంతత కొరకు దైవంపట్ల మొగ్గచూపేవారి సంఖ్య క్రమేపీ పెరుగుతున్నది. ఇక సంసారమగ్నుడైన మానవుడి మనోవ్యాకులతను పోగొట్టేందుకు సుఖ దుఃఖాలను సమానంగా చూసేందుకు, పాపపుణ్యాలను వివరించి వాటి వల్ల సంభవించే ఫలితాలు తెలిపిసన్మార్గంలో నడిపేందుకు సనాతన ధర్మకర్మిష్టులైన మన పూర్వీకులు ఎన్నోగ్రంథాలు రచించారు. సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తత్వరహ స్యాలతో ఎన్నో ఇతిహాసాలు అందించారు. వీటి ప్రామాణికతను, ప్రాముఖ్యతను వివరించి ప్రజలకు అందించడంలో ఈ పెద్దలు పోటీపడాలి కానీ పొగడ్తల్లో కాదు. మఠాధిపతులు, స్వామిజీలు, సంతులు, పండితులు, వైజ్ఞవిజ్ఞా నసంపన్నులు తదితర పెద్దలందరూ పెద్దమనసుతో ఆలోచించాలి. రాజకీయ నేతల కోసం కొందరు స్వామిజీలు శాస్త్రాలను వక్రీకరిస్తున్నారనే అనుమానాలకు బలం చేకూర్చే విధంగా వ్యవహరించకూడదు. ఏదిఏమైనా పంచాంగ శ్రవణ కర్తలు శతాబ్దాల తరబడి అనాదిగా వస్తున్న పంచాంగ శ్రవణాన్ని ప్రహసనం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. •

# క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడొద్దు

డా.పోలం సైదులు

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పదవ తరగతి పరీక్షలు ముగిశాయి. అతిత్వరలో పరీక్షా ఫలితాలు రాబోతున్నాయి. అందులో మొదటగా ఇంటర్మీడియట్ ఫలితాలు,ఆతర్వాత పదవ తరగతి పరీక్షల ఫలితాలు రాబోతున్నాయి. ఈ విద్యాసంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలలో స్వల్ప మార్పులో భాగంగా గ్రేడ్ సిస్టమ్ వదిలేసి మార్కులు ఇవ్వబోతున్నారన్న విషయం అందరికి తెలిసిందే. కావున విద్యార్థులు ప్రణాళికలు రూపొందించుకొని,రేయింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలు రాశారు. తల్లిదండ్రులు సైతం ర్యాంక్‌లు, గ్రేడులు, మార్కులు అంటూపిల్లలపై ఒత్తిడిపెట్టి ఉంటారు.అలాగే కార్పొరేటు పాఠశాల పిల్లలపై వారి తల్లిదండ్రులు,పాఠశాల యాజమాన్యం ఒత్తిడిపెంచి చదివించి ఉంటారనడంలో ఎలాంటి అవాస్తవం లేదు. ఆయా పరీక్షలు ఫలితాలొచ్చాక పొరపాటున తమ హాల్ టికెట్ నంబర్ కనబడకపోయినా, అనుకున్నన్ని మార్కులు,గ్రేడులు రాకపోయినా కొంతమంది విద్యార్థులు క్షణికావేశంలో తమ ప్రాణాలను తీసుకుంటుంటారు. గతంలో ఇంటర్మీడియట్ బోర్డులో కంప్యూటర్‌లో వచ్చిన సాంకేతికలోపం వలన జరిగిన నష్టం ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యతో వారిప్రాణాలు తీసుకోవడం,ఆ తర్వాత సరిదిద్ది ఎన్నిమార్కులు వేసినా ఏం లాభం? పోయిన ప్రాణాలు తిరిగివచ్చాయా ?అందుకే అలాంటి సంఘటనలకు గురికాకుండా ముందుజాగ్రత్తతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు చొరవతీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. ఎందుకంటే ప్రత్యేకంగా ఎక్కువ ఆత్మహత్యలు పదవతరగతి ఇంటర్మీడియట్ ఫలితాలతో ముడిపడి ఉంటాయి. కావున వీటిని శాశ్వతంగా ఆపుటకు ప్రతిఒక్కరు పాటుపడాలి. మరీముఖ్యంగా ప్రభుత్వంఎస్సెసి బోర్డు, ఇంటర్మీడియట్ బోర్డు ఫలితాలను వెలువరించే సందర్భాలలో ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకోవాలి.




ఎలాంటి సాంకేతికలోపాలు జరగకుండా ముందుజాగ్రత్త వహించాల్సిన అవసరం ఎంతైనాఉన్నది. కారణం ఎవరో ఒకరయ్యి,విద్యార్థుల మరణానికి కారకులయితే,ఆ తరవాత వారు ఎంత సరిదిద్దుకున్న వారిప్రాణాలను వెనక్కితీసుకు రావడం కుదురదు. విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలి. తర్వాత ఎంతోజీవితం ఉంటుంది. ఒక్కసారి చరిత్రను తిరగేయండి! ప్రపంచంలో ఎవరైతే ఆవిష్కరణలు గావించారో,ప్రత్యేక ప్రాధాన్యత కలిగివున్నారో,నేడు మనం వారిని ఆదర్శంగా తీసుకుంటూ,మన పాఠ్యంశాలలో వారిగురించి చదువుతున్నామో ..వారందరు ఒకేసారి హఠాత్తుగా విజయ తీరాలకు చేరుకోలేదు. ఎన్నో ఓటములు, ఎంతో కష్టంతో వారు ఆయాస్థానాలను అధిగమించారు. అంతెందుకు మన పాఠశాలలో,కళాశాలలో బోధించే ఉపాధ్యాయులలో కొందరు ఎస్సెసి,ఇంటర్ విద్యలో తప్పిన సబ్జక్ట్స్‌లలోనే ప్రావీణ్యం గావించి, ఆ సబ్జెక్ట్‌నే బోధించి, ఉత్తమ ఉపాధ్యాయులని అనిపించుకుంటున్నారు. ఈ పోటీప్రపంచంలో ఏదో సాధించుకోవడానికి పరుగులు తీస్తుంటారు. ఆ క్రమంలోనే వివిధ కారణాలతో ఒత్తిడికి గురై ప్రాణం మీదికి తెచ్చుకుంటారు. మనం చదివే బట్టీ చదువుల వలన ఎలాంటి ప్రయోజనం చేకూరకపోగా, అనుకున్నది జరగకపోతే ప్రాణాలను తీసుకోవటానికి ప్రేరేపిస్తుంది. ఏ విషయానైనా విపులంగా అర్థం చేసుకొని చదవండి, పరిశీలన, అన్వేషణలతో పొందేజ్ఞానం మనకెంతో ఉపయోగపడుతుంది. ఇంకా మనకిష్టమైన రంగాన్ని ఎంచుకొని కష్టపడితే అనుకున్నది సాధించవచ్చు. అందులోసైతం మొదట ఓటములు ఉండవచ్చు.గానీ అలుపెరుగకుండా ఇష్టంతో ప్రయత్నమిస్తే గమ్యాన్నీ చేరుకోవచ్చు. జీవితమంటే అకాడమిక్ పరీక్షలలో పాస్,ఫెయిల్‌కాదు.ఎంతో భవిష్యత్తుతో కూడుకొని ఉండి,మీ అభీష్టం మేరకు మీకు, మీతల్లిదండ్రులకు, సమాజానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చిపలువురికి ఆదర్శంగా నిలవాల్సినఅవసరం ఉంటుంది. కావున ఏవిద్యార్థి కూడా క్షణికావేశానికి గురికాకూడదు. •

# అసాంఘిక చర్యల కట్టడికి తీర రక్షణదళ సేవలు

రామ కిష్టయ్య సంగన భట్ల

భారత తీర రక్షణ దళం,నావికాదళం, మత్స్య శాఖ, రెవెన్యూ శాఖ (కస్టమ్స్), కేంద్ర, రాష్ట్ర పోలీసు దళాల సహకారంతో పనిచేస్తుంది. 1960లలో స్మగ్లింగ్ కార్యకలాపాలు ఎక్కువ అవటం కారణంగా కస్టమ్స్ శాఖ వారికి తీర గస్తీకి నౌకదళం అవసరం ఏర్పడింది. స్మగ్లింగ్ నిరోధక ప్రయత్నంలో పెట్రోలింగ్ సహాయం కోసం భారత కస్టమ్స్ విభాగం తరచూ భారత నావికాదళాన్ని పిలిపించేది. క్రమంగా భారతీయ ప్రభుత్వం నౌక, వైమానిక దళ అధికారులతో సమితిని ఏర్పాటు చేసింది. భారత తీరరక్షణ దళ స్థాపన కోసం భారత నావికాదళం మొదట దేశానికి సైనిక రహిత సముద్ర సేవలను అందించడానికి ప్రతిపాదించింది. సమస్యను అధ్యయనం చేయడానికి భారత నావికాదళం, భారత వైమానిక దళం భాగస్వామ్యంతో నాగ్‌చౌధురి కమిటీని ఏర్పాటు చేశారు. ఆగష్టు 1971లో, భారతదేశంలోని విస్తారమైన తీరప్రాంతంలో పెట్రోలింగ్ చేయవలసిన అవసరాన్ని కమిటీ గుర్తించింది. అక్రమ కార్యకలాపాలను గుర్తించడానికి ఆఫ్‌షోర్ ఫిషింగ్ ఓడల రిజిస్ట్రీని ఏర్పాటు చేసింది. చట్టవిరుద్ధ కార్యకలాపాలలో నిమగ్నమైన ఓడలను అడ్డగించడానికి సమర్థవంతమైన, సుసంపన్నమైన రక్షణ శక్తిని ఏర్పాటు చేసింది. ఆ సేవలను అందించడానికి అవసరమైన పరికరాలు,మౌలిక సదుపాయాలు,సిబ్బందిసంఖ్య, స్వభావాన్ని కూడా కమిటీ పరిశీలించింది. 1973 నాటికి, భారతదేశం పరికరాలను సంపాదించడానికి ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం నిబంధనల ప్రకారం, స్మగ్లింగ్ నిరోధక,చట్ట అమలు పనుల కోసం భారత నావికాదళానికి చెందిన సిబ్బందిని నియమించడం ప్రారంభించింది. అప్పటి నావికాదళ సిబ్బంది చీఫ్ అడ్మిరల్ సౌరేంద్ర నాథ్ కోహ్లీ రక్షణ కార్యదర్శికి ఒక సిఫారసు చేసారు.రక్షణ విధులను చేపట్టడానికి ప్రత్యేక సముద్ర సేవ ఆవశ్యకతను, దాని స్థాపనలో నేవీ సహాయాన్ని అందించాల్సిన అవసరాన్ని వివరించారు. అడ్మిరల్ కోహ్లీ సిఫారసుపై, రక్షణ కార్యదర్శి 1974 ఆగస్టు 31 న కేబినెట్ కార్యదర్శికి నోట్ సమర్పించారు. పర్యవసానంగా, 1974 సెప్టెంబరులో, భారత మంత్రివర్గం ఖుస్రో ఫరాముర్జ్ రుస్తాంజీ అధ్యక్షతన రుస్తాంజీ కమిటీని ఏర్పాటు చేసింది. నేవీ, వైమానిక దళం, రెవెన్యూ శాఖల భాగస్వామ్యంతో భద్రత చట్ట అమలులో అంతరాలను పరిశీలించడానికిభారత నావికాదళం, కేంద్ర, రాష్ట్ర పోలీసు దళాలు,బొంబాయి హై నుండి చమురు ఆవిష్కరణ సముద్ర చట్ట అమలు రక్షణ సేవఅవసరాన్ని మరింత నొక్కి చెప్పింది. ఈ కమిటీ 31



జూలై 1975న రక్షణ మంత్రిత్వ శాఖలో ఇండియన్ కోస్ట్ గార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసింది. కేబినెట్ కార్యదర్శి ఈ సేవను హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ క్రింద ఉంచాలని సిఫారసు చేశారు. అప్పుడు ప్రధాని ఇందిరా గాంధీ కేబినెట్ కార్యదర్శిని తప్పుపట్టి, ఈ సేవను రక్షణ మంత్రిత్వశాఖ క్రింద ఉంచడానికి రుస్తాంజీ కమిటీ అసలు సిఫార్సును అంగీకరించాలని నిర్ణయించుకున్నారు. 1 ఫిబ్రవరి 1977 న తాత్కాలిక ఇండియన్ కోస్ట్ గార్డ్ అమలులోనికి వచ్చింది. ఇందులో రెండు చిన్న కొర్వెట్టలు ఐదు పెట్రోల్ బోట్లు నేవీ నుండి బదిలీ చేయబడ్డాయి. కోస్ట్ గార్డ్ చట్టంలో రక్షణదళం విధులు అధికారికంగా నిర్వచించబడ్డాయి. దీనిని భారత పార్లమెంట్ 18 ఆగస్టు 1978న ఆమోదించింది. తద్వారా వెంటనే అమలులోకి వచ్చింది. భారత నావికాదళానికి చెందిన వైస్ అడ్మిరల్ వి. ఎ. కామత్‌ను వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. సేవ ప్రారంభోత్సవంలో ప్రధాని మొరార్జీ దేశాయ్ గార్డ్ ఆఫ్ ఆనర్‌ను పరిశీలించారు. వైస్ అడ్మిరల్ కామత్ 1984 నాటికి ఐసిజిని శక్తివంతమైన శక్తిగా అభివృద్ధి చేయటానికి ఐదేళ్ల ప్రణాళికను ప్రతిపాదించాడు. కాని ఆర్థిక వనరుల సంక్షోభం కారణంగా ఈ ప్రణాళిక పూర్తి లక్ష్యం నెరవేరలేదు. ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారికంగా 18 ఆగస్టు 1978న భారత పార్లమెంట్ కోస్ట్‌గార్డ్ చట్టం, 1978 చేత స్థాపించబడింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) ఒక ప్రత్యేక సముద్ర నేవీచట్టం కలిగి ఉంది. ఎన్ ఫోర్స్‌మెంట్ అండ్ సెర్చ్‌అండ్ రెస్క్యూఏజెన్సీ. రక్షణ మంత్రిత్వ శాఖ క్రింద పనిచేస్తుంది. ఇది భారత దేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షిస్తుంది, సముద్ర చట్టాన్ని అమలు చేస్తుంది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐ.సి.జి) ప్రపంచంలోని ఇతర కోస్ట్‌గార్డ్‌తో కలిసి సమన్వయంతో పని చేస్తుంది. మే 2005లో, పాకిస్థాన్ మారిటైమ్ సెక్యూరిటీ ఏజెన్సీ (పిఎంఎస్‌ఎ) తో సంబంధాలు ఏర్పరచుకోవడానికి ఐసిజి అంగీకరించింది. 2006లో, ఇండియన్ కోస్ట్ గార్డ్ తన జపనీస్, కొరియన్ సహచరులతో కలిసి కార్యకలాపాలు నిర్వహించింది. 2008 ముంబై దాడుల తరువాత, భారత ప్రభుత్వం ఐసిజి ఫోర్స్, ఆస్తులు, మౌలిక సదుపాయాలను విస్తరించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇండియన్ కోస్ట్‌గార్డ్ డైరెక్టర్ జనరల్ కోస్టల్ కమాండ్ తీర భద్రతకు సంబంధించిన అన్ని విషయాలలో కేంద్ర రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయానికి బాధ్యత వహిస్తారు. కృత్రిమ ద్వీపాల రక్షణ, సముద్రంలో మత్స్యకారులు, నావికులకు రక్షణ, సహాయం, కాలుష్య నియంత్రణతో సహా సముద్ర పర్యావరణం, పర్యావరణ పరిరక్షణ, తీరం గురించి శాస్త్రీయ సమాచార సేకరణ, స్మగ్లింగ్ నిరోధక చర్యలలో కస్టమ్స్ శాఖ, ఇతర అధికారులకు సహాయం, రక్షణ, ప్రాదేశిక అంతర్జాతీయ జలాల్లో చట్ట అమలు, తదితర కార్య క్రమాలను నిర్వహిస్తుంది. •

# నీట్ వ్యతిరేక బిల్లును తిరస్కరించిన రాష్ట్రపతి

## స్టాలిన్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ




**చెన్నై, ఏప్రిల్ 4:** వైద్యవిద్యలో ప్రవేశాలకోసం నిర్వహించే నీట్ పరీక్షనుంచి తమిళనాడునుంచి మినహాయించాలని గత కొన్నేళ్లుగా రాష్ట్రం డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై కేంద్రం డిఎంకె ప్రభుత్వం మధ్య వివాదంకొన సాగుతోంది. ఈ పరిణామాలవేళ స్టాలిన్ సర్కారుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తమిళనాడు పంపిన నీట్ వ్యతిరేక బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. ఈ అంశాన్ని సీఎం స్టాలిన్ రాష్ట్ర శాసనసభలోనే వెల్లడించారు. ప్రభుత్వం తరపున అన్ని వివరణలు ఇచ్చినప్పటికీ నీట్‌నుంచి మన రాష్ట్రాన్ని మినహాయించేందుకు కేంద్రం తిరస్కరిస్తోందని, ఇది దక్షిణాది రాష్ట్రాన్ని అవమానించడమేనని అన్నారు. అయితే వారు మన అభ్యర్థనను తిరస్కరించినా మన పోరాటం ఆపలేరన్నారు. ఈనిర్ణయాన్ని సవాల్‌చేసేందుకు న్యాయపరమైన మార్గాలను అన్వేషిస్తామని న్యాయనిపుణులను సంప్రదిస్తున్నట్లు చెప్పారు. దీనిపై సమగ్రంగా చర్చించేందుకు ఏప్రిల్ 9న అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. నీట్‌పరీక్ష కారణంగా తమిళనాడులో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని సీఎం ఆందోళన వ్యక్తంచేసారు. ఎంబిబిఎస్, బిడిఎస్‌కోర్సుల్లోప్రవేశాలకోసం జాతీయ స్థాయిలో నిర్వహించే అర్హత పరీక్ష నీట్ పరిధినుంచి తమిళనాడును శాశ్వతంగా మినహాయించాలంటూ అక్కడి ప్రభుత్వం ఓ బిల్లును తీసుకొచ్చింది. దీని ప్రకారం 12వ తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థులకు వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించారు. ఈబిల్లు ఇప్పటికే 2021, 2022ల్లో రెండుసార్లు తమిళనాడు అసెంబ్లీ ఆమోదించింది. తర్వాత గవర్నర్‌కు పంపగా పలుమార్లు తిరస్కరించారు. దీనితో బిల్లులో కొన్ని మార్పులుచేసి రాష్ట్రపతి ఆమోదానికి పంపించారు. ఇప్పటికే హిందీ వివాదం, డీలిమిటేషన్ వంటి అంశాలపై కేంద్రం తమిళనాడు సర్కారుమధ్య వివాదం కొనసాగుతోంది. తాజాగా నీట్ బిల్లును తిరస్కరించడంతో ఇది మరింత ముదిరేలా కనిపిస్తోంది. వచ్చే ఏడాది తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# నేనేమీ ఉగ్రవాదిని కాదు..

## ఏడుగురు ప్రధానులు నాతో చర్చించారు..

### వేర్పాటువాద నాయకుడు, జీవితఖైదు అనుభవిస్తున్న యాసిన్ మాలిక్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:** తాను రాజకీయ నాయకుడినని, ఉగ్రవాదిని కాదని వేర్పాటువాద నాయకుడు యాసిన్‌మాలిక్ వ్యాఖ్యలు చేసాడు. గతంలో తనతో ఏడుగురు ప్రధానమంత్రులు చర్చలు జరిపారని తెలిపాడు. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చాడనే కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న మాలిక్ విడియోకాన్ఫరెన్స్‌ద్వారా సుప్రీంకోర్టు విచారణకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా ఉగ్రవాది అంటూ సిబిఐ చేసిన ఆరోపణలను మాలిక్‌తోసిపుచ్చాడు. జమ్ముకాశ్మీర్ లిబరేషన్‌ఫ్రంట్‌ను కేంద్ర ప్రభుత్వం నిషేధించిందే తప్ప ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చలేదని అన్నాడు. 1994లో తనకు 32 కేసుల్లో బెయిల్ ఇచ్చారని, కేసులను కూడా కొనసాగించలేదని గుర్తు చేసాడు. గతంలో ప్రధానులుగా పనిచేసిన పివి నరసింహారావు, హెచ్‌డి దేవెగైడ, ఐకె గుజ్రాల్, వాజ్‌పేయి, మన్మోహన్‌సింగ్ హయాంలోనూ తన సంస్థపై ఎలాంటిచర్యలు తీసుకోలేదని అన్నాడు. ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన మొదటి ఐదేళ్లలోనూ మునుపటి విధానాన్నే అనుసరించారని కానీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అకస్మాత్తుగా 35 ఏళ్లనాటి ఉగ్రవాద కేసుల విచారణను తిరిగిప్రారంభించారని ఆవేదన వ్యక్తంచేసాడు.

1989లో జమ్ములో ఆతడిపై నమోదయిన రెండుకేసుల్లో విచారించడానికి మాలిక్‌ను అక్కడి కోర్టులో హాజరుపరచాలని అధికారులుచేసిన ప్రతిపాదనకు అనుమతి ఇవ్వవద్దని సిబిఐ సుప్రీంకు విజ్ఞప్తి చేసింది. ఆ కేసులకు సంబంధించిన విచారణను జమ్ముకోర్టునుంచి ఢిల్లీకోర్టుకు బదిలీచేయాలని కోరింది. మాలిక్‌కు ఉగ్రవాదులతో సంబంధాలు న్నందున అక్కడికి వెళితే ఉగ్రదాదులు జరిగే అవకాశం ఉందని సిబిఐ తరపున వాదిస్తున్న సొలిసిటర్‌జనరల్ తుషార్‌మెహతా సుప్రీంకు విన్నవించారు. ఈ క్రమంలో మాలిక్ మాట్లా డుతూ తానేమి ఉగ్రవాదిని కాదంటూ చెప్పు కొచ్చారు. 1990 జనవరి 25న పాత శ్రీనగర్ ఎయిర్‌ఫీల్డ్‌లో విధుల నిర్వహణకు సిద్ధమైన వాయుసేన సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడ్డారు. మాలిక్ నాయకత్వంలోనే ఈఘాతుకం జరిగిందన్న అభియోగాలున్నాయి. తర్వాత అరెస్టు అయిన ఆతడిపై సిబిఐ ఛార్జిషీట్ దాఖలుచేసింది.

1994లో మాలిక్‌జైలునుంచి విడుదలయ్యారు. అనంతరం ఉగ్రవాద కార్య కలాపాలకు నిధులు సమకూర్చాడనే ఆరోపణలు రుజువుకావడంతో ఆతడికి శిక్షపడింది. ప్రస్తుతం తీహార్‌జైలులో జీవితఖైదు అనుభవిస్తున్నాడు.

# బావిలో విషవాయువు పీల్చి 8 మంది మృతి



**భోపాల్, ఏప్రిల్ 4:** మధ్యప్రదేశ్‌లో విషాం చోటు చేసుకుంది. బావిలోని విషవాయువు పీల్చి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఖాండ్వా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఛైగావ్ మఖాన్‌ప్రాంతంలో గంగౌర్ పండుగ వేడుకల్లో భాగంగా విగ్రహాల నిమజ్జనంకోసం గ్రామస్తులు బావిని సిద్ధం చేస్తుండగా ఈఘటన చోటు చేసుకున్నట్లు ఖాండ్వా కలెక్టర్ రిషవ్ గుప్తా తెలిపారు. బావిలో పేరుకుపోయిన బురదను తొలగించడానికి ముందు ఐదుగురు వ్యక్తులు బావిలోకి దిగారు. వారు అందులోని విషవాయువుల కారణంగా స్పృహకోల్పోయి బురదలో మునిగిపోయారు. వారిని రక్షించేందుకు మరో ముగ్గురు బావిలోకి వెళ్లారు. విషవాయువు ప్రభావంతో వారుకూడా అందులోనే చిక్కుకు పోయి ప్రాణాలు వదిలారని కలెక్టర్ వివరించారు. సమాచారం అందుకున్న జిల్లా యంత్రాం గం, పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. సుమారు నాలుగుగంటల పాటుశ్రమించి ఎనిమిది మృతదేహాలను ఒక్కొక్కటిగా బావినుంచి వెలికితీసారు. మృతులు రాకేశ్‌పటేల్(23), అనిల్‌పటేల్(25), అజయ్‌పటేల్(24), శరణ్ పటేల్(35), వాసుదేవ్ పటేల్ (40), గజానన్ పటేల్ (35), అర్జున్‌పటేల్ (35), మోహన్ పటేల్ (53)గా గుర్తించారు.

# ఉభయసభల్లో వక్ఫ్ సవరణబిల్లు ఆమోదం

## ఇక రాష్ట్రపతి సంతకానికి ఉమీద్ బిల్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:** పార్లమెంటులో రెండు రోజులపాటు ఏకధాటిగా చర్చలుజరిగిన తర్వాత వక్ఫ్‌సవరణల బిల్లు ఉభయసభల్లోను ఆమోదం పొందింది. ఈ బిల్లును ఇక కేంద్రం రాష్ట్రపతి ఆమోదానికి పంపించనున్నది. రాష్ట్రపతి సంతకం తర్వాత ఈ బిల్లుచట్టరూపంలోకి వస్తుంది. ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించిన బిజెపి, ఎన్డీయే మిత్రపక్షాలతోపాటు తటస్థంగా ఉన్న ఎంపీలను సైతం దారికితెచ్చుకుని ఉభయసభల్లో మెజార్టీని కూడగట్టింది. లోక్‌సభలో 288 ఓట్లతో ఆమోదం పొందింది. 232 మంది ఈ బిల్లును వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. అంటే ఇండియా కూటమి పార్టీలు మాత్రమే వ్యతిరేకించాయి. ఇక రాజ్యసభలో చర్చ జరుగుతున్న క్రమంలోనే జెడియు ఈ బిల్లుకు మద్దతు ప్రకటించడంతో ఇద్దరుఎంపిలు రాజీనామా చేసారు కూడా గురువారంరాత్రి పొద్దుపోయేంతవరకూ జరిగినచర్చల తర్వాత రాజ్యసభలో 128మంది సభ్యులు ఈబిల్లుకు ఆమోదం తెలిపారు. 95 ఓట్లు వ్యతిరేకంగా పడ్డాయి. లోక్‌సభలో ఈ బిల్లుపై ఎనిమిది గంటల కుపైగానే చర్చజరిగితే రాజ్య సభలో అంతకుమించి 13 గంటలపాటు చర్చకొనసాగిం చారు. రాత్రి రెండు గంటలు దాటినతర్వాత ఓటింగ్‌నిర్వహించి ఆమోదం తెలిపారు. దీనితో సభలో వక్ఫ్ సవరణలబిల్లు 2025ను ఆమోదిం చినట్లు ప్రకటించారు. ప్రతి సవరణపైనా ప్రతిపక్షాలు ఓటింగ్‌కు పట్టుబట్టినా వాటన్నింటినీ అటు స్పీకర్ ఓంబిర్లా, ఇటు రాజ్యసభఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌లు తిరస్కరించడంతో వీగిపోయాయి. ఇదిలాఉంటే బెంగాల్, తమిళనాడుల్లో భారీ ఎత్తున ముస్లింలు నిరసనకు దిగారు. వక్ఫ్ సవరణ బిల్లును మేం వ్యతిరేకిస్తున్నామంటూ పలు ముస్లిం సంఘాలు ఆందోళనకు దిగాయి. బెంగాల్‌లోనికోల్‌కత్తా, తమిళనాడులోని చెన్నై, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లలో భారీ ప్రద ర్శనలు జరిగాయి. తమిళనాడులోని చెన్నై, కోయంబత్తూరు, తిరుచిరాపల్లి వంటి నగరాల్లో టివికె కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

# బాలివుడ్ సీనియర్ నటుడు మనోజ్‌కుమార్ కన్నుమూత



మనోజ్ కుమార్ (ఫైల్)

**ముంబయి, ఏప్రిల్ 4:** బాలివుడ్ సీనియర్ నటుడు మనోజ్‌కుమార్ 87వ ఏట కన్నుమూసారు. వృద్ధాప్యసమస్యలపై ఆయన ముంబయిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీర్ఘకాలికంగా ఆయన వయోసమస్యలతో చికిత్సలు పొందుతుననట్లు ఆయన కుమారుడు కునాల్‌గోస్వామి తెలిపారు. దేశభక్తి సినిమాల్లో ఎక్కువగా నటించిన మనోజ్‌కుమార్ 1960 నుంచి 1970వరకూ బాలివుడ్‌లో ప్రముఖ నటుడిగా వెలు గొందారు. ప్రధాని నరేంద్రమోడీ తనసంతాప సందేశంలో ఆయన్ను ఇండియన్‌సినిమా ఐకాన్‌గా పేర్కొన్నారు. మనోజ్ కుమార్ అసలుపేరు హరికృష్ణన్ గోస్వామి. 1937లో ఆయన పంజాబ్‌లోని ఉత్తర రాష్ట్రంలో జన్మించారు. తనంతతానుగానే అంచలంచెలుగా ఎదిగారు.

షహీద్, రోడీ కపడా ఔర్‌మకాన్, క్రాంతి సినిమాలు ఆయనకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. మాతృభూమిపై ఉన్న మమకారంతో ఆయన ఎక్కువ దేశభక్తి సినిమాల్లోనే నటిం చారు. రైతు పోరా టాలు, భారత స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాల చరిత్ర ఉన్న సినిమాల్లో ఆయన ఎక్కువ కనిపించారు. 200 ఏళ్ల బ్రిటిష్ సామ్రాజ్య వాదుల పాలన తర్వాత కూడా ఆయన తీసిన చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టు కున్నాయి. మనోజ్‌కుమార్‌కు బదులుగా ఆయన్ను భారత్‌కుమార్ అని కూడా పిలిచేవారు. నటనలో ఆయనకు అనేక పురస్కారాలు లభించాయి. పద్మశ్రీ పురస్కారం కూడా కేంద్ర ప్రభుత్వం నుంచి అందుకున్నారు. దాదాసాహెబ్ పాల్కే అవార్డుతో కూడా ఆయన్ను సత్కరించారు.

# అమెరికా అధ్యక్షుడికి లండన్‌కోర్టు షాక్

## 7.41 లక్షల డాలర్లు జరిమానా

**లండన్, ఏప్రిల్ 4:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌నకు బ్రిటన్ కోర్టులో చుక్కెదురయింది. యుకెకు చెందిన ఒక మాజి గూఢచారిపై దావా వేసేందుకు ప్రయత్నించిన ఆయనకు లండన్ హైకోర్టుజరిమానా విధించింది ఆరోపణలు నిరూపించడంలో విఫలం అయినందుకుగాను న్యాయఖర్చులకింద ట్రంప్ 7.41 లక్షల డాలర్లు అంటే భారత కరెన్సీలోసుమారు ఆరుకోట్లు చెల్లించాల్సిందేనని న్యాయస్థానం తీర్పు వెలువరించింది. యుకె సీక్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ ఎంఐ సంస్థ మాజీ అధికారి అయిన క్రిసోటఫర్‌స్టీల్ 2017లో ట్రంప్‌పై ఓ సంచలన పత్రం విడుదలచేసారు. స్టీల్ డోజియర్‌పేరుతో రూపొందించిన ఆడాక్యుమెంట్‌లో ట్రంప్‌పై సంచలన ఆరోపణలుచేసారు. రష్యా ఏజెంట్లతో ఆయన రాజీపడ్డారని క్రిస్టోఫర్ ఆరోపించారు. 2016లో ఆయన తొలిసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేయడానికి ముందు మాస్కో ఐదేళ్లపాటు ఆయనకు సాయం చేసిందని పేర్కొన్నారు. ఆ ఆపరేషన్‌ను రష్యా అధ్యక్షుడు పుతిన్ స్వయంగా పర్యవేక్షించారని ఆరోపించారు. అంతేకాకుండా 2013లో ట్రంప్ మాస్కో పర్యటనకు సంబంధించి కొన్ని అభ్యంతర కథనాలురాసారు. 2017లో ట్రంప్ తొలిసారి అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారంచేయడానికి ముందు ఈ డాక్యుమెంట్స్ ప్రచురించారు. అప్పట్లో అమెరికా రాజకీయాలను ఈకథనం కుదిపేసింది. దీనిపై ట్రంప్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. లండన్ కోర్టులో క్రిస్టఫర్‌పై పరువునష్టం దావావేసారు. అయితే ఈ ఆరోపణలను రుజువుచేయడంలో అమెరికా అధినేత విఫలం కావడంతో లండన్‌కోర్టు తాజాగా ఆయనకు జరిమానా విధించింది.

న్యాయఖర్చులకింద 6.25 లక్షల యూరోలు అంటే 7.41 లక్షల డాలర్లు భారత కరెన్సీలో సుమారు ఆరు కోట్లు చెల్లించాలని ఆదేశించింది. క్రిస్టోఫర్ చేసిన ఆరోపణలపై యుఎస్ స్పెషల్ ప్రాసిక్యూటర్ రాబర్ట్ ముల్లర్ అప్పట్లో దర్యాప్తు చేసారు. 2016 అమెరికా ఎన్నికల్లో రష్యా ప్రభుత్వ జోక్యం ఉందని తేల్చారు. అయితే ఈకేసు ఇప్పటికీ కొనసాగు తుండటం గమనార్హం.



# హసీనా అప్పగింతపై బంగ్లా అభ్యర్థన మాత్రమే చేసింది..

### విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ

**బ్యాంకాక్, ఏప్రిల్ 4:** బిమ్‌స్టెక్ సదస్సులో పాల్గొనేందుకు థాయిలాండ్‌లో పర్యటించిన భారత ప్రధాని నరేంద్రమోడీతో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాన సలహాదారు మహ్మద్‌యూనస్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పగింత గురించి ప్రస్తావనకు వచ్చిందా అన్న ప్రశ్నలపై విదేశాంగశాఖ కార్యదర్శి మిస్రీ స్పందించారు. భారత్‌కు బంగ్లాదేశ్ అధికారికంగా అభ్యర్థన చేసింది. అయితే ఇప్పటికిప్పుడు అంతకుమించి మాట్లాడటం సరైందికాదన్నారు. అక్రమ వలసలు, మైనార్టీలపై దాడులు అంశం వారిద్దరిమధ్య చర్చకు వచ్చింది. బంగ్లాదేశ్‌లో మైనార్టీల భద్రతపై ఆందోళనను ప్రధాని మోడీ యూనస్ దృష్టికి తీసుకెళ్లారని మిస్త్రీ చెప్పారు. గత ఏడాది ఆగస్టులో బంగ్లా తాత్కాలిక కేర్‌టేకర్ బాధ్యతలను యూనస్ తీసుకున్న సంగతి తెలిసిందే. అప్పటినుంచి ఇరుదేశాలమధ్య సంబంధాలు ఒత్తిడికి గురవుతున్నాయి. మరోపక్క చైనా, పాకిస్థాన్‌తో ఢాకా దగ్గరవుతోంది. ఈ తరుణంలో ఇరువురునేతలమధ్యభేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. పదహారేళ్లపాటు కొనసాగిన షేక్ హసీనా ప్రభుత్వం గత ఏడాది ఆగస్టులోజరిగిన ఉద్యమం కారణంగా పతనం అయింది. దీనితో పదవీచ్యుతురాలైన ఆమె స్వదేశం వీడి భారత్‌కు వచ్చి రహస్యప్రాంతంలో ఉన్నారు. ఆతర్వాత స్వదేశంలో ఆమెపై అనేక కేసులునమోదయ్యాయి. అరెస్టు వారంట్లుకూడా జారీ అయ్యాయి. ఈ క్రమంలోనే హసీనాను తమకు అప్పగించాలంటూ దౌత్యకార్యాలయం నుంచి లేఖ అందింది. అభ్యర్థనపై భారత్‌నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఇటీవలే యూనస్ అన్నారు. ఆమెను తిరిగి రప్పించేందుకు అవసరమైతే అంతర్జాతీయ మద్దతుకోరతామని కూడా యూనస్ గతంలో వ్యాఖ్యలు చేసారు.



# డ్రగ్స్‌రవాణాతో పట్టుబడిన కానిస్టేబుల్

### ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసిన హర్యానా సర్కార్

**చండీగఢ్, ఏప్రిల్ 4:** మహిళా పోలీస్ కానిస్టేబుల్ వ్యక్తిగత వాహనాన్ని పోలీసులు తనిఖీచేసారు. డ్రగ్స్‌తో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోవడంతో ఆమెను అరెస్టు చేసారు. ఈ నేపథ్యంలో సర్వీస్ నుంచి డిస్మిస్‌చేసారు. ఆమె కూడబెట్టిన ఆస్తులపై కూడా దర్యాప్తుచేస్తున్నారు. పంజాబ్‌లోని బటిండాలో ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్రంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా స్పెషల్‌డ్రైవ్ చేపడుతున్నారు. ఇందులోభాగంగా మహిళా పోలీస్ కానిస్టేబుల్ అమన్‌దీప్‌కౌర్ తన వాహనంలోడ్రగ్స్ స్మగ్లింగ్‌చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. పోలీసులు యాంటీ నార్కొటిక్స్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి కౌర్‌డ్రైవ్ చేస్తున్న వాహనాన్ని భటిండాలోని బాదల్ ఫ్లైఓవర్‌సమీపంలో అడ్డగించారు. తనిఖీచేయగా గేర్‌బాక్స్‌వద్ద దాచిన 17.71 గ్రాముల హెరాయిన్ లభించింది. ఈక్రమంలో మహిళా కానిస్టేబుల్‌ను అరెస్టు చేసారు. అలాగే నిబంధనల ప్రకారం పోలీస్ ఉద్యోగం నుంచి ఆమెను తొలగించారు. మరోవైపు అమన్‌దీప్ కౌర్‌కు మహేంద్ర థార్‌తోపాటు ఆడి, రెండు ఇన్నోవాకార్లు, బుల్లెట్‌బైక్, రెండుకోట్ల విలువైన లగ్జరీ ఇల్లు, ఖరీదైన వస్తువులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీనితో డ్రగ్స్‌స్మగ్లింగ్‌ద్వారా వాటిని కొనుగోలు చేసిందా అన్నది దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో ఆమెకు ఎవరైనా అధికారులు సహకరించారా అన్నదానిపై కూడా దృష్టిపెట్టారు.

# కేరళ సిఎం కుమార్తెపై విచారణకు కేంద్రం అనుమతి



**తిరువనంతపురం, ఏప్రిల్ 4:** కేరళ అధికార కూటమి లెఫ్ట్ డెమొక్రటిక్‌ఫ్రంట్(ఎల్డీఎఫ్)కు షాక్ తగిలింది. అవినీతి ఆరోపణలపై సీఎం పినరయి విజయన్ కుమార్తె టి.వీణను విచారించేందుకు కేంద్రం అనుమతినిచ్చింది. కొచ్చిన్ మినరల్స్ అండ్‌రూటిల్ లిమిటెడ్ అక్రమ లావాదేవీల్లో ఆమె ప్రమేయం ఉన్నట్లుగా ఆరోపణలు రావడంతో కంపెనీల చట్టం ఉల్లంఘన కింద అభియోగాలు నమోదయ్యాయి. సీరియస్‌ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ కొచ్చిన్‌లోని ప్రత్యేక న్యాయస్థానంలో ఛార్జిషీట్ సమర్పించిన నేపథ్యంలో ఈ అనుమతి లభించింది. కొచ్చిన్ మినరల్స్ అండ్‌రూటిల్ లిమిటెడ్‌నుంచి వీణ, ఆమె సంస్థ ఎక్స్‌లాజిక్ సొల్యూషన్స్‌కు రూ.2.73 కోట్లు వచానచయి. దానికి బదులుగా ఎలాంటి ఐటి సేవలు అందించలేదు. రెండుసంస్థలమధ్య అధికారిక ఒప్పందం ఉన్నప్పటికీ అవి మోసపూరితంగా ఉన్నాయని ఎస్ఎఫ్ఐఒ తన అభియోగాల్లో వివరించింది. 2023 ఆగస్టులో వెలుగులోకి రాగా 2017 నుంచి 2020 మధ్యలో సిఎంఆర్ఎల్‌నుంచి రూ.1.72 కోట్లు పొందినట్లు ఈ ఆరోపణల్లో పొందుపరిచారు. ఈక్రమంలోనే పూర్తిస్థాయిలో వీణపై ఈడీ మనీ లాండరింగ్ కేసునమోదు చేసింది. ఇదిలా ఉంటే గతంలో సీఎం ఆయన కుటుంబంపై బంగారం స్మగ్లింగ్ కేసులో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో అవి రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే.

# బిజెపి రాష్ట్ర చీఫ్ రేసులో లేను: అన్నామలై



**కోయంబత్తూరు, ఏప్రిల్ 4:** రాష్ట్రాల్లో కొత్త అధ్యక్షుల నియామకాలపై బిజెపి హైకమాండ్ ముమ్మరకసరత్తులుచేస్తున్న వేళ తమిళనాడు పార్టీ అధ్యక్షుడు అన్నామలై తాను బిజెపి రాష్ట్ర అధ్యక్షరేసులో లేనని ప్రకటించేసారు. కోయం బత్తూరులో ఆయన మీడియాతోమాట్లాడుతూ తమిళనాడు బిజెపిలో నాయకత్వం కోసం నాయకులు పోటీపడరు. మేమంతా ఏకగ్రీవంగా నాయకుడిని ఎన్నుకుంటాం. కానీ నేనుకూడా ఈ రేసులో లేను అని అన్నారు. పార్టీకి ఉజ్వల భవిష్యత్తును కోరుకుంటున్నానని, ఈ పార్టీప్రగతి కోసం ఎంతోమంది తమ ప్రాణాలర్పించారని ఎప్పటికీ పార్టీ బాగుండా లనే పరితపించే వ్యక్తిని నేను అన్నారు. ఎలాంటి రాజకీయ ఊహాగానాల పైనా స్పందించబోన్న అన్నామలై తాను ఏరేసులోనూ లేనన్నారు. ఇతర పార్టీలమాదిరిగా బిజెపిలో అధ్యక్షపదవికోసం 50 మంది నేతలు నామినేషన్లు దాఖలుచేసే పరిస్థితి ఉండదని స్పష్టంచేసారు. మరోవైపు అన్నామలై ఈనెల 7వ తేదీ ఢిల్లీకి వెళతారని, పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపినడ్డాతో భేటీ అయి పలు కీలక అంశాలను చర్చిస్తారంటూ వార్తలు గుప్పుమన్నాయి.

# డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టాక తొలిసారిగా చైనా-యుఎస్ సైనిక చర్చలు



**వాషింగ్టన్, ఏప్రిల్ 4:** రెండోసారి అధ్యక్షుడి హోదాలో ట్రంప్ శ్వేతసౌధంలో అడుగుపెట్టిన తర్వాత తొలిసారి చైనా-అమెరికా మిలిటరీ చర్చలు జరిగాయి. ఈ విషయాన్ని పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇరు దేశాలు సైనిక భద్రతపై చర్చలు జరిపాయి. చైనాలోని షాంఘై నగరం వీటికి వేదికగా నిలిచింది. మరోవైపు అమెరికా సైనిక ప్రధాన కార్యాలయమైన పెంటగాన్ కూడా దీనిని ధ్రువీకరించింది. ఇవి వర్కింగ్ లెవల్‌లో జరిగిన చర్చలుగా పేర్కొంది. వీటిని అమెరికా ఇండో-పసిఫిక్ కమాండ్, కోస్ట్‌గార్డ్ నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైనా దళాల దుందుడుకు చర్యలపై దృష్టి పెట్టారు. అమెరికా-చైనా మధ్య సెమీ కండెక్టర్, పెట్టుబడులు, టారిఫ్‌లపై తీవ్ర స్థాయిలో విభేదాలున్న విషయం తెలిసిందే. అయినా, ఇరుదేశాలు మిలిటరీ అధికారులు భేటీ కావడం, పరిస్థితి స్థిరంగా ఉందనడానికి చిహ్నంగా నిలిచాయి. ఓవైపు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తొలిసారి ఆసియా పర్యటనకు వెళ్లి ఇండో-పసిఫిక్‌లో చైనా బలపడకుండా మిత్ర దేశాలతో చర్చలు జరిపారు. అదే సమయంలో చైనా ఈ సమావేశం నిర్వహించడం గమనార్హం. ట్రంప్ వాణిజ్యయుద్ధం మొదలుపట్టిన నేపథ్యంలో హెగ్సే పర్యటన ఆసియాలో అమెరికా సైనిక మోహరింపులకు సంకేతంగా నిలిచింది. తైవాన్ జలసంధి సహా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో దూకుడును కట్టడి చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని జపాన్ పర్యటనలో ఆయన పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో చైనాకు చెందిన నౌకాదళం ఇండో-పసిఫిక్‌లో యుద్ధ విన్యాసాలు నిర్వహించింది. ఇక ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా తీరం సమీపంలో అంతర్జాతీయ జలాల్లో లైవ్‌ఫైర్ డ్రిల్స్ చేపట్టింది. ఈ చర్యలతో ఇండో-పసిఫిక్‌లో రక్షణపై ట్రంప్ కార్యవర్గం ఏమేరకు కట్టుబడి ఉందో పరీక్షించినట్టయింది. ఇక రెండు రోజుల క్రితమే తైవాన్ జలసంధిలో చైనా యుద్ధ విన్యాసాలను ముగించింది.

# గోల్డ్‌కార్డు ఫస్ట్ లుక్ విడుదల చేసిన ట్రంప్



**వాషింగ్టన్, ఏప్రిల్ 4:** అమెరికా పౌరసత్వం కావాలని కోరుకునే సంపన్నులకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల 'గోల్డ్ కార్డు' ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ గోల్డు కార్డ్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను ఆయన విడుదల చేశారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడే సమయంలో ఆయన దీన్ని చూపించారు. ట్రంప్ చిత్రంతో ఉన్న ఈ గోల్డ్ కార్డును 5 మిలియన్ డాలర్లతో ఎవరైనా సొంతం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. దీని తానే మొదట కొనుగోలు చేసినట్లు ప్రకటించారు. అయితే, రెండోది ఎవరు కొంటారనేది తెలియదన్నారు. ఈ గోల్డ్‌కార్డు రెండు వారాల్లో అమ్ముడుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇబి-5 వీసా విధానాన్ని రద్దు చేసి రూ.43.5కోట్లు (50 లక్షల డాలర్లు) వెచ్చించేవారికి ఈ గోల్డ్‌కార్డు అందిస్తామని ఇటీవల ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని కొనుగోలు చేసిన వారికి నేరుగా అమెరికా పౌరసత్వాన్ని అందజేస్తారు. ప్రపంచవ్యాప్తంగా సంపన్నులను ఆకర్షించేందుకే దీనిని ప్రవేశపెట్టామి, వారు అమెరికాకు వచ్చి భారీగా ఖర్చు పెడితే స్థానికంగా ఉద్యోగాలు పెరుగుతాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ కార్డుకు భారీగా గిరాకీ వచ్చిందని, ఒక్కరోజే 1000 కార్డులను విక్రయిం చినట్లు వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ ఇటీవల తెలిపారు. వీటి ద్వారా 5 బిలియన్ డాలర్లు సేకరించామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 3.7 కోట్ల మందికి ఈ కార్డు కొనే సామర్థ్యం ఉందన్నారు. ఇబి-5 ప్రోగ్రామ్ వల్ల జరుగుతున్న మోసాలు, ఇతర అక్రమాలను అరికట్టేందుకు వీటిని తీసుకొస్తున్నట్లు తెలిపారు. చట్టబద్ధ ఇన్వెస్టర్లకు పౌరసత్వం, శాశ్వత నివాసం కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఇబి-5 వీసా విధానాన్ని 1990లో తీసుకొచ్చింది. వేలాదిమంది ఈ ఇన్వెస్టర్ వీసాలను పొందారు. అయితే, ఈ విధానంతో మోసాలు జరుగుతున్నాయని, కొందరు అక్రమంగా నిధులు పొందుతున్నారని ఇటీవల జరిపిన అధ్యయనంలో తేలింది. దీంతో 2022లో కొన్ని సవరణలు చేశారు. తాజా గా దీనిస్థానంలో గోల్డ్‌కార్డును ట్రంప్ ప్రకటించారు.

# లీకయిన యెమెన్ యుద్ధ ప్రణాళికలు

## సిగ్నల్ యాప్ వినియోగంపై పెంటగాన్ విచారణ



**వాషింగ్టన్, ఏప్రిల్ 4:** అమెరికా బలగాలు ఇటీవల యెమెన్‌పై భీకర దాడులు చేయడానికి సంబంధించిన ప్రణాళికలు ముందుగానే ఓ పాత్రికేయుడికి లీక్ అయినట్లు బయటికొచ్చిన సంగతి తెలిసిందే. సమాచారం లీక్ విషయంలో యుఎస్ రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తాజాగా ప్రణాళికలపై చర్చించేందుకు వినియోగించిన సిగ్నల్ యాప్‌పై విచారణ జరుపుతున్నట్లు పెంటగాన్ పేర్కొంది. పెంటగాన్ క్రియాశీల ఇన్‌స్పెక్టర్ జనరల్ స్టెవెన్ స్టెబిన్స్ గురువారం ఈ విషయాన్ని వెల్లడించారు. హెగ్సెత్ చాట్ కోసం వినియోగించిన సిగ్నల్ యాప్ రహస్య సమాచారం భద్రత, రక్షణ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందో, లేదో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక అధికార సంభాషణల కోసం ఇలాంటి కమర్షియల్ యాప్‌ల వినియోగం శ్రేయస్కరమేనా అనేది తమ విచారణ లక్ష్యమని వెల్లడించారు. యెమెన్‌లోని హూతీ రెబల్స్‌కు బలమైన సంకేతాలు పంపాలని అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించిన తర్వాత దాడులకు ప్రణాళిక సిద్ధమైంది. ఈ క్రమంలో వీటిని పర్యవేక్షించేందుకు జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్జ్ 'సిగ్నల్‌యాప్'లో రక్షణ మంత్రి పీట్ హెగ్సే, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బార్డ్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో సహా 19 మందికి యాడ్ చేశారు. ఈ క్రమంలో పొరబాటున అట్లాంటిక్ ఎడిటర్ జెఫ్రీ గోల్డ్‌బెర్గ్ కూడా యాడ్ అయిన వారిలో ఉన్నారు. ఈ గ్రూప్‌లో మెసేజ్‌లు వారం తర్వాత ఆటోమేటిక్‌గా అదృశ్యమై పోయేటట్లు సెట్టింగ్స్‌ను మార్చారు.

ఇటీవల ఈ గ్రూప్ చాటింగ్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్లను ఆ పత్రిక బహిర్గతం చేసింది. వీటిల్లో యెమెన్‌పై దాడులకు సంబంధించిన ప్లాన్లు చాలా స్పష్టంగా ఉన్నాయి. యుద్ధ విమానాలు బయల్దేరిన దగ్గర నుంచి అవి దాడులు చేసేవరకు అప్‌డేట్లు పోస్టు అయ్యాయి. హెగ్సెత్ గ్రూప్ చాట్‌లో టార్గెట్స్, అమెరికా ఆయుధాల మోహరింపు, దాడులు చేసే దిశ వంటి అంశాలపై చర్చించారు. ఆవిధంగానే దాడులు సైతం జరిగాయి. అయితే, వాన్స్‌గా గుర్తించిన వ్యక్తి ఈ దాడులను వ్యతిరేకించినట్లు వెల్లడైంది.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# "ప్రతి పేద వాడి సొంత ఇంటి కలను సాకారం చేస్తాం"

## పెదపాడు మండలం వీరమ్మ కుంట గ్రామంలో జరిగిన మీకోసం మీ చింతమనేని..



**ఏలూరు దెందులూరు ప్రభాతవార్త:** ప్రభుత్వం ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గం పరిధిలోని ప్రతి పేద వాడి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందుకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల వివరాల సేకరణ ప్రక్రియను ఇప్పటికే గ్రామాల్లో ముమ్మరం చేశామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మీ కోసం మీ చింతమనేని కార్యక్రమంలో బాగంగా పెదపాడు మండలం వీరమ్మకుంట గ్రామం లో శుక్రవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభ లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి కాలంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ, కాలనీలు నిర్మిస్తామంటూ జగన్ ప్రభుత్వం దగా చేసిందని, నివాసయోగ్యం కాని ప్రాంతాలను కాలనీలుగా ఎంపిక చేసి భూసేకరణలో వైసిపి నాయకులు ఎన్నో అవకతవకలకు, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వంగయాగూడెం నుండి పెరికీడు వరకు ఉన్న రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. గ్రామాల్లో పేదలకు మూడు సెంట్ల ఇంటిస్థలం అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చర్యలు తీసుకు న్నారని ఆయన తెలిపారు. జగన్ అండ్‌కో దోచుకున్న ప్రభుత్వ సొమ్మును తిరిగి ఖజానాకు చేరేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు





# నరసాపురానికి శిరోభారంగా చెత్త సమస్య

- గోదారి గట్టును వేస్తే ఓ సమస్య....
- కంపోస్ట్ యార్డ్ కరువై మరో సమస్య....
- పారిశుద్ధ్యం పై సమీక్షించిన జిల్లా కలెక్టర్ నాగరాణి





**నరసాపురం: ప్రభాతవార్త :** నరసాపురం ప్రాంత ప్రజలు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో చైతన్యవంతులు కావాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు చెత్త నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. శుక్రవారం నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన "పరిశుభ్ర నరసాపురం" కు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు, శానిటరీ వర్కర్స్ తో సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ నరసాపురం డంపింగ్ పెద్ద సమస్యగా మారిందని, గోదావరి నది ఒడ్డున డంపింగ్ చేయడంతో భూమి, వాయు, నీరు కాలుష్యం అవుతున్నాయని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పరిశీలించి అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ చర్యలకు పూనుకున్న సందర్భంలో, కొంత సమయాన్ని అడిగి తాత్కాలికంగా చర్యలను నిలుపుదల చేసుకోవడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, పెద్ద ఎత్తున చెత్త గోదావరి ఒడ్డున డంపింగ్ చేయడం వలన గోదావరి పెరిగితే నదిలో కలిసిపోవడం, లేనిపక్షంలో పట్టణాన్ని ముంచెత్తడం జరుగుతాయని ఇవి పెద్ద అనారోగ్యకరమైన అనార్థాలకు దారితీస్తాయన్నారు. చెత్త వ్యర్థాలు నీటిలో కలవడం కలిసిన నీరు తాగడం, ఆ నీటితో పండించిన కూరగాయలు, పళ్ళు విషంపూరితమై అనారోగ్యం చేకూరుస్తున్నాయన్నారు. అంతేకాకుండా క్యాన్సర్, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు వంటి వ్యాధులకు గురి అవుతున్నారని వివిధ పరిశోధనలలో తేలిందన్నారు. అలాగే పశువులు డంపింగ్ చేసిన ప్రాంతంలో తినడం వలన చెత్తలో ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, బ్లేడ్లు, ఇనుప వస్తువులు తదితర పదార్థాలు జంతువులకు పెద్ద హాని చేస్తున్నాయని అలాగే వాటి ఆరోగ్యాన్ని కూడా దెబ్బతిస్తున్నాయనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలన్నారు. విధినిర్వహణలో ఉత్తమంగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు. పారిశుద్ధ్య కార్మికులు గృహస్థులకు మరింత అవగాహన కల్పించి తడి చెత్త, పొడి చెత్త విడివిడిగాని ఇస్తేనే సేకరించాలని ఆదేశించారు. పొడి చెత్తను ప్రతిరోజు సేకరించకపోయిన రెండు రోజులు ఒకసారి సేకరించాలని సూచించారు. ప్రతి పని కార్యరూపం దాల్చినప్పుడే ఫలితాలను పొందగలమని అన్నారు. నరసాపురం డంపింగ్ యార్డ్ లో పాత వేస్ట్ ను మిషన్ ద్వారా గ్రైండింగ్ చేసి కంపోస్ట్ గా తయారు చేయడం జరుగుచున్నదని, దీనికి అదనంగా రోజురోజుకు పెద్ద మొత్తంలో చెత్త పోగు పడటం ఇబ్బందికరంగా ఉందని బాధను వ్యక్తం చేశారు. నరసాపురం ప్రజలు చైతన్యవంతులు కావాలని, నరసాపురానికి కొన్ని వందల సంవత్సరాల చరిత్ర ఉందని, దీనిని చేజేతులా నాశనం చేసుకోరాదని హితవు పలికారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు అందరు సహాయ సహకారాలతో మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ వహించి చెత్త రహిత నరసాపురంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. హెూటల్స్, హాస్టల్స్, షాపింగ్ మాల్స్, కళ్యాణ మండపాలు తదితర వాటి నుండి 50 కేజీలకు మించి వచ్చిన చెత్తను ఎట్టి పరిస్థితుల్లో సేకరించరాదని, ఈ విషయమై కౌన్సిల్లో కూడా తీర్మానం చేయాలన్నారు. 50 కేజీలు లోపు చెత్తను పొడి చెత్త, తడి చెత్తగా వేరు చేసి ఇస్తే మాత్రమే సేకరించాలని ఆదేశించారు. 50 కేజీల పైన చెత్తను జనరేట్ చేస్తే వారే సొంతంగా ఫిట్స్ ను ఏర్పాటుసి కంపోస్ట్ చేసుకోవాలని తెలియజేయాలన్నారు. ఒకరికి సాధ్యం కాకపోతే ఇద్దరు, ముగ్గురు కలిసి కూడా ఏర్పాటు చేసుకోనెలా వారికి అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా తెలిపారు. నరసాపురం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త వారి ఇంటిలోనే వేరు చేసే ఇచ్చేలా ప్రోత్సహించాలన్నారు. డంపింగ్ యార్డ్ కు అవసరమైన స్థల సేకరణలో ప్రతి ఒక్కరు సహాయ సహకారాలను అందించాలన్నారు. ప్రజా ప్రతినిధులుగా పరిశుభ్ర నరసాపురం గా రూపుదిద్దుచేందుకు మా వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చెత్త రహిత నరసాపురంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలను ముందుస్తుగా సిద్ధం చేయాలని సూచించారు. ప్రతిరోజు ఎంత చెత్తను సేకరిస్తున్నారు, ఎంత వేరు చేయాలి శానిటరీ సెక్రటరీలు ఇంటింటికి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలలో అవగాహన రావాలని, గడువు దాటిన మార్పు రాకపోతే అపరాధ రుసుము కూడా విధించడం జరుగుతుందని తెలిపారు. సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ తోనే 30 శాతం డంపింగ్ నిండిపోతుందని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పర్యవేక్షించేందుకు టీమ్స్ ను నియమించాలని సూచించారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ , వైస్ చైర్ పర్సన్ కామన నాగిణి, కార్పొరేటర్లు బొమ్మిడి సూర్యకుమారి, తోట అరుణ, కోప్పాడ కృష్ణవేణి, ఎస్.మీరమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, శానిటరీ సెక్రటరీలు, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఆర్థిక మంత్రి సహకారంతో పెదమైన వాని లంకకు వెలుగులు

- సముద్రపు కోత నివారణకు చర్యలు
- అన్ని వసతులతో గ్రామాన్ని మోడల్ విలేజ్ గా రూపొందించడం
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి
- విప్ ఎమ్మెల్యే నాయకర్ పర్యవేక్షణ

**నరసాపురం రూరల్ ప్రభాత వార్త :** శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పెదమైనవానిలంక డిజిటల్ భవనాన్ని, పీఎం లంక సముద్రపు కోతకు గురయ్యే ప్రాంతంలో డెలాయిట్ కంపెనీ చేపట్టనున్న ప్రాజెక్ట్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నరసాపురం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డిఓ దాసిరాజు తదితరులు ఉన్నారు. తొలుత డిజిటల్ భవన్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మల సీతారామన్ సహకారంతో పీఎం లంకను అన్ని విధాల అభివృద్ధి చేయడం జరుగుతుందని, పిల్లలు మాత్రం 6,7,8 తరగతులలో డ్రాప్స్ అవ్వకూడదని, ఎంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పిల్లలను మాత్రం చదివించాలని చాలా అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పీఎం లంక నందు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పర్యవేక్షణలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై స్థానిక ప్రజలకు వివరించారు. పి ఎమ్ సూర్యఘర్ పథకం కింద పిఎం లంక గ్రామంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు అనువైన 100 గృహాలకు ఎంపిక చేసి సబ్సిడీతో సోలార్ విద్యుత్ ను ఏర్పాటు చేయడం మరియు డిజిటల్ భవన్ కు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 15 నాటికి సోలార్ విద్యుత్ ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత ఏజెన్సీలని ఆదేశించారు. అలాగే రూ.40 లక్షల వ్యయంతో లైబ్రరీ భవనాన్ని, టాయిలెట్స్ నీటి సదుపాయం, ప్రహరీ గోడ నిర్మాణం, రూ.25 లక్షల వ్యయంతో అంగన్వాడి సెంటర్ నిర్మాణం, ప్రహరీ గోడ టాయిలెట్స్ నిర్మాణం, రూ.20 లక్షలతో కల్చరల్ ఓపెన్ ఆడిటోరియం ప్రహరీ గోడతో నిర్మాణంతో సహా, గ్రామంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులను ఆమె వివరించారు నరసాపురం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడ నాయకర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన పీఎం లంక అభివృద్ధికి కేంద్రమంత్రి సీతారామన్ దత్తత తీసుకొని వివిధ అభివృద్ధి పనులను చేపట్టడం ఇక్కడ ప్రజలు చేసుకున్న అదృష్టంగా భావించాలన్నారు. సోలార్ ప్యానల్స్ కూడా అమర్చడంతో నిరంతర విద్యుత్ ఎటువంటి ఖర్చు లేకుండా మీకు సమకూరుతుందన్నారు. ఈ ప్రాంతపు రైతులు ఉప్పుమడులపై ఆధారపడి జీవిస్తున్నారని, వర్షాలు కారణంగా రైతులు నష్టపోతున్నారని, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఈ విషయమై తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ భవన్ ద్వారా నైపుణ్యాలను పెంచుకొని ప్రయోజకులు కావాలని కోరారు. అభివృద్ధికి సహకరిస్తే మీ ప్రాంతానికి మంచి ప్రాజెక్టులు వస్తాయని తెలిపారు. అనంతరం పీఎం లంక సముద్రపు కోతకు గురయ్యే ప్రాంతంలో డెలాయిట్ కంపెనీ చేపట్టనున్న ప్రాజెక్ట్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్థానిక శాసనసభ్యులు, జిల్లా జాయింట్ కలెక్టర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంలో రైతులతో మాట్లాడీ సముద్రపు కోత నిరోధక కట్ట ప్రయోజనాలను వివరించి ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎ.రఘునాథబాబు, డ్వామా పిడి డా.కె.సిహెచ్ అప్పారావు, పంచాయతీరాజ్ ఎస్.ఇ కె.శ్రీనివాస్, జిల్లా టూరిజం శాఖ అధికారి అప్పారావు, సర్పంచ్ ఎం.శివకుమార్, ఇన్చార్జి తహసిల్దార్ ఐవివి సత్యనారాయణ, ఎంపీడీవో జీవీఎస్ కృష్ణంరాజు, పిఆర్ ఈఈ కె.శ్రీనివాసరావు, ఏఈ డి.నాగేశ్వరరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.





# చిగురు మామిడిలో విపత్తు నివారణా దళం



**వేలేరుపాడు, ప్రభాతవార్త :** ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి ప్రాణ నష్టం కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై వేలేరుపాడు మండలం చిగురుమామిడి గ్రామంలో శుక్రవారం రాష్ట్ర విపత్తు నివారణ దళం సభ్యులు ప్రదర్శన (మాక్ డ్రిల్) నిర్వహించారు. తూఫానులు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణ నష్టాన్ని నివారించేందుకు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు రాష్ట్ర విపత్తు నివారణ దళం సిబ్బందితో ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కలిగించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ రమణ తెలియజేసారు. విపత్తు అత్యవసర పరిస్థితులలో ప్రజలు అప్రమత్తతో ఉండాలని, ఈ కార్యక్రమంలో తెలియజేసిన అంశాలను పాటించాలని రమణ చెప్పారు. కార్యక్రమంలో వేలేరుపాడు తహసీల్దార్, రెవిన్యూ , రాష్ట్ర విపత్తు నివారణ సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు.



# ఎంపీ మహేష్ కుమార్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం

## గుండుగొలను వద్ద నిలిచిన వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన ఎన్.హెచ్.ఏ.ఐ, ఐడబ్ల్యూఏఐ అధికారులు.





**ఏలూరు టౌన్, ఏప్రిల్ 04, ప్రభాత వార్త :** ప్రభుత్వ శాఖల నడుమ కొరవడిన సమన్వయలోపంతో భీమడోలు మండలం గుండుగొలను వద్ద ఏలూరు కాలువపై అసంపూర్తిగా నిలిచిన వంతెన నిర్మాణ పనులు కొలిక్కి తీసుకువచ్చే దిశగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టి సారించారు. భీమడోలు మండలం గుండుగోలను వైపు వెళ్లే ప్రజలు వ్యతిరేక దిశలో జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో గుండుగొలను వద్ద ఏలూరు కాలవపై వంతెన నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రూ.3.40 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ అనంతరం నిర్మాణ పనుల బాధ్యతలు స్వీకరించిన గుత్తేదారు వంతెన నిర్మాణం ప్రారంభించారు. అయితే ఏలూరు కాలవపై అనుమతి తీసుకోకుండా, తమ శాఖ మార్గదర్శకాల మేరకు వంతెన నిర్మాణం చేపట్టనందున తక్షణం పనులు నిలిపివేయాలని ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా స్లాబ్ దశ వరకు చేరిన వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. దీంతో ప్రజలు వ్యతిరేక దిశలోనే జాతీయ రహదారి మీదుగా గుండుగొలను వైపు రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానిక ప్రజలు, నాయకులు సమస్యను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం స్పందించిన ఆయన ఇటీవల ఏలూరు శాంతినగర్ లోని తన కార్యాలయంలో ఎన్.హెచ్.ఏ.ఐ, ఐడబ్ల్యూఏఐ అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడం వల్ల అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎంపీ మహేష్ కుమార్ ఆదేశాలతో ఎన్.హెచ్.ఏ.ఐ టెక్నికల్ మేనేజర్ సాల్మన్ అన్సోవి, సైట్ ఇంజనీర్ సాయినాథ్, కన్స్ట్రక్టివ్ మేనేజర్ సోమేశ్, ఐడబ్ల్యూఏఐ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ సురేష్ శర్మ, జూనియర్ ఇంజనీర్ ఆర్.లోకేష్, ఎంపీ మహేష్ కుమార్ ఓఎస్డి రాఘవులు, స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి గుండుగొలను వెళ్లి ఏలూరు కాలువపై నిలిచిన వంతెన నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. వంతెన అసంపూర్తిగా ఉండటం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను స్థానికులు అధికారులకు వివరించారు. ఎంపీ మహేష్ కుమార్ ఆదేశాలతో ఇక్కడికి వచ్చిన తాము సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు బదులిచ్చారు. పార్లమెంట్ సమావేశాల దృష్ట్యా ఢిల్లీలో ఉన్న ఎంపీ మహేష్ కుమార్ అధికారులతో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ ను స్వయంగా కలిసి వంతెన నిర్మాణానికి అనుమతి కోరుతానని ఫోన్లోనే అక్కడ ప్రజలకు ఎంపీ మహేష్ కుమార్ భరోసా ఇచ్చారు. తాము చెప్పిందే తడువుగా సమస్య పరిష్కారానికి తన వంతు అవిశ్రాంత కృషి చేస్తున్న ఎంపీ మహేష్ కుమార్ కు స్థానిక ప్రజలు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# నీట్ పరీక్షలు పగడ్బందీగా జరపాలి:కలెక్టర్ చదలవాడా నాగరాణి



**భీమవరం ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** జిల్లాలో మే 4న నిర్వహించే నీట్ ఎగ్జామ్స్ సంబంధించిన ఏర్పాట్లను అత్యంత పగడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు కలెక్టర్ చదలవాడ నాగరాణి నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, పరీక్షలు నిర్వహణ డిస్టిక్ నోడల్ అధికారి, ఎన్ఐటి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 2,100 మంది అభ్యర్థులు నీట్ పరీక్షలు రాయుటకు తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటి, శశి కాలేజీ లలో రెండు సెంటర్లను కేటాయించడం జరిగిందని మే 4వ తేదీన పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష ఆఫ్ లైన్ లో జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లకు ఇప్పటినుండే సంబంధిత సెంటర్లను పూర్తిస్థాయిలో పరీక్షించి అన్ని ఏర్పాట్లను పగటిబందీగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, డిఇఓ ఇ. నారాయణ, పరీక్షలు నిర్వహణ డిస్టిక్ నోడల్ అధికారి ఎన్.జయరాం, ఎన్ఐటి. సూపరింటెండెంట్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ ఎన్.సునీల్ కుమార్, తాడేపల్లిగూడెం డిఎస్పి డి.విశ్వనాథ్, పాల్గొన్నారు.

# పేరెంటాలమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శివ...

**భీమవరం ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** వెలువర్రు వీర పేరంటాలమ్మ అందర్నీ చల్లగా చూసి, అందరికీ శుభాలు కలగజేయాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఉండి మండలం వెలువర్రు గ్రామంలో కొలువై ఉన్న గ్రామ దేవత వీర పేరంటాలమ్మ అమ్మవారి 72వ జాతర మహెూత్సవంలో భాగంగా శుక్రవారం ఆయన అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ దేవాలయం ప్రాంగణం అభివృద్ధి చెంది భక్తులకు సౌకర్యవంతంగా ఉందన్నారు ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను, ఆలయ కమిటీని అభినందించారు. అమ్మవారి ప్రతిష్ట మహెూత్సవంలో నేను పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.




# ఆంథోనీ నగరం వద్ద కూలీలు ఆటో బోల్తా

**చింతలపూడి.. ప్రభాత వార్త:** చింతలపూడి మండలం ఆందోనినగరం వద్ద కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా పడి గాయాలు.మన సరిహద్దు రాష్ట్రమైన తెలంగాణ లోని దిద్దుపూడి గ్రామానికి చెందిన కూలీలు చింతలపూడి మండలం వెలగలపల్లి లో కె. యమ్. ఆర్ మొక్కజొన్న ఫ్యాక్టరీలో రాత్రివేళ పనికి వెళ్లి ట్రక్ ఆటోలో తిరిగి వస్తుండగా ఆటో పంచర్ కావడంతో ఉదయం ఐదు గంటల ప్రాంతంలో ఆంథోనీ నగర్ వద్ద అదుపుతప్పి బోల్తా పడటంతో పది మంది మహిళా కూలీ లకి గాయాలైనాయిచింతలపూడి శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ఆదేశాల మేరకు వెంటనే ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు అప్రమత్తమై వైద్యం అందించిన పిమ్మట కనపర్తి లక్ష్మి(35) అనే మహిళ కు మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించడం జరిగింది,మిగతా క్షతగాత్రులంతా క్షేమంగానే వున్నారని హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు దేవా,భారతి తెలిపారు.



# ఎర్రకాలువ లో పడి వృద్ధుడు మృతి

**జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త:** జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం-నాగుల గూడెం గ్రామాల మధ్య గల ఎర్ర కాలువలో పడి లక్కవరానికి చెందిన చల్లా బసవయ్య (70) అనే పాతఇసుక ర్యాంపు సమీపంలో పశువులను మేపేందుకు అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి ఉన్నాయి. పశువులు కాలువలోకి వెళ్లడంతో వాటిని మునిగిపోయి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. రాత్రి గాలింపు చర్యలు చేపట్టిన అతని మృతదేహం కనుగొన్నారు. లక్కవరం పోలీసులు పంచనామా చేసి అతని ఆసుపత్రికి తరలించారు.



వృద్ధుడు మరణించారు. కొండ దేవతల ఆలయం బసవయ్య వెళ్లారు. గురువారం సాయంత్రానికి కూడా చూడగా కాలువ వద్ద అతడి చెప్పులు, తువ్వాలు, కర్ర తోలేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బసవయ్య లక్కవరం ఎస్సై శశాంక ఘటనా స్థలానికి చేరుకొని లభించలేదు.శుక్రవారం ఉదయం అతని మృతదేహాన్ని మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ప్రాంతీయ

## వేములపల్లి గ్రామంలో టెన్ని టోర్న్ మెంట్...



లింగపాలెం ఏప్రిల్ 4 ప్రభాతవార్త..... అంబేద్కర్ జయంతి సందర్బంగా లింగపాలెం మండలం వేములపల్లి గ్రామం లో క్రికెట్ (టెన్నిస్టోర్నమెంట్) నిర్వహించడం జరుగుతుంది,అందులో భాగంగా గౌరవ శాసన సభ్యుల వారి చేతుల మీదుగా టోర్నమెంట్ పోస్టర్ రిలీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో లింగపాలెం మండల అధ్యక్షులు గరిమెళ్ల. చలపతి, నత్తా నాగేంద్ర మరియు యువత పాల్గొన్నారు.

## సారా కేసులో 12 మంది బైండవర్



చాట్రాయి, ఏప్రిల్ 4,ప్రభాతవార్త :ఆంధ్ర ప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనముగా ప్రవేశ పెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమము లో బాగముగా నూజివీడు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ లో 12పాత నేరస్తులను చాట్రాయి తహసిల్దార్ వారి ఎదుట హాజరు పరచి వారిని బైండ్ ఓవర్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో గీత మాట్లాడుతుఈ బైండ్ ఓవర్ ఒక సంవత్సరం కాల పరిమితి ఉంటుందని ఈ సంవత్సరం కాల పరిమితి లో మీరు మరలా ఎక్సైజ్ నేరాలకు పాటుపడితే పాల్పడిన వారి వద్ద నుండి లక్ష రూపాయలు జరిమానా మరియు ప్రభుత్వ పథకాలను రద్దు చేయడం జరుగుతుందని పాత నేరస్తులను హెచ్చరించారు. 1)హనవతు విజయ,పోతపల్లి పెద్ద తండా 2)లావురి కాంతమ్మ,పోతపల్లి పెద్ద తండా 3) ధరావతు పెద్ద బాలు, పోతపల్లి పెద్ద తండా 4)భుక్యా శ్రీనివాస్,పోతపల్లి చిన తండా 5)చల్లకంటి సతీష్ చిత్తపూరు, 6)పిల్లి దుర్గా ప్రసాద్, పోలవరం 7)వేలివల్లి తరుణ్, పోలవరం 8)భుక్యా ప్రసాద్ 9) సుగ్గాల రవి కుమార్, పోలవరం 10) పోలగాని దుర్గా రావు, పోలవరం 11 )పజ్జూరి బాల కృష్ణ, పోలవరం 12) కలవకొల్లు రెడ్డయ్య, పోలవరం ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేములపల్లి లో ఓపెన్ టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో లింగపాలెం మండలం వేములపల్లి లో ఈనెల 14 నుండి ఓపెన్ టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ. 3వేలు అని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.ఒక లక్ష ఎమ్మెల్యే రోషన్ కుమార్ చే అందించబడుతుందని తెలిపారు. ద్వితీయ బహుమతి రూ 40వేలు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు నందిగం సీతారాం తిలక్ (బాబి), మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతి రూ 12వేలు మహేంద్ర పిక్చర్స్ అధినేత వల్లూరి శ్రీనివాసరావు అందజేస్తారని తెలిపారు. టెన్నిస్ బాల్ టోర్నమెంట్లో పాల్గొనే ప్రతి టీమ్ సభ్యులు మేనేజ్మెంట్ వారు తీసుకొనే నిర్ణయాలను గౌరవించాలని వారు కోరారు. పాల్గొనే టీములవారు సెల్ 9490601699,8143535277 లను సంప్రదించాలని తెలిపారు.

## ఏ పోలవరంలో గ్రామసభ

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా జంగారెడ్డిగూడెం మండలం ఏ పోలవరంలో శుక్రవారం గ్రామసభ జరిగింది. ఈ సభకు తహసీల్దార్ స్లీవా జోజి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా ఏ పోలవరంను రీ సర్వే పైలెట్ విలేజ్ గా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు ఈ గ్రామంలో గత ఏడాది డిసెంబరు 20న గ్రామసభ ను మొదటిసారిగా నిర్వహించామన్నారు. అనంతరం ప్రైవేటు భూముల సర్వే ప్రారంభంనకు ముందు ఈ ఏడాది జనవరి 28న గ్రౌండ్ గ్రామసభ నిర్వహించి, ప్రైవేటు భూముల సర్వే పూర్తి చేసి, విస్తీర్ణంలు లెక్కించామన్నారు. అనంతరం వచ్చిన కొత్త విస్తీర్ణం లను ఈరోజు గ్రామసభ నిర్వహించి రైతులకు తెలియ పరచామని తెలిపారు. అభ్యంతరాలకు దరఖాస్తులు స్వీకరించామని వివరించారు.

## భద్రాచలంనకు ప్రత్యేక బస్సులు

## జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి



పెనుమంట్ర, ఏప్రిల్- 04, ప్రభాతవార్త :మండల కేంద్రం పెనుమంట్ర గ్రామపంచాయతీ పరిధిలో బ్రాహ్మణ చెరువు నేలపోగులు రోడ్డులో రెండు కాలువుల మధ్యలో ఇచ్చిన జగనన్న కాలనీ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్ ప్రభుత్వాన్ని శుక్రవారం డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో మంచినీటి పైపులు, వీధిలైట్లు, రోడ్లు నిర్మించి, డ్రైనేజీ వ్యవస్థ పటిష్టం చేయాలని అన్నారు. ఇందులో భాగంగానే నిన్న పంట కాలవ పొంగి ఇళ్ల వద్దకు నీరు రావడంతో భయాందోళనలకు గురి అవుతున్నారని అన్నారు. విష సర్పాలు వచ్చే ప్రమాదం ఉందని భయపడుతున్నారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇలా ఉంటే రానున్న వర్షాకాలంలో మా పరిస్థితి ఏంటి అని వాపోయారు. కావున సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ ప్రజలకు న్యాయం చేయాలని కోరుచున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, పిప్పరపల్లి భాస్కరరావు, ఉందుర్తి. కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాలుర వసతి గృహం ని సందర్శించిన
### సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నం ప్రసాద్



**ఏలూరు టౌన్ , ఎప్రిల్ , 4, ప్రభాత వార్త :** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి/ సీనియర్ సివిల్ జడ్జి కె. రత్నం ప్రసాద్ గురువారం స్థానిక శనివారపేటలోని ప్రభుత్వ బాలురు వసతి గృహాన్ని సందర్శించారు ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి/ సీనియర్ సివిల్ జడ్జి కె. రత్నప్రసాద్ మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలు మరియు రాష్ట్రా న్యాయ సేవాధికార సంస్థ మరియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. సునీల్ కుమార్ (ఎఫ్.ఎ.సి) ఆదేశాల మేరకు ప్రకారం జిల్లాలోని వసతి గృహాలను ప్రతినెల తనిఖీ చేయాలని అందులో భాగంగా ఈరోజు శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గ్రహాన్ని సందర్శించి, బాలురకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, వైద్య, విద్యా సదుపాయాల పై వివరాలు తెలుసుకోవడం జరిగిందని, అలాగే బాలురకు కల్పిస్తున్న ఇతర సౌకర్యాల గురించి తెలుసుకోవడం జరిగిందని తెలియజేశారు. అబ్జర్వేషన్ హెూమ్ లో ఉన్న బాలుర కేసులు వివరాలు, వాటి పురోగతి, న్యాయవాదుల పనితీరు మొదలైన విషయాలను తెలుసుకొని, కేసులను త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలని న్యాయవాదులకు సూచించారు

# మైనారిటీల హక్కులకు రక్షణ లేదు

**ప్రభాతవార్త నరసాపురం :**

నరసాపురం, ఏప్రిల్ 4:-మైనార్టీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ సవరణను వ్యతిరేకిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పట్టణంలో పంజా సెంటర్ మరియు చేపల మసీదు వద్ద మైనార్టీ ముస్లిం ప్రజానికంతో నిరసన కార్యక్రమం నిర్వహించారు మతాల మధ్య చిచ్చుపెట్టే వక్ఫ్ చట్ట సవరణను ప్రజలంతా ఖండించండి లౌకిక విలువలను హరించే వక్ఫ్ సవరణను వ్యతిరేకించండి లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడండి బిజెపి మతోన్మాద విధానాన్ని వ్యతిరేకించండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దరాజు పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ బిజెపి కేంద్ర ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తుందన్నారు, లవ్ జిహాద్,ఘరవాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం వంటి చర్యలకు హిందుత్వ శక్తులు పాల్పడుతు, మరొకపక్క వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింల ధార్మిక, సామాజిక, సంస్కృతిక, సంస్థలపై దాడి తలపెట్టిందని విమర్శించారు, ఈ చట్టం ముస్లింలు ఆస్తులను కబ్జా చేయడానికి తప్ప, వక్ఫ్ ఆస్తులను అభివృద్ధికి కాదని అన్నారు ,ఈ దుర్మార్గమైన సవరణలను చేస్తూ ముస్లిం ప్రజల ఆస్తులపై యుద్ధాన్ని ప్రకటిస్తుందని దీనిని లౌక్య పార్టీలుగా చెప్పుకునే టిడిపి జనసేన పార్టీలు తో సహా మరికొన్ని పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కై బలపరచటం లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరమని గుర్తు చేశారు , ఒక్కసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులు శాశ్వతంగా వక్ఫ్ ఆస్తులుగా ఉంటాయని వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికి లేదని సుప్రీంకోర్టు తీర్పు



వ్యతిరేకంగా ఈ చట్టం ,చేయబడిందని అన్నారు భారత రాజ్యాంగంలోని 25 ,29, 30 తదితర నిబంధనలకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడిందని మసీదులు దర్గాలు స్మశానాలు ఇప్పుడు మరింత ప్రమాదంలో పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు, లక్షల ఎకరాల వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టపడతాయని , ఇతర మతాలవారు వక్ఫ్ బోర్డులో సభ్యుల్లో చేర్చి వాటిని వివాదాస్పదం చేసి భారత ప్రజలను మతపరంగా విభజించే కుట్రలో భాగంగా బిజెపి మతోన్మాద విధానాలు ముందుకు తీసుకొస్తుందని ఇది దేశానికి చాలా ప్రమాదకరమని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు పొగాకు పూర్ణ పొగాకు నారాయణరావు నోములకొండ ఎండి అజిజి మరియు ముస్లిం మైనార్టీ ప్రజానీకం ఎండి షానవాజ్ ఖాన్ ,ఎస్.కె అహ్మద్ షా ,ఎస్ కె మహమ్మద్ షరీఫ్, ఎండి ఖఖ మోహిద్, ఎండి ఫిరోజ్ ఖాన్ ,నూర్ మహమ్మద్ మోహిద్దిన్, ఎండి అబ్దుల్ రషీ ,ఎస్ కే అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు




లింగపాలెం మండలం ధర్మజీ గూడెం గ్రామంలో శ్రీవిద్య పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రత్నాకర్ ఎంఈఓ రామారావు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

# సీఎం చంద్రబాబును కలిసిన శ్రీవారి మందిర అధ్యక్షులు కంతేటి



భీమవరం ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ఈనెలలో భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంకు విచ్చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మందిర అధ్యక్షులు కంతేటి వెంకటరాజు కోరారు. అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎంను కలిశారు. ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు శ్రీవారి 14వ వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని, ఈ బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని కోరారు. దీనిపై సీఎం చంద్రబాబు సముఖంగా మాట్లాడటం జరిగిందని వెంకటరాజు తెలిపారు. తొందరలోనే బ్రహ్మోత్సవ తేదీలలో భీమవరం సిఎం చంద్రబాబు ఆలయానికి వస్తారని ఆశిస్తున్నామని అన్నారు. మందిర డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఐ.ఎన్.టి.ఎస్.ఓ సెకండ్ లెవెల్ లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు



**చింతలపూడి.. ప్రభాత వార్త :** శ్రీ చైతన్య విద్యార్థులు ఐ.ఎన్.టి.ఎస్.ఓ సెకండ్ లెవెల్ లో విశిష్ట ప్రతిభ కనపరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ టి.సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులలో 249 మంది వివిధ విభాగాల్లో అత్యున్నత ప్రతిభ కనపరచారని దానిలో భాగంగా ఒకరు మొదటి బహుమతి సయ్యద్ జోయా మాన్వా,ఇద్దరు రెండవ బహుమతి, ముగ్గురు మూడవ బహుమతి, నలుగురు నాలుగవ బహుమతి,నలుగురు ఐదవ బహుమతి, 8 మంది స్పెషల్ ప్రైజ్ ను, 93 మంది కన్సోలేషన్ బహుమతి, 26 మంది గోల్డ్ మెడల్, 108 మంది గోల్డ్ మెడల్ మరియు మెరిట్ సర్టిఫికెట్ సాధించి విజయకేతనం ఎగరవేశారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్.ఐ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ శ్రీ చైతన్యాలో అందించే ప్రత్యేక శిక్షణ వలన మాత్రమే విద్యార్థులు ఇంతటి ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. చివరిగా బహుమతులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్స్ ఏ.జీ.ఎం పార్థసారథి ,ఆర్.ఐ ఉదయభాస్కర్, కో-ఆర్డినేటర్. వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ.సురేష్, ఏ.వో శ్రీ .రవీంద్ర, డీన్ .మధు బాబు, ప్రైమరీ ఇన్చార్జ్ ఝాన్సీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్ గ్రామ సింహాల స్వైర్య విహారం - బెంబేలెత్తుతున్న ప్రజలు

ముసునూరు, ఏప్రిల్04 ప్రభాతవార్త: గ్రామ సింహాల స్వైర్య విహారం ఎక్కువగా ఉండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గత కొన్నేళ్లుగా గ్రామసింహాలను నిర్మూలించకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వటంతో గ్రామపంచాయతీ అధికారులు వాటిని పట్టించుకోవటం లేదు. ఆపరేషన్ విధానం ద్వారానే వాటి జాతి వృద్ధి చెందకుండా నియంత్రణ చేయాల్సి ఉంది. అది కూడా అధికారులు చర్యలు తీసుకోపోవటం కారణంగా ఏ గ్రామంలో చూసిన ఊర కుక్కల గుంపులు గుంపులుగా ఉంటున్నాయి. గతంలో మాంసం దుకాణాల వద్ద భారీగా ఉండేవి. ప్రస్తుతం కోళ్ల ఫారాలు వృద్ధి చెందటంతో వాటి వ్యర్థాలు గ్రామ శివారు ప్రాంతాలలో పోయటం వలన అక్కడ కుక్కలు చేరి రహదారులపై వెళ్లే ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఇటీవల మండల కేంద్రమైన ముసునూరులో ఒకే రోజు 24 మందిపై ఒక పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ దాడిలో ఒక వ్యక్తి మృతి చెందగా మిగిలిన వారు ట్రీట్మెంట్ తీసుకుంటున్నారు. ముసునూరు పోలీస్ స్టేషన్ సమీపంలో ఒక మహిళపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తూ ఉండగా, అది చూసిన అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆమెను రక్షించేందుకు వెళ్లి కాపాడాడు. ఆ పిచ్చికుక్క కాపాడేందుకు వెళ్లిన వ్యక్తిని తొడ కాలు భాగములో తీవ్రంగా కరిచి గాయపరిచింది. అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నెలరోజుల లోపు గానే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఊర కుక్కల వల్ల ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు మండల, గ్రామస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటికీ పట్టించుకోవటం లేదని గ్రామ ప్రజలు ఆందోళన చేస్తున్నారు. కుక్క కాటు వలన ప్రాణాపాయ స్థితి ఉండదని చాలామంది అనుకుంటారు, కానీ గ్రామంలో వ్యక్తి మరణించడం వలన ప్రజలందరూ ఒక్కసారిగా భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న 23 మంది కూడా తీవ్రంగా ఆందోళన పడుతున్నారు. గ్రామంలోని ప్రధాన సెంటర్లతోపాటు నివాస గృహాల సమీపంలోని గుంపులు గుంపులుగా ఉంటున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపై, నివాస గృహాల మధ్య ఆడుకునే చిన్నపిల్లలు పై కూడా దాడి చేస్తున్నాయి. బైకులు పై ప్రయాణించే వాహన చోదకులు పై కూడా దాడి చేసి బైక్ల మీద నుంచి కింద పడేస్తున్నాయి. దీంతో గ్రామ సింహాలు అంటే ప్రజలకు చాలా ఇబ్బందిగా మారింది. పాడి పశువులు, గొర్రెలు,మేకలపై కూడా దాడి చేసి చంపేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రాత్రి సమయంలో రహదారుల మధ్యలోనే నివాసం ఉంటూ అటు వచ్చే వారిపై దాడి చేస్తున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

# పారిశుధ్యం లోపించిందని వైస్ ఎంపీపీ మట్ట సురేష్ ఆరోపణ

లింగపాలెం ఏప్రిల్ 4 ప్రభాతవార్త...ధర్మాజీ గూడెంలో పూర్తిగా పారిశుధ్యం లోపించిందని వైస్ ఎంపీపీ మట్ట సురేష్ ఆరోపించారు. మండల కేంద్రమైన లింగపాలెం లోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరం నందు శుక్రవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ ముసునూరు వెంకటలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మట్ట సురేష్ మాట్లాడుతూ ధర్మాజీ గూడెం గ్రామంలోని పలు కాలనీలో డస్ట్ బిన్స్ పంపిణీ చేయలేదని అన్నారు. తీర్మానాలు కూడా సక్రమంగా రాయాలని ఆయన కార్యదర్శి కోరారు.రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మండల విస్తరణ అధికారి జే యం. రత్న కుమార్ అన్నారు. అనంతరం ఈ సమావేశంలో జరిగిన అభివృద్ధిపై అధికారులు పూర్తిస్థాయిలో సమాచారంతో హాజర అవ్వాలని సమావేశానికి అరగంట ముందు పలు శాఖల అధికారులు రావాలని సమావేశం మొదలైన అరగంటకు గంటలకు తరువాత వస్తే అటువంటి అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కే వాణి అన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి శరత్తకుండా కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకుంటామని విస్తరణ అధికారి జయం రత్నకుమార్ అన్నారు. మన శాఖల అధికారులు జరిగిన పనులపై చదివి వినిపించారు కొంతమంది అధికారులు గైర్ హాజరుపై సంజాయిషీ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవో కే వాణి అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు సర్పంచులు ఎంపీటీసీలు కార్యదర్శులు పాల్గొన్నారు.



**శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో**
**ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు**



మొగల్తూరు ఏప్రిల్ 4 (ప్రభాతవార్త) మండల కేంద్రమైన మొగల్తూరు ముత్యాలపల్లి గ్రామ పంచాయతీ శివారు వారతిప్ప వంతెన వద్ద వెలసి ఉన్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో ప్రథమ సంవత్సరం మహోత్సవ వేడుకలు శుక్రవారం ఆలయ నిర్మాత నాగిడి శ్రీరాములు-లీలావతి దంపతుల మరియు గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి అభిషేకములు ప్రత్యేక పూజలు సామూహిక కుంకుమ పూజలు గణపతి హెూమం ఆలయంలో అత్యంత వైభవంగా జరిగాయి అనంతరం అన్న సమారాధన నిర్వహించారు

## గ్రామ అభివృదే లక్ష్యం. సర్పంచ్ తుక్కయ్య

కొయ్యలగూడెం ప్రభాతవార్త ఏప్రిల్ 4 :రాజవరం గ్రామపంచాయతీ పాలకవర్గం ఏర్పడి తరువాత గ్రామాన్ని అన్ని రంగాలలో రోడ్లు, భవనాలు ,డ్రైనేజీ ,వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశామని తుక్కయ తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుని 5వ సంవత్సరంలోనికి అడుగుపెడుతున్న సందర్భంలో కేక్ కటింగ్ చేశారు. సర్పంచ్ చిన్న తుక్కయ్య , మాట్లాడుతూ ది.17-2-2021 తేదీన జరిగిన ఎన్నికల్లో రాజవరం గ్రామపంచాయతీ సర్పంచ్ గా నా విజయానికి కృషి చేసిన నాయకులకు, గ్రామ ప్రజలకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసినారు. ఈ నాలుగు సంవత్సరాలు కాలంలో నాతో పాటు పాలకవర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శులు, సచివాల ఉద్యోగస్తులు, గ్రామంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులు నాకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికి అభినందనలుతెలిపారు ఈ సంవత్సరంలో కూడా పూర్తి సహకారం అందించాలని కోరారు. గ్రామంలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులను సన్మానించి, నూతన వస్త్రము పంపిణీ చేశారు.



## వక్ఫ్ సవరణ బిల్లు బిజెపి హిందుత్వ ఎజెండాలో భాగమే, సిపిఎం

పెనుగొండ, ఏప్రిల్-04, ప్రభాతవార్త :వక్ఫ్ సవరణలను బీజేపీ యొక్క హిందుత్వ ఎజెండాలో భాగమే అని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు . శుక్రవారం పెనుగొండ జామియా మసీదు వద్ద జరిగిన నిరసనల్లో ఆయన మాట్లాడుతూ ఈ సవరణలను మైనారిటీల మత స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ (ఆర్టికల్ 25) కింద ముస్లింలు తమ ఆస్తులను వక్ఫ్ బోర్డుల ద్వారా నిర్వహించుకునే హక్కును ఈ సవరణలు కాలరాస్తాయని విమర్శించారు. వక్ఫ్ బోర్డు అధికారాలను తగ్గించడం, కలెక్టర్లకు ఆస్తులపై నిర్ణయాధికారం ఇవ్వడం మైనారిటీల ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది అన్నారు. దేశవ్యాప్తంగా 9.4 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వక్ఫ్ ఆస్తులు ప్రమాదంలో పడతాయని అనుమానం వ్యక్తం చేశారు. సిద్ధాంతం గ్రామ మసీదు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పెనుగొండ మండల సిపిఎం పార్టీ కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుల స్వయం ప్రతిపత్తి తగ్గడం ద్వారా వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతర సభ్యులను చేర్చడం, ఆస్తి గుర్తింపులో ప్రభుత్వ జోక్యం పెరగడం వల్ల ఈ సంస్థల స్వతంత్రత దెబ్బతింటుందని అన్నారు. ఇది మోడీ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల అణచివేతకు దారి తీస్తుందని విమర్శించారు. ఈ బిల్లును రాజ్యాంగ విరుద్ధమైనదిగా, మైనారిటీ హక్కులను హరించేదిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ జామియా మసీద్ అధ్యక్షులు షేక్ నాగూర్ మీరా, కార్యదర్శి రెడీమేడ్ భాషా, షేక్ సుజాయుద్దీన్, షాకీర్ బాయ్, ఎస్కే షరీఫ్, సిద్ధాంతం గ్రామ మసీదు అధ్యక్షుడు షేక్ అమిన్, ఎండి షాన్ వెష్, సిపిఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, కడలి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ సభ్యత్వ కార్డులను ఎమ్మెల్యే రోషన్ కుమార్ చేతుల మీదగా అందించారు

చింతలపూడి.. ప్రభాత వార్త :రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి చింతలపూడి నియోజకవర్గానికి వచ్చినటువంటి పార్టీ సభ్యత్వ కార్డులను బూత్ ఇంచార్జ్ లకు, మండల గ్రామ పార్టీ ఇంచార్జ్ లకు ఈ సభ్యత్వ కార్డులు శాసన సభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్ చేతుల మీదుగా అందించారు, ఈ కార్డు లను ప్రతీ గ్రామంలో సభ్యత్వం తీసుకున్న ప్రతీ సభ్యునికి కార్డు చేరే లాగా క్యాడర్ చొరవ చూపించాలని గౌరవ శాసన సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ ముత్తారెడ్డి మరియు పట్టణ, మండల, గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఆటో రిక్షాల డార్జిలింగ్ లైట్ల తొలగింపు

**ఏలూరు టౌన్, ఏప్రిల్ 04,ప్రభాత వార్త :** ఏలూరు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ ఆదేశాల మేరకు వాహన తనిఖీ అధికారులు శుక్రవారం జంగారెడ్డిగూడెం రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించి 48 కి పైగా ఆటో రిక్షాలకు అమర్చిన 63 డార్జిలింగ్ లైట్లను తొలగింపచేసి, తదనంతరం ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. గత నెల నుంచే వాహన తనిఖీ అధికారులు జిల్లా వ్యాప్తముగా తనిఖీలు నిర్వహించి ఆటో రిక్షాలకు మరియు ఇతర వాహనాలకు అదనంగా ఏర్పాటు చేసిన ఎల్.యి.డి. లైట్లను, లౌడ్ హారన్లను మరియు లౌడ్ స్పీకర్ల ను తొలగింపచేసి, కొన్ని వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు డిటిసి తెలిపారు. వాహనాలకు అదనంగా ఏర్పాటు చేసిన ఎల్.యి.డి. లైట్ల వలన ఎదురుగా వచ్చే వాహనచోదకులకు ఇబ్బంది కలుగుతుందని మరియు ఆటో రిక్షాల్లోని లౌడ్ స్పీకర్ల నుంచి వెలువడే అధిక ధ్వని ప్రయాణికులు అసౌకర్యానికి గురిచేస్తుందని డీటీసీ తెలిపారు. రహదారి భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ తనిఖీల్లో వాహన తనిఖీ అధికారులు పి.రమేష్ బాబు, ఎన్.నెహ్రూ, పి.నరేంద్ర బాబు, డి.ప్రజ్ఞ పాల్గొన్నారు.



## గ్రామ సచివాలయం ఎదుట ఉపాధి హామీ కూలీలు పారాతట్టలతో నిరసన

**మొగల్తూరు ఏప్రిల్ 4(ప్రభాతవార్త):** మండల కేంద్రమైన మొగల్తూరు పేరుపాలెం సౌత్ గ్రామంలో ఉపాధి హామీ కూలీల గ్రూపులను ఏర్పాటు చేసి గత మూడేళ్ళుగా పనిచేస్తున్న తనను కొంతమంది అధికార పార్టీ నాయకులు అక్రమంగా తొలగించిన పనులకు వెళ్లిన సమయంలో ఘోరంగా అవమానించారని శుక్రవారం పేరుపాలెం సౌత్ పంచాయతీకి చెందిన గుబ్బల మాధురి ఆరోపించారు తమ గ్రామంలో అర్హులైన వారికి ఉపాధి హామీ కార్డులు చేయించి వారితో పనులు చేయిస్తూ తాను జీవనం సాగిస్తున్నానని గ్రామంలో జనసేన పార్టీ నాయకులు తనకు ఎటువంటి సమాచారం లేకుండా మరొక వ్యక్తిని మేటుగా ఏర్పాటు చేసి పనుల వద్దకు వెళ్లిన తనపై మహిళలని కూడా చూడకుండా దౌర్జన్యానికి దిగారని ఆమె స్థానిక గ్రామ సచివాలయం ఎదుట ఉపాధి హామీ కూలీలతో కలిసి పార తట్టలతో నిరసన ప్రదర్శన చేశారు అధికారులు ప్రజాప్రతినిధులు తనకు న్యాయం చేయాలని తనను అక్రమంగా తొలగించిన స్థానిక జనసేన నాయకుల పై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు తమ పార్టీ కోసం కష్టపడిన వారికి మేటుగా ఏర్పాటు చేశామని జనసేన నాయకులు చెబుతున్నారు తాను ఈ రాజకీయ పార్టీకి సంబంధించిన వ్యక్తిని కాదని సామాన్య ఉపాధి హామీ కూలీగా మీటుగా పనిచేస్తున్నానని తనపై కక్ష సాధింపు సరికాదని ఆమె ఆవేదన చెందారు దీనిపై స్థానిక ఎంపీడీవో ఎమ్మెల్యేకు తాను ఫిర్యాదు చేశానని ఆ పని నువ్వే చూసుకుందువు అని చెప్పారని అయినప్పటికీ స్థానిక జనసేన పార్టీ నాయకులు దౌర్జన్యంగా వేరే ఆమెను మేటుగా పెట్టారని ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# 'చౌర్యపాఠం' నుంచి సాంగ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ లాంచ్ చేసిన ఇంద్రా రామ్, నిఖిల్ గొల్లమారి, త్రినాథరావు నక్కిన, నక్కిన నెరేటివ్ చౌర్య పాఠం ఒక్కసారిగా సాంగ్ బ్లాక్ బస్టర్ డైరెక్టర్ త్రినాథరావు నక్కిన తన అప్ కమింగ్ క్రైమ్‌కామెడీ డ్రామా చౌర్య పాఠంతో మూవీ ప్రొడక్షన్ అడుగుపెడుతున్నారు. యంగ్ ట్యాలెంటెడ్ ఇంద్రా రామ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. కార్తికేయ 2 మొదలైన చిత్రాలకు చందూ మొండేటి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన నిఖిల్ గొల్లమారి ఈ మూవీతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు. నక్కిన నెరేటివ్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీకి వి చూడమణి సహ నిర్మాత. ఈ చిత్రం టీజర్ థ్రిల్లింగ్ క్రైమ్, డార్క్ హ్యూమర్ బ్లెండ్ తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. నాగ చైతన్య లాంచ్ చేసిన ప్రమోషనల్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అలాగే ఆడ పిశాచం సాంగ్ వైరల్ అయ్యింది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ఈ సినిమా నుంచి ఒక్కసారిగా సాంగ్ లాంచ్ చేశారు. దావ్‌జాంద్ ఈ సాంగ్ లవ్లీ మెలోడీగా కంపోజ్ చేశారు. అనురాగ్ కులకర్ణి సాంగ్‌ని పాడిన విధానం మరింత ఆకట్టుకుంది. కృష్ణ కాంత్ రాసిన లిరిక్స్ బ్యూటీఫుల్‌గా వున్నాయి. ఈ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ ఆకట్టుకుంది. ఈ సాంగ్ ఇన్స్టంట్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటిస్తుండగా, రాజీవ్ కనకాల, మస్త్ అలీ ముఖ్యమైన కీలక పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రంలో మరో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ ఈ కథను సినిమాటోగ్రాఫర్ కార్తీక్ ఘట్టమనేని రాశారు. అతను కెమెరా వర్క్ కూడా నిర్వహిస్తున్నారు. దావ్‌జాంద్ మ్యూజిక్ అందిస్తు న్నారు. హనుమాన్ ఫేమ్ శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్. ఉతుర ఎడిటర్. సమ్మర్‌లో వన్ అఫ్ ది బిగ్గెస్ట్ అట్రాక్షన్‌గా చౌర్యపాఠం ఏప్రిల్ 18న థియేటర్లలోకి రాబోతోంది. తారాగణం: ఇంద్ర రామ్, పాయల్ రాధాకృష్ణ, రాజీవ్ కనకాల, మస్త్ అలీ, మాడి మానేపల్లి, అంజి వల్లుమాన్, ఎడ్వర్డ్ పెరేజీ, సుప్రియ ఐసోలా, క్రిష్ రాజ్, సహదేవ్, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: నిఖిల్ గొల్లమారి, నిర్మాత: నక్కిన త్రినాధరావు, బ్యానర్, నక్కిన నెరేటివ్, కథ అండ్ డీవోపీ: కార్తీక్ ఘట్టమనేని, ప్రొడక్షన్ డిజైన్: శ్రీ నాగేంద్ర తంగాల, సంగీతం: దావ్‌జాంద్ ఎడిటర్: ఉత్తర, సహ నిర్మాత: వి చూడామణి సాహిత్యం: బాస్కర బట్ల, కళ్యాణ చక్రవర్తి, రోల్ రైడా, కృష్ణకాంత్(కెకె), నిఖిల్ గొల్లమారి, కొరియోగ్రఫీ: విజయ్ బిన్ని, విజయ్ పోలాకి పీఆర్వో: వంశీ శేఖర్.



# 'హోం టౌన్' స్పెషల్ ప్రివ్యూ షో

ఆహా సబ్‌స్క్రైబర్స్ కోసం వస్తున్న మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ హోం టౌన్. మన ఇంటి చుట్టు అల్లు కున్న జ్ఞాపకాలు, బంధాల నేపథ్యంతో ఈ వెబ్ సిరీస్ రూపొందింది. రాజీవ్ కనకాల, ఝాన్సీ, ప్రజ్వల్ యాద్మ, సాయిరామ్, అనీ, అనిరుధ్, జ్యోతి కీలక పాత్రల్లో నటించిన ఈ వెబ్ సిరీస్ కు శ్రీకాంత్ రెడ్డి పల్లే దర్శకత్వం వహించారు. నవీన్ మేడారం, శేఖర్ మేడారం నిర్మించారు. ఈ నెల 4వ తేదీ నుంచి హోం టౌన్ వెబ్ సిరీస్ ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రాబోతోంది. మీడియా మిత్రులకు హోం టౌన్ వెబ్ సిరీస్ స్పెషల్ ప్రివ్యూ ప్రదర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నటుడు రాజీవ్ కనకాల మాట్లాడుతూ, హోం టౌన్ వెబ్ సిరీస్‌లో నటించే అవకాశం రావడం సంతోషంగా భావిస్తున్నా. ఈ సిరీస్‌ను బిగ్ స్క్రీన్ మీద మీతో పాటే నేనూ చూస్తున్నా. మిగతా ఎపిసోడ్స్ మరింత ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి. ఈ ప్రివ్యూ చూసిన వారిలో కొందరికి తమ సొంత ఊరు, మరికొందరికి తమ గత జ్ఞాపకాలు గుర్తుకు వచ్చి ఉంటాయి. ఈ సిరీస్‌లో పిల్లల అల్లరి చూస్తుంటే 35 ఏళ్ల వెనక్కి వెళ్లిన ఫీలింగ్ కలిగింది. నవీన్ మేడారం హోం టౌన్ వెబ్ సిరీస్‌కు బ్యాక్ బోన్‌గా ఉండి నడిపించారు. అలాగే మా డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి పల్లె అందరికీ కనెక్ట్ అయ్యేలా సిరీస్ రూపొందించారు. టెక్నికల్ సైడ్ మంచి క్వాలిటీ తో ఈ సిరీస్ తెరకెక్కింది. నాతో పాటు కలిసి నటించిన ఝాన్సీకి ఇతర టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా అన్నారు. నిర్మాత నవీన్ మేడారం మాట్లాడుతూ, 90ఎస్ ఎ మిడిల్ క్లాస్ బయోపిక్ తర్వాత మా సంస్థలో చేసిన వెబ్ సిరీస్ హోం టౌన్. 90ఎస్ ఎ మిడిల్ క్లాస్ బయోపిక్‌లో ఆ ముగ్గురు పిల్లలు ఓవర్ నైట్ స్టార్స్ ఎలా అయ్యారో ఖిహోం టౌన్ఖి సిరీస్ రిలీజ్ తర్వాత కూడా ఇక్కడున్న ఈ ముగ్గురు పిల్లలకు కూడా అలాంటి గుర్తింపు వస్తుంది. ఈ సిరీస్ ను చేసే అవకాశం ఇచ్చిన ఆహా ఓటీటీకి థ్యాంక్స్. హోం టౌన్ ప్రొడ్యూస్ చేయడంలో దేవ్ దీప్ గాంధీ కుందు సినిమాటోగ్రాఫీ, సురేష్ బొబ్బిలి మ్యూజిక్..ఇలా నా టెక్నికల్ టీమ్ అంతా ఎంతో సపోర్ట్ చేశారు. హోం టౌన్ మా ఎంఎన్ ఓపీ బ్యానర్‌కు మంచి పేరు తీసుకొస్తుందని ఆశిస్తున్నా అన్నారు. డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి పల్లే మాట్లాడుతూ మనలో చాలా మంది ఊరి నుంచి సిటీకి వచ్చిన వాళ్లమే. విదేశాలకు వెళ్లినా మనకంటూ ఓ స్పెషల్ ప్లేస్ ఉంటుంది. అదే మన సొంతూరు. సొంతూరుతో ముడపడిన జ్ఞాపకాలను మర్చిపోలేం. అలాంటి ఎమోషన్స్ అన్నీ హోం టౌన్ వెబ్ సిరీస్‌లో మిమ్మల్ని ఆకట్టుకుంటాయి. చివరి ఎపిసోడ్ మాత్రం మిస్ కావొద్దు. ఈ సిరీస్ చేసే అవకాశం ఇచ్చిన నా ప్రొడ్యూసర్ నవీన్‌కి, ఆహాకు థ్యాంక్స్ చెబుతున్నా. మొదటి రోజు నుంచే నన్ను రాజీవ్ కనకాల గారు సపోర్ట్ చేశారు. ప్రజ్వల్ నటుడిగానే కాదు రైటింగ్ సైడ్ కూడా అసిస్ట్ చేశాడు. ప్రతిఆర్టిస్ట్ తమ బెస్ట్ పర్ ఫార్మెన్స్ ఇచ్చారు. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ అన్నకు, మిగతా టీమ్ అందరికీ థ్యాంక్స్ అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ, హోం టౌన్ వెబ్ సిరీస్ ఈవెంట్‌కు వచ్చి మమ్మల్ని సపోర్ట్ చేస్తున్న అందరికీథ్యాంక్స్. ఈ సిరీస్‌కు వర్క్ చేయడం హ్యాపీగా అనిపించింది. డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డిని చూస్తే సందీప్ రెడ్డి వంగాలా అనిపించారు. చివరి ఎపిసోడ్‌లో ఎన్నో ట్విస్ట్స్ ఉంటాయి. మిస్ కాకుండా చూడండి అన్నారు. యాక్టర్ ప్రజ్వల్ యాద్మ మాట్లాడుతూ, హోం టౌన్ వెబ్ సిరీస్‌లో నటించే అవకాశం కల్పించిన నవీన్ మేడారంకి ఆహాకు థ్యాంక్స్. డైరెక్టర్ శ్రీకాంత్ నేను కొత్త యాక్టర్ అని చూడకుండా ఆడిషన్ చూసి అవకాశం ఇచ్చారు. ఆయనకు కృతజ్ఞతలు చెబుతున్నా. రాజీవ్ కనకాల మమ్మల్ని ఎంతో ఎంకరేజ్ చేశారు. మమ్మల్ని ఈ వెబ్ సిరీస్‌లో చూస్తే మన ఫ్రెండ్స్ బ్యాచ్‌లో ఉండే క్యారెక్టర్స్ అన్నీ మీకు గుర్తొస్తాయి. ఝాన్సీతో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. 90ఎస్ ఎ మిడిల్ క్లాస్ బయోపిక్‌కు వచ్చిన గుర్తింపు మాలాంటి కొత్త నటీనటుల్లో ఎంతో నమ్మకాన్ని తీసుకొచ్చింది. ఒక వెబ్ సిరీస్‌తో కూడా సినిమా కంటే ఎక్కువగా పేరు తెచ్చుకోవచ్చనే ఆశ కలిగించింది. ఆ సిరీస్ చేసిన సంస్థలో నాకు అవకాశం వచ్చింది, హోం టౌన్ సిరీస్ మా అందరికీ మంచి గుర్తింపు తెస్తుందని ఆశిస్తున్నాం అన్నారు.



# 'సింగిల్' ఫస్ట్ సాంగ్ రిలీజ్

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ అండ్ సింగిల్‌తో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. వేసవిలో విడుదల కానున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్ శిల్పి ఎవరో రిలీజ్ చేయడంతో మ్యూజిక్ ప్రమోషన్స్ ని స్టార్ట్ చేశారు. విశాల్ చంద్ర శేఖర్ సంగీత దర్శకుడిగా తన వెర్సటాలిటీని ప్రజెంట్ చేసే ఒక సోల్ ఫుల్ రొమాంటిక్ మెలోడీని కంపోజ్ చేశారు. శ్రీమణి రాసిన సాహిత్యం, హీరో శ్రీ విష్ణు తన జీవితంలోని ఇద్దరు స్పెషల్ అమ్మాయిలు కేతిక శర్మ, ఇవానా అందం పట్ల ప్రశంసలను కురిపిస్తూ పాట ఆకర్షణను పెంచుతుంది. యాజిన్ నిజార్ సోల్ ఫుల్ వోకల్స్ తో సాంగ్‌ని అద్భుతంగా అలపించారు. బ్యూటీఫుల్ విజువల్స్‌తో కూడిన ఈ సాంగ్‌లో శ్రీ విష్ణు క్యారెక్టర్ చార్మ్ అద్భుతంగా వుంది. శిల్పి ఎవరో యువతకు ఇన్స్టంట్‌గా కనెక్ట్ అవుతోంది. మోడరన్ వైబ్, థీమ్ యూత్‌ని మెస్మరైజ్ చేశాలా వున్నాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ఆర్ వేల్ రాజ్, ఎడిటింగ్ ప్రవీణ్ కెఎల్. ఆర్ట్ డైరెక్టర్ చంద్రిక గొర్రెపాటి. సింగిల్ మూవీ మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. నటీనటులు: శ్రీవిష్ణు, కేతిక శర్మ,ఇవానా, వెన్నెల కిషోర్ తదితరులు సాంకేతిక సిబ్బంది: సమర్పణ: అల్లు అరవింద్, రచన, దర్శకత్వం: కార్తీక్ రాజు, నిర్మాతలు: విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి, బ్యానర్లు:గీతాఆర్ట్స్, కళ్యాఫిల్మ్స్.



# 18న 'అర్జున్ S/O వైజయంతి'

నందమూరి కళ్యాణ్ రామ్ హైలీ యాంటిసిపేటెడ్ యాక్షన్‌ప్యాక్డ్ ఫ్యామిలీ డ్రామా అర్జున్ S/O వైజయంతి. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈ సినిమా టీజర్‌కు ఇప్పటికే ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ నాయల్ది చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. మూవీ టీం దూకుడుగా ప్రమోషన్లు చేస్తోంది. ఈ సినిమాలో కళ్యాణ్ రామ్ తల్లిగా విజయశాంతి కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటించారు. ఈ సినిమా ఏప్రిల్ 18న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సినిమాకి రాబోయే వేసవి సెలవుల అడ్వాంటేజ్ కానున్నాయి. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించ బోతోంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో కళ్యాణ్ రామ్ ను ఇంతకు ముందెన్నడూ చూడని మాస్, యాక్షన్ అవతార్‌లో కనిపిస్తున్నారు. తన ఇంటెన్స్ ప్రజెన్స్ సినిమాలోని క్యారెక్టర్ పవర్ ఫుల్ వ్యక్తిత్వాన్ని ప్రజెంట్ చేస్తోంది. ఈ మూవీ వండర్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందిస్తుందని హామీ ఇస్తుంది, కళ్యాణ్ రామ్ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తారు. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి బి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం, రామ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ తమ్మిరాజు, స్క్రీన్‌ప్లే శ్రీకాంత్ విస్సా. రిలీజ్ డేట్‌ని లాక్ చేయడంతో మేకర్స్ ప్రమోషనల్ యాక్టివిటీస్‌ని మరింత ముమ్మరం చేయనున్నారు. నటీనటులు: నందమూరి కళ్యాణ్ రామ్, విజయశాంతి, సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి, నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, డిఓపి: రామ్ ప్రసాద్, బ్యానర్లు: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్, ఎడిటర్: తమ్మిరాజు, సమర్పణ: ముప్పా వెంకయ్య చౌదరి, స్క్రీన్ ప్లే: శ్రీకాంత్ విస్సా, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, యాక్షన్: రామకృష్ణ, పీటర్ హెయిన్ పీఆర్వో: వంశీశేఖర్, వంశీ కాకా మార్కెటింగ్: ఫస్ట్ షో.



# 'విశ్వంభర'తో ప్రవీణ్ కల నెరవేరింది

తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ తరం నటులు, దర్శకులు, టెక్నీషియన్స్‌లో చాలా శాతం మంది అభిమాన హీరో మెగాస్టార్ చిరంజీవి అనటంలో అతిశయొక్తి లేదు. దిల్ రాజు నిర్మించిన కొత్తబంగారు లోకం చిత్రం నుండి కొత్త టాలెంట్ ఆర్టిస్ట్‌గా ప్రవీణ్ తన నట జీవితాన్ని మెదలుపెట్టారు. ఆచిత్రం తరువాత చాలా చిత్రాల్లో గొదారి స్లాంగ్‌తో కామెడి చేసి తెలుగు ప్రేక్షకుల్ని అలరించాడు. దర్శకుడు మారుతి దర్శకత్వంలో ప్రేమ కథా చిత్రమ్‌లో మరొక్క సారి ప్రేక్షకుల్ని తన నటనతో తన టైమింగ్ కామెడిలో నవ్వించాడు. అంతే కాదు దాదాపు ప్రతి చిత్రం విభిన్న పాత్రలు చేసి ప్రేక్షకుల్ని మెప్పించాడు. ప్రవీణ్ స్వతహాగా మెగాస్టార్ అభిమాని, కాని మెగాస్టార్‌తో ఖైదీ నెంబర్150, వాల్తేరు వీరయ్య లో నటించిన ఆశించినంత స్కీన్ స్పేస్ రాలేదు. ఎవరు ఊహించని విధంగా విశ్వంభర చిత్రంలో దాదాపు మెగాస్టార్‌తో ఎక్కువ స్కీన్ స్పేస్ పంచుకుని అవకాశం దక్కింది. దానికి ప్రవీణ్ ఆనందానికి అవధులు లేవు. అంతేకాదు మెగాస్టార్‌తో తన అభిమాన ముచ్చట్లు షాట్ గ్యాప్‌లో పంచుకున్నాడని ఆయనతో యాక్ట్ చేయడం అంటే అది తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపాడు. కేవలం నటించే అవకాశమే కాదు ఆయనతో కామెడి చేసే ఛాన్స్ వచ్చిందని రేపు థియేటర్స్ ఆ కామెడీ చూసి ప్రేక్షకులు నవ్వుకుంటారని తెలిపాడు.



# 25న 'సోదరా' విడుదల

క్యాన్స్ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సంపూర్ణేష్ బాబు,సంజోష్ హీరోలుగా, బాబు మోహన్, ప్రాచీ బంసాల్, ఆర్తి గుప్తా ప్రధాన పాత్రలో మోహన్ మేనం పల్లి దర్శకత్వంలో చంద్ర చాగండ్ల నిర్మిస్తున్న అన్నదమ్ముల అనుబంధ కుటుంబ కథ చిత్రం "సోదరా". ఈ చిత్రం అని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతుంది. కాగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మని సంపూర్ణేష్ బాబు, సంజోష్, దర్శకుడు మోహన్ మేనం పల్లి, ఇతర సోదర టీమ్ సభ్యులు ఇటీవల గౌరవ ప్రదంగా కలిశారు. వారిని కలిసి సోదరా చిత్ర విశేషాలు తెలియజేసి "ఏప్రిల్ 25న మా సోదరా చిత్రం విడుదల అవుతుంది, మా చిత్రాన్ని తప్పక చూడాలి" అని విన్నపించుకున్నారు యూనిట్ సభ్యులు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చిత్ర కథ విన్నీ "ఇలాంటి పల్లెటూరి కుటుంబ కథలు, అన్న దమ్ముల విలువలుఖచ్చితంగా తెలుగు ప్రేక్షకులకి అందించాలి, ఇలాంటి చిత్రాలు మంచి విజయం సాధించాలి అని కొనియాడారు. ఆయన సోదరా చిత్రాన్ని తప్పక చూస్తాను" అని భరోసా ఇచ్చారు. సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీబంసాల్, ఆర్తి గుప్తా, బాబా భాస్కర్, బాబు మోహన్, గెటప్ శీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, దర్శకత్వం: మోహన్ మేనంపల్లి, నిర్మాణ సంస్థ: క్యాన్స్ ఎంటర్టైన్మెంట్స్, ప్రొడ్యూసర్: చంద్ర చాగండ్ల సంగీతం: సునీల్ కశ్యప్ డిఓపి: జాన్, ఎడిటర్: శివశర్వాణి లిరిక్స్: సుద్దాల అశోక్ తేజ మరియు పూర్ణ చారి పి ఆర్ ఓ: ఏలూరు శ్రీను, మడూరి మధు.





యుక్తి తరేజా న్యూ లుక్

# ఎఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ 'లెవెన్'

తెలుగు, తమిళ సినిమాల్లో ప్రేక్షకాదరణ పొందిన ట్యాలెంటెడ్ యాక్టర్ నవీన్ చంద్ర అప్ కమింగ్ బైలింగ్వల్ థ్రిల్లర్ లెవెల్‌లో లీడ్ రోల్‌లో నటించారు. గతంలో సుందర్ సి వద్ద కలకలప్పు 2, వంద రాజవతాన్ వరువేన్, యాక్షన్ వంటి చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మంచి సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది. ఎఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించిన లెవెన్, విమర్శకుల ప్రశంసలు పొందిన సిలా నేరంగలిల్ సిలా మణిధర్గల్, సెంబి చిత్రాల విజయం తర్వాత వారి మూడవ వెంచర్. అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ వేసవిలో మే 16న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. రిలీజ్ డేట్ పోస్టర్ ఒక ఇంటెన్స్ కథనాన్ని ప్రజెంట్ చేస్తోంది. నవీన్ చంద్ర, శశాంక్, ఆడుకలం నరేన్ పోలీసులుగా, ముసుగు ధరించిన వ్యక్తిగా ఇంటెన్స్ ఎక్స్ ప్రెషన్ చాలా క్యూరియాసిటీని పెంచుతోంది. సిలా నేరంగలిల్ సిలా మణిధర్గల్‌లో నటించిన రేయా హరి, ఎలెవెన్‌లో కథానాయికగా నటించింది. ఈ చిత్రంలో అభిరామి, రవివర్మ, కిరీటి దామరాజు వంటి ప్రతిభావంతులైన తారాగణం కీలక పాత్రల్లో నటించించారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు డి. ఇమ్మాన్ సంగీతం అందించగా, కార్తీక్ అశోకన్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకాంత్ ఎన్.బి. ఎడిటర్‌గా వ్యవహారించడం, ఈ చిత్రం సాంకేతిక నైపుణ్యాన్ని మరింత పెంచుతుంది. ఈ చిత్రం వచ్చే నెలలో విడుదల కానున్నందున, నిర్మాతలు ప్రమోషన్స్ దూకుడు పెంచబోతున్నారు.



# 'ఒక బృందావనం' నుంచి లిరికల్ సాంగ్

ఈ మధ్య కాలంలో హృదయానికి హత్తుకునే సాహిత్యంతో.. మనసును తాకే స్వరాలతో.. మైమరిపించే నేపథ్య గానంతో వచ్చే పాటలు చాలా అరుదుగా ఉంటున్నాయి. సరిగ్గా ఇలాంటి ఓ బ్యూటిఫుల్ అండ్ హార్ట్‌టచ్చింగ్ సాంగ్ ఒకటి ఒక బృందావనం నుంచి విడుదలైంది. పసి పసి తనమే... ఎలా.. పరుగులు తీసే ఏరులా అని కొనసాగే ఈ పాటకు ప్రముఖ గీత రచయిత ఆస్కార్ అవార్డ్ విన్నర్ చంద్రబోస్ సాహిత్యాన్ని అందించారు. చిన్మయ శ్రీపాద ఆలపించిన ఈ పాటకు సన్ని అండ్ సాకేత్ స్వరాలను అందించారు. నూతన నటీనటులు బాలు, షిన్నోవాలతో పాటు శుభలేక శుధాకర్, అన్నపూర్ణమ్మ, శివాజీ రాజా, రూప లక్ష్మి, సాన్విత, కళ్యాణి రాజు, మహేంద్ర, డి.డి. శ్రీనివాస్ మరియు ఇతర సీనియర్ నటీనటులు ఈ చిత్రంలో నటించారు! బొత్స సత్య దర్శకత్వంలో కిషోర్ తాటికొండ, వెంకట్ రేగట్టే, ప్రహ్లాద్ బొమ్మినేని, మనోజ్ ఇందుపూరు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న చిత్రమిది. తాజాగా విడుదల చేసిన ఈ పాట అందరి హృదయాలకు హత్తుకుంటుంది. ఎంతో హాయిగా కొనసాగే ఈ పాట థియేటర్‌లో ప్రేక్షకులకు కూడా మంచి అనుభూతి నిస్తుంది. ఈ చిత్రంలో వినోదంతో పాటు మంచి అర్థవంతమైన సందేశాన్ని కూడా ఈ చిత్రంలో జోడించాం. నిర్మాణానంతర పనులు జరుపుకుంటోన్న మా చిత్రం ఆడియోను ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే ట్రైలర్‌ను తీసుకువస్తాం. తప్పకుండా కొత్తదనం కోరుకునే ఆడియన్స్‌కు మా చిత్రం తప్పకుండా నచ్చుతుంది అన్నారు. సినిమాటోగ్రాఫర్ రాజ్ కె నల్లి, ఎడిటర్లు తమ్మిరాజు మరియు సంతోష్ కామిరెడ్డి ప్రతి ఫ్రేమ్‌ను మెరుగుపరిచారు మరియు సంగీత దర్శకులు సన్నీ మరియు సాకేత్ ఆహ్లాదకరమైన సౌండ్‌ట్రాక్‌ను అందించారు. చంద్రబోస్, రామజోగై శాస్త్రి, శ్యామ్ కాసర్ల, శ్రీనివాస మౌళి, కళ్యాణ్ చక్రవర్తి రాసిన సాహిత్యంతో, ఈ పాటలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయి.



# పచ్చదనంలోనే ఆనందం

చాలామంది ఇప్పుడిప్పుడే సస్టెనబిలిటీ వైపు మొగ్గు చూపుతున్నారు. కానీ ఆయు త్రిపాఠి చిన్నప్పట్నుంచే దాన్ని వింటూ పెరిగారు. ఆచరణలోనూ పెట్టారు. మరి ఆయు త్రిపాఠి గురించి తెలుసుకుందాం. ముందుముందు స్వచ్ఛమైన గాలి కొనుక్కోవాల్సి ఉంటుంది. నీళ్లు కూడా



ఖరీదవుతాయి, అంటూ గతాన్ని, భవిష్యత్‌ను పోల్చుతూ చెప్పేవారు త్రిపాఠి తాతయ్య. ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు. అంతేకాక ప్రకృతి ప్రేమికుడు. దాంతో ఆయన ఏది చెప్పిన మంచికే చెబుతారని ఆమె నమ్మకం. అందుకే చెప్పినవి పాటించేది. చిన్నప్పటి నుంచి మొక్కలు పెంచడం, నీటిని పొదుపుగా వాడటం. సేంద్రియ ఎరువు తయారీ వంటివి చేసేది. త్రిపాఠి తాను చేయడమే కాక తన తోటి పిల్లలకు తాను ఏం చేసింది, ఎలా చేసింది వివరించేది. త్రిపాఠి వాళ్లది ఉత్తరాఖండ్‌లోని నైనితాల్. నాన్న వ్యాపారి. ఆయన కూడా తండ్రి బాటలోనే నడిచారు. ఎప్పుడూ వారి చుట్టుపక్కల ప్రజలు, వారి బాగోగులు, వారికి ఉపాధి వంటి విషయాలే ఆలోచించేవారు. అందుకే జిమ్ కార్బెట్ ప్రాంతంలో 13.5 ఎకరాల భూమిని కొన్నారు. అక్కడ ఒక రిసార్టు కట్టాలన్నది ఆయన ఆలోచన. అక్కడి వారికి ఉపాధి దొరికితే వలసలు వెళ్లరని అనేవారు. అయితే ఏం చేసినా పర్యావరణ హితంగా ఉండాలని కోరుకునేవారు. తండ్రి కొన్నది బీడు భూమి. అక్కడ చెట్లు పెంచి చిన్న అడవి సృష్టించాలనుకున్నారు. చుట్టుపక్కలంతా గడ్డి కూడా పెరగని ఈ ప్రాంతంలో మొక్కలా అంటూ అంతా నవ్వారు. ఆ ప్రాజెక్టుకు త్రిపాఠి చెల్లి అహానా అని పేరు పెట్టుకున్నారు. అలా మొదలైన ప్రాజెక్టులో 80 శాతం మొక్కలకూ, 20 భవన నిర్మాణానికి కేటాయించారు. రెండేళ్లు నిర్విరామంగా శ్రమించారు. స్కూల్ అవగానే రిసార్టుకు వెళ్లి అక్కచెల్లెల్లు నాన్నకు సాయం చేసేవారు. శ్రమకు ప్రతిఫలం లభించింది. అహానా రిసార్టు ప్రకృతి వనాన్ని తలపించింది. ప్రస్తుతం ఇక్కడ దాదాపు 4,500 వృక్షాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు ఔషధ మొక్కలే ఎక్కువ. 200 రకాల పక్షులు విడిదిగా వచ్చేవి. చదువు పూర్తయ్యాక రిసార్టు బాధ్యత తీసుకున్న త్రిపాఠి పట్టణాల నుండి వచ్చినవారంతా చెట్లను, మొక్కలను చూసి ప్రశంసిస్తుంటే ఎంతో ఆనందించేది.

## ఆధ్యాత్మికం

# కఠోపనిషత్తు

కఠోపనిషత్తు – శాశ్వత ఆనందం పరీక్షల్లో ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణులవుతాం, సంతోషం కలుగుతుంది. ఉద్యోగం వస్తుంది. వివాహమవుతుంది. సంతానం కలుగుతుంది. మంచి ఇల్లు కొంటాం. అయితే ఇన్ని రకాలుగా కలిగే ఈ సంతోషం కేవలం తాత్కాలికమే, కొద్ది క్షణాలు మాత్రమే ఉంటుంది. ఇది మన అందరికీ అనుభవపూర్వకంగా తెలిసిన విషయమే. మరి శాశ్వత ఆనందం, నిరాటంకమైన ఆనందం లేదా? అది ఎవరికి, ఎప్పుడు కలుగుతుంది? సమాధానం కఠోపనిషత్తులో కనబడుతుంది.

**ఏకోవశీ సర్వభూతాంతరాత్మా**
**ఎకం రూపం**
**బహుధాయః కరోతి**
**తమాత్మస్థం యేను**
**పశ్యంతి ధీరా**
**స్తేషాం సుఖం శాశ్వతం**
**నేతరేషామ్**



ఇది కఠో పనిషత్తులోని పంచమవల్లి 12వ శ్లోకం. భావం: ఆ ఒక్క జగన్నియామకుని సకల జీవుల అంతరాత్మను తన ఒక్క రూపాన్నే అనేక విధాలుగా కల్పించే దానిని, తమ ఆత్మ యందే ఉన్నదని దర్శించే ప్రాజ్ఞులదే శాశ్వతమైన ఆనందం, ఇతరులది కాదు. (పుట 92 – కఠ ఉపనిషత్తు – శ్రీరామకృష్ణమఠం, మద్రాసు). పూజలు, పునస్కారాలు, హారతులు, అర్చనలు, యజ్ఞాలు, యాగాలు, దానాలు, ధర్మాలు చేసినా పుణ్యం రావచ్చు.

మనం స్వర్గానికి వెళ్లవచ్చు. అయితే స్వర్గసుఖాలు కూడా తాత్కాలికమే. క్షీణపుణ్యేమర్త్యలోకం విశంతి – పుణ్యంక్షీణిస్తానే మళ్లీ ఈ లోకంలోకి వచ్చి పడతాం. కష్టాల పాలవుతాం.

శాశ్వత ఆనందాన్ని పొందాలంటే మాత్రం సర్వభూతాంతరాత్మలలో ఉన్న ఆ పరమాత్మ మన ఆత్మయేయని గ్రహించి జీవించాలి. అంతర్ముఖులమైతేనే అలా గ్రహించగలం.

**- రాచమడుగు శ్రీనివాసులు**

## మొక్కజొన్నలో పోషకాలెన్నో..

మొక్కజొన్న చౌకగా లభించే పోషకాహారం. ఇది తక్షణ శక్తిని అందిస్తుంది. మొక్కజొన్న పొత్తులను బొగ్గుల మీద కాల్చినా, నీళ్లలో ఉడికించినా అవి అందించే ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో! సీజన్‌లో లభించే మొక్కజొన్న గింజలు తినడం వలన శరీరానికి లినోలిక్ యాసిడ్, ఫోలిక్ యాసిడ్‌తో పాటు, ఎ,ఇ, బీ1, బీ6. రైబోఫ్లవిన్, థయమిన్ అనే విటమిన్లు అందుతాయి. మధుమేహం నియంత్రణలో ఉంటుంది. రక్తహీన తగ్గి ఎర్ర రక్తకణాలు వృద్ధి చెందుతాయి. కంటిచూపు మెరగవుతుంది. మొక్కజొన్నలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మం మీద ముడతలు రాకుండా చేస్తాయి. ఈ గింజల నుంచి తీసిన నూనె చర్మవ్యాధులకు ఔషధంలా పని చేస్తుంది. మొక్కజొన్న గింజల నుంచి తయారు చేసే పాప్‌కార్న్, కార్న్ ఫ్లేక్స్ పిల్లలలే కాదు పెద్దలూ ఇష్టంగా తింటారు.

## ఆరోగ్య భాగ్యం

# పెరి ఆనల్ ట్యూబర్ క్యులోసిస్ - ఆసన క్షయ

ఆసనం చుట్టు ఉండే ప్రాంతాన్ని పేరిఆనల్ రీజన్ అంటారు.

క్షయవ్యాధి పెరిఆనల్ రీజన్‌లో రావడం వల్ల దీన్ని పెరిఆనల్ ట్యూబర్ క్యులోసిస్ లేదా ఆనోరెక్టల్ ట్యూబర్ క్యులోసిస్ అని అంటారు. ఇది అరుదుగా 1% మందిలో కన్పించే క్షయవ్యాధి అని చెప్పవచ్చు. ఇది సెకండరీ పల్మోనరీ టివి వల్ల వస్తుంది. ఇది స్త్రీలలో కన్నా పురుషుల్లోనే ఎక్కువగా (4:11) కన్పిస్తుంది. ముఖ్యంగా 5-65 సంవత్సరాల మధ్య వారిలో కన్పిస్తుంది. ఇంతకు ముందు ఆక్టివ్ పల్మోనరీ ఇన్ఫెక్షన్ లేకపోయినా ఇది వచ్చే అవకాశముంది. ఇది ఇన్ఫెక్షవాస్ గ్రాన్యులోమాటస్ డిసీజ్, ట్యూబర్ క్యులార్ భాగంలో వాపు నొప్పితో గట్టిగా ఉన్న నోడ్యుల్ ఏర్పడి తర్వాత అబ్సెస్, కేషియోషన్, సైనస్, ఫిస్టులా ఏర్పడుతుంది.ఇది టి.బి. ఎక్కువగా ఉండే ఎండమిక్ ఏరియాలో వస్తుంది.

ఆసన క్షయ ఏర్పడే ప్రాంతాన్ని బట్టి ఆనల్ ట్యూబర్ క్యులోసిస్, పెరిఆనల్ ట్యూబర్ క్యులోసిస్ అని, ఆంటిరియర్/ పోస్టిరియర్ ఆనల్ ట్యూబర్ క్యులోసిస్ అని, సింగిల్ లేదా మల్టీఫుల్ పిస్టులా అని గుర్తించవచ్చు.

దీన్ని 1970లో మొదట గుర్తించమైనది. ఇంతవరకు ప్రపంచ వ్యాప్తంగా 58-60 కేసుల్ని గుర్తించడమైనది.

ఇది శరీరంలో ఎక్కడైనా టిబి ఉన్నా (ఉదర క్షయ జనేంద్రియా క్షయ) రావచ్చు.

బాసిల్లై ఉన్న స్రావాల్ని (కఫం,మ్యూకస్) బైటికి ఉమ్మివేయకుండా మ్రింగి వేయడం వల్ల వస్తుంది. సెల్ఫ్ ఇనీక్యులేషన్ వల్ల, డైరక్ట్‌గా,రక్తం, లింఫాటిక్స్ ద్వారా రోగ గ్రస్తులతో సన్నిహితంగా ఉండడం వల్ల వ్యాప్తిస్తుంది.

ఆసన చీము మలద్వారం చుట్టు ప్రక్కల ఉన్న కణజాలంతో బాక్టీరియా సంక్రమణ వల్ల కలిగే బాధాకరమైన చీముతో కూడిన గాయమే ఆసన క్షయ అని చెప్పవచ్చు. చూడటానికి ఆసనం దగ్గర రంధ్రం ఏర్పడుతంది. ఇది లోపలి నుంచి బైటికి, బైటి నుంచి లోపలికి 3 %-10 సెం.మీ. ద్వారంగా ఉంటుంది. కొన్ని సార్లు బైట రంధ్రం మూసుకొని ఉంటుంది. దీన్ని బట్టి క్లోజ్డ్ టైప్ లేదా ఓపెన్ టైప్ అని అంటారు. ఇది చికిత్స తీసుకున్నా తగ్గక తరుచుగా వస్తుంటే దాన్ని రికరెంట్‌టైప్ అని అంటారు. ఇది శరీరంలో మూడు విధాలుగా ఏర్పడే అవకాశం ఉంది.

1. హేమరాయిడ్‌లో నోడ్యుల్స్
2. పెరిఆనల్ అబ్సెస్.
3. ఆనల్ ఫిస్టులా (80-90%)

ఇది ఏర్పడే విధానాన్ని బట్టి 3 రకాలుగా ఏర్పడతాయి.

1. అల్సరేటివ్ టైప్: ఇది సర్వసాధారణంగా వచ్చే రకం. బాహ్యంగా కన్పించే అల్సర్స్‌తో అంచులు క్లియర్‌గా ఉంటాయి. ఇది నాన్ హీలింగ్ టైప్. ఇది ఊపిరితిత్తులు, ప్రేవుల్లో ట్యూబర్ క్యులార్ బాసిల్లై ఉన్నప్పుడు వస్తుంది.
2. వెర్యుకస్ టైప్ : ఇది పెరిఆనల్ రీజన్ నుంచి ఆనల్ రీజన్‌కి వ్యాపిస్తుంది. ఇది చూడటానికి పులిపిరిలాగా ఉంటుంది.
3. ల్యూపాయిడ్ టైప్ : ఇది శరీరంలో టి.బి. ఇన్ఫెక్షన్ ఎక్కడున్నా సెకండరీ ట్యూబర్ క్యులోసిస్ వల్ల వస్తుంది. మొదట చిన్నగా గుండ్రంగా ఉండే ఎర్రటి, మెత్తటి నోడ్యుల్ (కాయలాంటి ) ఏర్పడుతుంది. ఈ నోడ్యుల్ మధ్యభాగంలో అల్సర్ ఏర్పడుతుంది.

కారణాలు : (కోన్స్ డిసీజ్, హైడ్రా డెనిటస్, అన్నకోశం యొక్క ఆసన ఫిస్టులా, డైవర్టిక్యులైటిస్, కార్టికోస్టీరాయిడ్స్, ఆంటిబయాటిక్స్ వాడకం, రేడియేషన్ థిరపీ, పోర్టల్ హైపర్ టెన్షన్, ఇన్ఫెక్షువస్ మోనోన్యూక్లియోసిస్, సిరోసిస్, సైటో మెగలేవైరస్, ఆనల్ డిజార్డర్స్, (మొలలు, ఫిషర్, అల్సరేటివ్ కొలైటిస్, పాలిప్స్, ఎడినోమా వంటి ఇదర వ్యాధులు, పల్మానరీ ఇన్ఫెక్షన్ లేకపోయినా వచ్చే అవకాశముంది.

వ్యాధి లక్షణాలు : కూర్చున్నప్పుడు, కదులుతున్నప్పుడు, మలం విసర్జించేటప్పుడు విపరీతమైన నొప్పి రావడం, ఆసనం చుట్టు వాపు, ఎరుపు ఉండి చర్మంలో రంధ్రం వలె కన్పించవచ్చే. ఇవి బల్ మూవ్‌మెంట్స్ వల్ల ఎక్కువవుతాయి. తరుచూ విరేచనాలు కావడం నీరసం, అలసటగా ఉండడం, పొడి దగ్గు తరుచుగా రావడం ఉంటుంది. ఆసనం దగ్గర దురద, ఇరిటేషన్ ఉండడం. మలవిసర్జన ఉంటుంది.



**డాక్టర్ కె.ఉమాదేవి**
**తిరుపతి**

ఆసనం దగ్గర దురద, ఇరిరేటేషన్ ఉండడం. మలవిసర్జన బాధకరంగా ఉండడం, చలి జ్వరం, అధిక చెమటలు, ఆయాసం, బరువు తగ్గడం ఉంటుంది. సైనస్, ఫిస్టులా వెర్పడడం , దాని నుండి చీము, మ్యూకస్ కారడం ఉంటుంది. తరచు మలవిసర్జన చేయడం ఉంటుంది. చీము, మ్యూకస్ కారడం ఉంటుంది. తరచు మలవిసర్జర చేయడం ఉంటుంది.

కాంప్లికేషన్స్ : ఆనల్ స్టెనోసిస్, కాంప్లెక్స్ ఫిస్టులా , హేమరాయిడీల్ (తాంబోసిస్, రెక్టల్ సబ్ మ్యూకోసల్ ట్యూమర్, పెరిఆనల్ సెప్సిస్ ఆనల్ ఫిషర్, మలకేన్సర్, ఆనల్ స్ట్రిక్చర్, ఆనల్ అల్సరేషన్, ఇంగ్వెనల్ ఎడినోపతీ, అప్రయత్నంగా మ్యూకస్, రక్తంతో కూడిన మలవిసర్జన జరగడం ఉంటుంది. నడుం నొప్పివంటి అనేక కాంప్లికేషన్స్‌వెర్పడతాయి.

# దహీ బెండీ

**కావాల్సిన పదార్థాలు:**

బెండకాయలు (250గ్రాములు), పెద్ద టమోటాలు- రెండు, పెరుగు (ఒక కప్పు), ఉల్లిపాయలు ముక్కలు ఒక కప్పు, అల్లం వెల్లులి పేస్ట్ – ఒక స్పూను, శనగపిండి-మూడు స్పూన్లు, జీలకర్ర అరస్పూను, కాశ్మీరీ కారం – ఒక స్పూను, పసుపు- పావు స్పూను,గరం మసలా- ఒక స్పూను, క్రీమ్ – రెండు స్పూన్లు, నూనె – నాలుగు స్పూన్లు, నెయ్యి- ఒక స్పూను, మెంతి పొడి-పావు టీ స్పూను, ఉప్పు – తగినంత, నీళ్లు – తగినన్ని.



**తయారీ విధానం :**

. బెండకాయలను బాగా కడిగి తుడిచి, చిన్నముక్కలుగా తరగాలి. ఈ ముక్కలను ఒక మూడుడులో నూనెలో వేసి మూతబెట్టాలి. పది నిమిషాల తర్వాత ఈ ముక్కలు మెత్త పడతాయి. మూకుడులో నుంచి బయటకు తీసి చల్లార్చాలి.

. టమోటాలను చిన్న ముక్కలుగా చేయాలి. వీటిని, జీడిపప్పులను ఒక మిక్సి జార్‌లో వేసి ముద్దగా చేయాలి.

.పెరుగును ఒక గిన్నెలో వేసి ఒక స్పూనుతో బాగా తిప్పాలి.

. బెండకాయ ముక్కలు వేయించిన మూకుడులో నెయ్యి వేయాలి. ముందు జీలకర్రను దానిలో వేసి వేయించాలి. ఆ తర్వాత దానిలో ఉల్లిపాయ ముక్కలు వేయాలి. ఉల్లిపాయ ముక్కలు బాగా వేగిన తర్వాత దానిలో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయాలి. ఆ తర్వాత టమోటా, జీడిపప్పు ముద్దను వేసి వేయించాలి.

.ఈ మిశ్రమంలో మసాలా, శనగపిండి, ధనియాల పొడి, కారం, పసుపు వేయాలి,ఈ మిశ్రమాన్ని కొద్దిసేపు మగ్గనివ్వాలి. ఆ తర్వాత చల్లార్చిన బెండకాయ ముక్కలు వేయాలి.

. ఈ మిశ్రమం చల్లారిన తర్వాత దానిలో పెరుగు కలపాలి. అవసరమైతే కొన్ని నీళ్లు కూడా కలపుకోవచ్చు.ఈ మిశ్రమంలో ఉప్పు వేసిన తర్వాత మళ్లీ స్టౌమీద పెట్టి ఇంకొంత సేపు ఉడకనివ్వాలి.

.ఈ మిశ్రమంలో క్రీమ్, తరిగిన కొత్తిమీర వేయాలి. అంతే బెండకాయ పెరుగు కూర రెడీ..

బెండకాయలను ఎక్కువగా వేయించకూడదు. ఎక్కువగా వేగితే రుచి పోతుంది. కూర చల్లారాకే పెరుగు కలపాలి.

---

# జిపిఒ పోస్టులపై ప్రభుత్వం కసరత్తు

## పూర్వ విఆర్‌ఒ, విఆర్‌ఎల నుంచి మళ్లీ ఆప్షన్లు

**హైదరాబాద్,ఏపిల్ర్ 4 ,ప్రభాత వార్త :** గ్రామ పాలన అధికారుల నియమాకానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది, ఇందులో భాగంగా 10,954 పోస్టుల కోసం పూర్వ విఆర్వో, విఆర్‌ఏల నుంచి మళ్ళీ ఆప్షన్లు తీసుకుంటోంది.గూగుల్ ఫామ్స్ దరఖాస్తులు పూర్తి చేసి 16వ తేదీలోపు సమర్పించాలని సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ప్రకటన జారీ చేశారు. స్వయంగా సంతకం చేసిన కాపీని సంబంధిత కలెక్టర్ కార్యాలయాల్లో అందచేయాలని సూచించారు. పని స్వభావం, నియమ నిబంధనలతో పాటు పూర్తి సమాచారం వెబ్‌సైట్( హెచ్‌టిటిపిఎస్. ని ని ఎల్ ఎ. తెలంగాణ, జివోవి. ఇన్ )లో సభిస్తాయనామ్నరు.జిపివో పోస్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే పూర్వ విఆర్వో, విఆర్‌ఏల నుంచి ఆప్షన్లు తీసుకుంది. అయితే ఇప్పుడు మరో సారి గూగుల్ ఫామ్ నింపి సమర్పించాలన్న సూచనల నేపథ్యంలో వారి మధ్య చర్చ జరుగుతోంది. ఇప్పటికే ప్రభుత్వం జీవో నెం 129 జారీ చేయగా పాత సర్వీసులను పరిగణలోకి తీసుకోమని తేల్చి చెప్పింది. దాంతో ఆప్షన్లు ఇచ్చి పూర్వ విఆర్‌వోలు, విఆర్‌ఏలు ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. ఏదో శాఖలో పని చేస్తున్న నేపథ్యంలో సర్వీసు జీరో చేసుకుని రెవెన్యూ శాఖలోకి వెళ్ళడం ద్వారా వచ్చే ప్రతిఫలం ఏమి ఉంటుందని ఆలోచిసునతన్నారు. అనేక మంది విఆర్‌ఏలు కొంత కాలమే పర్మినెంట్ అయ్యారు. ఇందులో ఉన్నత విద్యావంతులు,ఏపిపిఎస్సి ,టిఎస్‌పిఎస్సి ద్వారా పరీక్ష రాసి విఆర్‌ఏలుగా డైరక్టు రిక్రూట్ అయిన వారు కూడా ఉన్నారు. అలాంటి వారు ఇప్పుడు తమ ఉద్యోగ అనుభవాన్ని కోల్పోయేందుకు సిద్ధంగా లేరని తెలిసింది. జిపివో పోస్టులకు ఇంటర్‌తో పాటు ఐదేండ్ల రెగ్యులర్ సర్వీసు కూడా ఉండాలని నిబంధన విధించారు. మరి ఐదేండ్ల సర్వీసును పరిగణలోకి తీసుకోక పోవడం ద్వారా ఎంత నష్టం వాటిల్లుతోందో అధికారులు ఆలోచించాలని కోరుతున్నారు. ఈ క్రమంలోనే జిపివో పోస్టులకు ఎంత మంది గూగుల్ ఫామ్ ద్వారా ఆప్షన్లు ఇస్తారో వేచి చూడాలి. జీవో,నియమాక ఉత్తర్వుల్లో గ్రామ పాలనాధికారులకు 9 రకాల విధులను డిజైన్ చేశారు.గతంలో విఆర్‌వో, విఆర్‌ఏలుగా ఉన్నప్పుడు నిర్వహించినవే కావడం గమనార్హం. ప్రభుత్వం రెండు నెలల క్రితమే పూర్వపు విఆర్‌వో, విఆర్‌ఏల నుంచి ఆప్షన్లు స్వీకరించింది. 33 జిల్లాల నుంచి 9654 మంది గూగుల్ ఫామ్‌ల ద్వారా ఆప్షన్‌ళ ఇచ్చారు. 5130 మంది విఆర్‌వోలలో 3534 మంది,16 వేల మంది విఆర్‌ఏలలో 5987 మంది రెవెన్యూలోకి వచ్చేందుకు సిద్ధం అయ్యారు. వారందరి వివరాలను సంబంధిత జిల్లా కలెకర్టు పరిశీలించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల గూగుల్ ఫారాలను పరిశీలించి అనుభవజ్ఞులను గుర్తించారు. అయితే రెవెన్యూ పని చేసేందుకు చూపలేదని తెలుస్తోంది. ఇతర శాఖల్లో వివిధ హోదాల్లో రీ ఎంప్లాయిమెంట్ అయిన వారు రెవెన్యూలో మళ్ళీ ఇబ్బందులు ఎదుర్కోవడం దేనికన్న అభిప్రాయంతో ఉన్నట్లు సమాచారం. మరి కొందరేమో రిటైర్మెంట్‌కు దగ్గర ఉన్న తాము ఇప్పుడు శాఖ మారడంతో ఎటువంటి సమస్యలు వస్తాయో అన్న అనుమానంతో ఉన్నారు. ఇప్పుడు సర్వీసు జీరో అనే సరికి గతంలో ఆప్షన్లు ఇచ్చిన వారు పునరాలోచనలో ఉన్నట్లు సమాచారం.

# ఇక 'తిరుమల విజన్-2047' పక్కాగా అమలు!

## - అన్యమతస్థ ఉద్యోగులను బయటకు పంపండి

## - యేళ్లతరబడి తిష్టవేసిన, తెల్లఏనుగులకు తక్షణం స్థానచలనం



**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలను "మోడల్‌టౌన్"గా తీర్చిదిద్దే ప్రక్రియను వేగవంతం చేసేదిశగా తిరుమలతిరుపతిదేవస్థానం అడుగులేయనుంది. ఏడుకొండలపై ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, పర్యావరణ నిర్వహణ, వారసత్వ పరిరక్షణపై దృష్టి సారించడమే దీని లక్ష్యంగా నిర్ధేశించారు. తిరుమలలోమరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దే పనులు మొదలుకానున్నాయి. రానున్న వార్షిక బ్రహ్మోత్సవాల సమయానికి ఈ ప్రణాళికలు ప్రారంభమయ్యే దిశగా టిటిడి అధికారులు కదలనున్నారు. మహిమాన్వితమైన కలియుగప్రత్యక్షదైవం,కులదైవం శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల అత్యంత విశ్వాసం, భక్తిశ్రద్ధలు ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఈ విషయాలపై బుధవారం అమరావతిలోని సచివాలయంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఇన్‌ఛార్జి సివిఎస్ఒ వి.హర్షవర్ధన్‌రాజు, జెఇఒ వీరబ్రహ్మం, ఎస్‌ఎసిఎ బాలాజీ ఇతర అధికారులతో సుధీర్ఘ సమీక్షలో కీలక నిర్ధేశం చేశారు.

ఇప్పటికే తిరుమలపై గోవిందనామ స్మరణ తప్ప మరొకటి వినిపించడానికి వీల్లేకుండా చేశారు. రాజకీయనాయకులు ,ప్రజాప్రతినిధులు తమ మొక్కులు తీర్చుకునేందుకు తిరుమలకు వస్తే ప్రత్యేక ప్రోటోకాల్,హంగు ఆర్భాటం ఉండకూడదని, ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయరాదని మార్పులు తీసుకువచ్చారు. తిరుమల ఆధ్యాత్మికం, పవిత్రత ,సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించి ముందు చూపుతో భక్తులకు సౌకర్యాలు ,వసతి,దర్శనాలను మెరుగుపరచాలని ముఖ్యమంత్రి టిటిడి అధికారులకు దిశానిర్దేశం కూడా చేయడం విశేషం. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై సిఎం స్పష్టమైన నిర్ధేశం చేశారు. వారిలో మరింతగా ఆనందం కనబడాలని స్పష్టం చేయడం సిఎం ఆశయాలకు దర్పణం, రానున్న రోజుల్లో ఇష్టదైవమ్ శ్రీవారిని సామాన్యభక్తులు వీలైనంత సులభంగా, త్వరగా దర్శనం చేసుకునేలా చూడాలనేది యాక్షన్‌ప్లాన్ . క్యూలైన్లలో సామాన్యభక్తులకు కనీస సౌకర్యాలు మెరుగుపరచి, క్యూలైన్లలో నిరంతరాయంగా నాణ్యతతో కూడిన అన్నప్రసాదాలు, పాలు, టీ, తాగునీరు అందిస్తున్నారు.

**- విజన్‌డాక్యుమెంట్ 2047 లక్ష్యాలు :**

ఆధునిక పట్టణప్రణాళిక నిబంధనలను అనుసరించి తిరుమల పవిత్రతను పెంపొందించేందుకు శాశ్వతమైన వ్యూహాలను అమలుచేయడం, ఉత్తమమైన ప్రణాళికలు ,వారసత్వ పరిరక్షణ, పర్యావరణ బాధ్యతలకు ప్రాధాన్యతనివ్వడం ,ప్రపంచవ్యాప్తంగా తిరుమలను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేందుకు టిటిడి ప్రయత్నిస్తోంది.

తిరుమలలో రాబోవు తరాల్లో మరింత ఆధ్యాత్మిక, సాంస్కృతిక పవిత్రతను కాపాడటమే ప్రణాళిక లక్ష్యంగా పనిచేయాలనేది సిఎం సూచనలు. తిరుమలలో పవిత్రతను కాపాడుతూ భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడానికి వ్యూహాలను రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. దళారీవ్యవస్థను కట్టడిచేసిన విజిలెన్స్ వింగ్ అధికారులు , తిరుమలకు వచ్చే భక్తులు 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం, పలు రకాల ఆర్జిత సేవలు,అన్ని రకాల దర్శన టిక్కెట్లు, టోకెన్లు సహా తిరుమల,తిరుపతిలో ఉండే వసతి భవన సముదాయాల్లో గదులు బుకింగ్, పొందడం వాటికి ఈకెవైసి ఆధార్ అథెంటిఫికేషన్ వ్యవస్థ అమలుచేయాలని సూచించారు.

**- అన్యమత ఉద్యోగులకు కాలం చెల్లినట్లే!:**

హిందూ ఆలయంలో హిందుమతంపై విశ్వాసమున్నవాళ్ళే, ఆచరిస్తున్నవాళ్ళే పనిచేయాలని, దీనికి విరుద్ధంగా ఉండేవారిని తక్షణం బదిలీ చేయడానికి సిఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. టిటిడిలో క్రిందిస్థాయిలో అటెండర్ నుండి డిప్యూటీ ఇఒ హోదా అధికారుల వరకు, టిటిడికి చెందిన పలు కళాశాలలు, విద్యాసంస్థల్లో అధ్యాపకులు, ప్రిన్సిపాళ్ళు, వైస్‌ప్రిన్సిపాళ్ళు, హాస్టల్ వార్డెన్‌లు ఇలా దాదాపు 300మంది ఉన్నట్లు సర్కార్‌కు నివేదిక,ఇప్పటికే 18మంది అన్యమతస్థులైన ఉద్యోగులను బదిలీ చేసినా కొందరు కుర్చీలు వీడకపోవడంపై సిఎం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం అన్యమతస్థులను సాగనంపాలని ఆదేశించడం ప్రత్యేకత సంతరించుకుంది.

**- తిష్టవేసిన వారిని పంపేయండి:**

టిటిడి నిబంధనల మేరకు దేవుని చెంత భక్తివిశ్వాసాలతో సేవచేసుకునేందుకు వివిధ ప్రభుత్వ శాఖల నుండి డిప్యూటేషన్ పై వచ్చే ఐఏఎస్, ఐపిఎస్,అటవీశాఖ, రెవెన్యూ, పోలీసుశాఖలు, వైద్యఆరోగ్యశాఖలకు చెందిన ఉద్యోగులు రెండేళ్ళపాటు సేవ చేసుకోవాలి. ఆపై వారందరినీ తిరిగి వారివారి మాతృశాఖకు సాగనంపాలనేది ఉత్తర్వులు. అయితే గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలో,


వైసిపి టిటిడి పాలకమండలి పెద్దల అడుగులకు మడుగులు వత్తిన, తానా అంటే తందానా అని వంతపాడిన ఉన్నతాధికారులు, అధికారులు ఇంకా కూటమి ప్రభుత్వంలో పదినెలలుగా తిష్టవేసుకుని టిటిడి లో జరిగే అభివృద్ధి, అన్యాయాలు,అక్రమాలపై చర్యలు సమాచారాన్ని వైసిపి పెద్ద లకు(విశ్వాస పాత్రు లుగా )చేరవేస్తున్నారు.

టిటిడి ఉద్యోగులు దీనిపై ఆగ్రహం చెందారు. ఇప్పుడు తాజా సమీక్షలో అలాంటి వారందరికీ, తిష్టవేసిన వైసిపి అధికారులను పంపేయాలని స్పష్టంగా ఆదేశాలివ్వడంతో తిరుపతి జెఇఒ,తిరుమలలో రెవెన్యూ అధికారి, అటవీశాఖ అధికారి, తిరుపతి వివిఎస్ఒ, ఎస్వీబిసిలో తెల్ల ఏనుగులు, టిటిడిలో విశ్రాంత అధికారులు, తెల్ల ఏనుగులు పదుల సంఖ్యలో కుర్చీలు వదలాల్సి వచ్చింది.

---

# ప్రభుత్వానికి, మావోయిస్టులకు మధ్య చర్చలు జరగాలి

## రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల అభిప్రాయం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్

**సైఫాబాద్, ఏప్రిల్ 4 ప్రభాత వార్త:** ప్రభుత్వానికి, మావోయిస్టుల మధ్య శాంతి చర్చలు జరగాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. శాంతి చర్చలు జరిగితే పౌర సమాజానికి, దేశానికి మేలు జరుగుతుందని వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పీస్ డైలాగ్ కమిటీ (శాంతి-చర్చల కమిటీ) ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'కేంద్ర ప్రభుతా ్వనికి, మావోయిస్టు పార్టీ మధ్య చర్చలు' అనే అంశంపై జస్టీస్ బి.చంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ అల్లం నారాయణ, ప్రముఖ పాత్రికేయులు కె.శ్రీనివాస్, సాధినేని వెంకటేశ్వర్‌రావు, జీవన్, గాదె ఇన్నయ్య, చంద్రశేఖర్, ప్రొఫెసర్ తిరుమల్, బాలకిషన్‌రావు, తిరుపతి, ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ తదితరులు ప్రసంగించారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ నాడు రాజ్యం అమాయక పౌరులను కాల్చి చంపి భూటకపు ఎన్‌కౌంటర్లుగా చిత్రికరించిందని ఆరోపించారు. నేడు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని ఆదివాసీల ఆధీనంలో ఉన్న ఖనిజ సంపదను దోచుకోవడానికి అమాయకులైన ఆదివాసీలను మావోయిస్టు పేరుతో రాజ్యం హత్యలు చేస్తున్నదని ఆరోపించారు. కార్పోరేట్ సంస్థలకు ఖనిజ సంపదను దోచిపెట్టడం కోసమే కేంద్ర హోం శాఖ మంత్రి అమితషా 2026 నాటికి మావోయిస్టులను నిర్మూలిస్తామని బహిరంగంగా పార్లమెంట్ వేదిక ప్రకటన చేయడం దారుణమన్నారు. నక్స్‌లిజాన్ని నిర్మూలిస్తామనే హక్కు రాజ్యానికి లేదన్నారు. ఛత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి, కేంద్ర హోం శాఖ మంత్రి కలయిక చర్చలకు అమోదిస్తారా అన్న విషయం అనుమానంగా ఉందన్నారు. చర్చలు ప్రభుత్వం చేస్తుందో, లేదో తెయదు కాని పౌర సమాజం, మేధావులు, కవులు సమాజంలోకి లోతుగా తీసుకువెళ్ళినప్పుడే శాంతి చర్చలు జరిగే అవకాశం ఉందన్నారు. అల్లం నారాయణ మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్‌లో జరుగుతున్న పరిణామాలు తీవ్ర నిర్భంధం నేపథ్యంలో చర్చల ప్రతిపాదన వస్తున్నదని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్య వాతావరణ వస్తుందనే ఒక ప్రయత్నం మాత్రమే చేస్తున్నామని, మనకు మావోయిస్టులు, ప్రభుత్వంపై ప్రేమలు లేవని దీనిని మధ్యవర్తులుగానే చూద్దామని, ప్రభుత్వంతో చర్చలు జరగలన్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కాల్పుల విరమణ మాత్రమే అని ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు.

కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిసు ్టలతోపాటు ఆదివాసీలు, సామాన్య ప్రజలు ఎన్‌కౌంటర్లకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల ప్రాణాలను రక్షించేందుకు అనే ప్రాతిపదికన చర్చలు జరగాలన్నారు. జస్టీస్ బి .చంద్రకుమార్ మాట్లాడుతూ దేశంలో శాంతి చర్చలు జరగాలనేది తన అభిప్రాయమన్నారు.

# సన్ రైజర్స్ 300 దమ్ము ఏమైంది?

## ఐపిఎల్‌లో ఆదుకోని విధ్వంసకర బ్యాటింగ్ లైనప్

### మూడు సార్లు మట్టికరిచిన టీమ్



**ఢిల్లీ:** ఐపిఎల్-2025 ఆరంభంలో మూడొందలు కొట్టే దమ్మున్న జట్టుగా గుర్తింపు పొందిన సన్ రైజర్స్ హైదరాబాద్ వరుసగా మూడు ఓటములను చవిచూసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో విధ్వంసకర బ్యాటింగ్ లైనప్ ఉన్న జట్లలో సన్ రైజర్స్ హైదరాబాద్ టాప్‌లో ఉంటుంది. క్లాసేన్ బ్యాట్ పడితే బంతి మైదానం అవతల పడాల్సిందే, భారీ షాట్లతో బౌలర్లకు హెడెక్ తెప్పించే హెడ్, అభిషేక్ శర్మ, మిడిల్ ఆర్డర్‌లో ఇరగదీసే ఇషాన్ కిషన్, నితీష్ రెడ్డి, కమిన్స్, ఈ సీజన్‌లో రెచ్చిపోతున్న యువకెరటం అనికేత్ వర్మ ఇలాంటి పటిష్ట బ్యాటింగ్ మిగతా ఏ జట్టులో లేదు. దీంతో ఐపిఎల్ 2025లో 'అబ్ కీ బార్... 300 పార్' (ఈసారి 300+ స్కోరు) ఖాయమని హైదరాబాద్ ఫ్యాన్స్ మాత్రమే కాదు దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ ప్రియులు భావించారు. సన్ రైజర్స్ ఆరంభం అదిరినా తర్వాత మ్యాచుల్లో ప్రదర్శనే ఆందోళన కలిగిస్తోంది. ఈ ఐపిఎల్‌ని 286 పరుగులతో ప్రారంభించింది సన్ రైజర్స్, దీంతో ఈసారి 300 పరుగుల రికార్డు ఈ టీంతోనే సాధ్యమని వాదనకు మరింత బలంపెరిగింది. అయితే ప్రస్తుతం హైదరాబాద్ టీం ఆటచూసి అందరూ అవాక్కవుతున్నారు. 300 కాదుకదా కనీసం 200 పరుగులు చేయడానికి ఆ టీం ఆపసోపాలు పడుతోంది. ఇలా మూడొందల స్కోరు చేస్తుందనుకున్న హైదరాబాద్ మూడుసార్లు మట్టికరిచింది. వచ్చాడు, కొట్టాడు, వెళ్లాడు యాటిట్యూడే సన్ రైజర్స్ కొంప ముంచుతోంది.

హిట్టింగ్ ఒక్కటి చాలు తమను గెలిపిస్తుందనే మైండ్‌సెట్‌ను సన్ రైజర్స్ మార్చుకోవాలి. సమయోచితంగా ఆడటం నేర్చుకోవాలి. ఇక ఎస్ఆర్‌హెచ్ ఓ ముగ్గురు నలుగురిపైనే ఆధారపడుతుంటుంది. మరీముఖ్యంగా ఓపెనర్ల హెడ్, అభిషేక్ శర్మ, మిడిల్ ఆర్డర్‌లో క్లాసేన్, కమిన్స్, నితీష్ కుమార్‌ల పైనే ఆ జట్టు ఆశలన్నీ. ఈ సీజన్‌లో ఇషాన్ కిషన్‌కూడా ఈ జాబితాలో చేరిపోయారు. వీరిలో ఎవరో ఒకరు బాగా ఆడితే చాలనుకుంటోంది ఎస్ఆర్‌హెచ్. కానీ అందరూ సమిష్టిగా ఆడితే విజయాలని, ఒకరిద్దరి వల్ల వచ్చే అరకొర విజయాలు తాత్కాలికమే తప్ప శాశ్వతం కాదనేది గుర్తెరగాలి. ఇక గతేడాది రికార్డులు కొల్లగొట్టిన ఓపెనర్లు ఈ ఏడాది ఆశించినస్థాయిలో ఆడటంలేదు. మొదటి మ్యాచ్‌లో బాగా ఆడారు కాబట్టే భారీస్కోరు సాధ్యమయ్యింది. కానీ తర్వాత వారు విఫలమవడంతో వరుస ఓటములు చవిచూస్తోంది. దీన్నిబట్టి ప్రత్యర్థులకు ఎస్ఆర్‌హెచ్ బలం ఓపెనర్లే అని అర్థమయ్యింది. అందువల్లే వారి వికెట్లు త్వరగా తీయడం ద్వారా జట్టును దెబ్బతీయవచ్చని తెలిసింది.

దీంతో ఓపెనర్లను టార్గెట్ చేసి హైదరాబాద్ టీంను మట్టికరిపిస్తున్నారు. ఇక వరల్డ్ క్లాస్ బౌలర్లు ఉన్నప్పటికీ సన్ రైజర్స్ బౌలింగ్ విభాగంలో ఇప్పటికీ బలహీనమే. టీమిండియా బౌలర్లు మహ్మద్ షమీ, హర్షల్ పటేల్, ఆసిస్ బౌలర్లు పాట్ కమ్మిన్స్, ఆడమ్ జంపా వంటివారు ఉన్నా ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించేలా సత్తాచాటడం లేదు. అందువల్లే బౌలింగ్ కంటే ధనాధన్ బ్యాటింగ్ పైనే సన్ రైజర్స్ ఆధారపడుతోంది. ఈ తీరు మారకుంటే ఎస్ఆర్‌హెచ్ గెలవడం చాలా కష్టమనే చర్చ క్రికెట్ వర్గాల్లో సాగుతోంది.



## వరల్డ్ ర్యాంకింగ్స్‌లో.. 127కు దిగజారిన

# భారత్ ఫుట్‌బాల్ జట్టు

### ఫలితాల సాధనలో పురుషుల టీమ్ విఫలం

**న్యూఢిల్లీ:** భారత్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు పరిస్థితి నానాటికి దిగజారుతోంది. ఏడాది కాలంగా అంతర్జాతీయ స్థాయి మ్యాచ్‌ల్లో ఆశించిన ఫలితాలు సాధించడంలో భారత్ పరుషుల జట్టు విఫలమవుతోంది. ఈ నిరాశజనక ప్రదర్శన ప్రభావం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ జట్టుపై చూపించింది. తాజాగా విడుదల చేసిన ప్రపంచ ఫుట్‌బాల్ ర్యాకింగింగ్స్‌లో భారత్ జట్టు 127వ స్థానానికి పడిపోయింది. క్రితం సారి భారత్ జట్టు 126వ స్థానంలో ఉంది. ఇటీవల షిల్లాంగ్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన ఆసియా కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకుంది. తమ కంటే మెరుగైన స్థానంలో ఉన్న భారత్ జట్టుతో మ్యాచ్‌ను 0-0తో డ్రా చేసుకోవడం బంగ్లాదేశ్ జట్టుకు కలిసొచ్చింది. ర్యాంకింగ్స్‌లో బాంగ్లాదేశ్ రెండు స్థానాల పురోగతి సాధించి 183వ ర్యాంకులో నిలిచింది. అలాగే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుత విశ్వవిజేత అర్జెంటీనా టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, స్పెయిన్ ఒక స్థానం మెరుగుపరచుకుని 2వ ర్యాంక్‌కు చేరుకుంది. ఇక ఫ్రాన్ ఒక స్థానం పడిపోయి 2వ ర్యాంక్‌లో నిలిచింది. ఇప్పటికే 2026 ప్రంచ కప్ టోర్నీకి అర్హత సాధించిన ఆసియా దేశాలు జపాన్ 15వ స్థానంలో, ఇరాన్ 18వ స్థానంలో ఉన్నాయి. కాగా గత ఏడాది జూన్‌లో భారత్ స్టార్ ప్లేయర్ సునీల్ ఛెత్రి అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుండి వీడ్కోలు తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. ఫలితంగా సునీల్ జట్టుకు గుడ్ బై చెప్పిన తరువాత భారత్ ప్రదర్శన తీసికట్టుగా మారింది. దాంతో గత నెలలో సునీల్ రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకుని మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చాడు. బంగ్లాదేశ్ మ్యాచ్, అంతకు ముందు మాల్దీవులతో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత్ జట్టుకు సునీల్ నాయకత్వం వహించాడు. కొత్త కోచ్ మనోలో మార్క్వెజ్ వచ్చాక భారత్ జట్టు ఆడిన 13 మ్యాచ్‌ల్లో ఒక్క దాంట్లో మాత్రమే విజయం సాధించింది. భారత్ 1996లో తమ అత్యుత్తమ ర్యాంక్ 94ను సాధించింది. ఆ తర్వాత టీమిండియా తమ అత్యుత్తమ ర్యాంక్‌ను అధిగమించడంలో విఫలమవుతోంది.

## వరల్డ్ బాక్సింగ్ కప్..

# సెమీఫైనల్లోకి భారత్ బాక్సర్లు

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కప్-2025 భారత్ బాక్సర్లు దూసుకుపోతున్నారు. బ్రెజిల్‌లో జరిగిన వేర్వేరు బరువు విభాగాల్లో మనీష్ రాథోడ్, హితేష్, అభినాష్ జామ్వాల్ ప్రత్యర్థులను చిత్తు చేస్తూ ఆధిపత్య విజయాలతో సెమీఫైనల్లోకి చేరుకున్నారు. బ్రెజిల్ జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ కప్ పురుషుల 65 కిలోల విభాగంలో భారత్ బాక్సర్ అభినాష్ జర్మనీకి చెందిన డేనిస్ బ్రిల్‌ను ఏకగ్రీవ నిర్ణయంతో అలవోక విజయాన్ని సొంతం చేసుకున్నాడు. అలాగే 70 కిలోల విభాగంలో మరో భారత్ బాక్సర్ హితేష్ ఇటలీకి చెందిన గాబ్రియెల్ గైడి రోంటానిని అదే స్కోరుతో ఓడించాడు. ఇక 55 కిలోల విభాగం ఆస్ట్రేలియాకు చెందిన పారిస్ ఒలింపియన్ యూసుఫ్ చోదియాపై భారత్ జాతీయ ఛాంపియన్ మనీష్ రాథోడ్ విజయం సాధించాడు. మూడు రౌండ్లలో ఈ ఇద్దరు బాక్సర్లు హోరా హోరీగా సాగిన ఈ పోటీలో ఉభయులూ సమాన పాయింట్లు సంపాదించారు. దీంతో ఇందులో చూపించిన ప్రతిభ ఆధారంగా ముగ్గురు న్యాయ నిర్ణేతలు మనీష్ గెలుపొందినట్లు ప్రకటించారు. సెమీ ఫైనల్‌లోలన రాథోడ్ కజకిస్తాన్‌కు చెందిన నూర్సుల్తాన్ అల్టిన్‌బెక్‌తోను, హితేష్ మకాన్ ట్రోర్‌తోను, జమ్వాల్ ఇటలీకి చెందిన జియాన్‌లుయిగి మలంగాతో తలపడనున్నారు.

## పాకిస్థాన్‌కు భారీ జరిమానా

### ఇప్పటికే వరుస ఓటములతో పరాభవం



**ఢిల్లీ:** వన్డే సిరీస్‌ను కోల్పోయిన బాధలో ఉన్న పాకిస్తాన్‌కు మరో భారీ షాక్ తగిలింది. పాకిస్తాన్ జట్టు ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉంది. అయితే పాక్ జట్టుకు ఏదీ కలిసిరావడంలేదు. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను 41తో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఆ తరువాత వన్డే సిరీస్‌లోనూ వరుసగా మ్యాచ్‌లు ఓడిపోతోంది. దీనికి సంబంధించి ఇప్పటికే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే పాక్ కోల్పోయింది. సిరీస్‌ను కోల్పోయిన బాధలో ఉన్న పాకిస్తాన్ ఐసిసి షాక్ తగిలింది. రెండో వన్డేలో పాకిస్తాన్ జట్టు స్లో ఓవర్‌రేటును కొనసాగించింది. నిర్ణీత సమయంలో ఓవర్ల కోటాను పూర్తి చేయనందుకు మ్యాచ్ రిఫరీ పాక్ జట్టుకు మ్యాచ్ ఫీజులో 5 శాతం ఫైన్ పడింది. పాకిస్తాన్ నిర్ణీత సమయానికి కన్నా ఓ ఓవర్ తక్కువగా వేసింది. పాకిస్తాన్ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ నేరాన్ని అంగీకరించాడు. శిక్షను అంగీకరించాడు. దీంతో అధికారిక విచారణ అవసరం లేదని ఐసిసి గురువారం ధృవీకరించింది.

# ఇంగ్లండ్‌కు వరుస షాక్‌లు

## టీమిండియాతో టెస్టు సిరీస్‌కు కష్టాలు



**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ జట్టుకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. టీమిండియాతో టెస్టు సిరీస్‌కు సన్నద్ధమవుతున్న ఇంగ్లీష్ జట్టును కష్టాలు వెంటాడుతున్నాయి. టీమిండియాతో స్వదేశంలో జరుగనున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ క్రికెట్ జట్టును గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటికే స్టార్ పేసర్ మార్క్ వుడ్, స్టోక్స్ సేవలకు దూరమైన ఇంగ్లండ్ తాజాగా మరో ఫాస్ట్ బౌలర్ ఈ జాబితాలో చేరాడు. ఓలీ స్టోన్ గాయం కారణంగా భారత్‌తో సిరీస్‌కు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ధృవీకరించింది. స్టోన్ ఇంగ్లండ్ తరపున ఇప్పటి వరకూ ఐదు టెస్టులు ఆడాడు. గత వేసవిలో ఇంగ్లండ్ జట్టులో రెగ్యులర్‌గా స్టోన్ ఉన్నాడు. అయితే గత నెలలో అతడి కుడి మోకాలికి గాయమైంది. దీంతో రాబోయే 14 వారాల పాటు ఆటకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి తప్పడం లేదు. కానీ భారత్-ఇంగ్లండ్ మధ్య సిరీస్ అగస్టు 4తో ముగియనుంది. మరోవైపు కెప్టెన్ బెన్ స్టోక్స్ ఫిట్‌నెస్ కూడా ఇంగ్లండ్ జట్టును కలవరపెడుతోంది. స్టోక్స్ ప్రస్తుతం తొడకండరాల గాయంతో బాధపడుతున్నాడు. గత ఏడాది చివరిలో తన గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. దీంతో అతడు ఇంకా పూర్తి ఫిట్‌నెస్ సాధించ లేదు. ఈ పరిస్థితుల్లో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో టీమిండియాతో తలపడటంపై ఇంగ్లండ్ జట్టు కలవరపాటుకు గురవుతోంది.

# వాణిజ్యం

# ఇన్వెస్టర్లకు రూ.9.5 లక్షల కోట్లు లాస్

**ముంబై, ఏప్రిల్ 4:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లనుంచి ప్రతికూల సంకేతాలతో భారీ నష్టాలను చవిచూశాయి. ట్రంప్ విధించిన టారిఫ్‌ల కారణంగా వాణిజ్య యుద్ధ భయాలు గురువారం అమెరికా మార్కెట్లతో పాటు శుక్రవారం ఆసియా మార్కెట్లనూ కుదిపేశాయి. ముఖ్యంగా మెటల్, ఐటి, ఫార్మా స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లవెత్తాయి. దీంతో సెన్సెక్స్ 900 పాయింట్లకు పైగా నష్టపోగా, నిఫ్టీ మళ్లీ 23 వేల దిగువకు చేరింది. బిఎస్ఇలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.9.5 లక్షల కోట్లు క్షీణించి రూ.403 లక్షల కోట్లకు చేరింది. చివరికి సెన్సెక్స్ 930.67 పాయింట్లు క్షీణించి 75,364.69 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 345.65 పాయింట్లు నష్టపోయి 22,904 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.85.22గా ఉంది. టాటా స్టీల్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టి, అదానీ పోర్ట్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నెస్లే ఇండియా, ఐసిఐసిఐ బ్యాంకు వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. వివిధ దేశాల నుంచి అమెరికా చేసుకునే దిగుమతులపై సుంకాలు విధించడం ద్వారా వాణిజ్య యుద్ధానికి తెరతీశారు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.



ఇప్పటికే కెనడా టారిఫ్‌లను ప్రకటించగా, చైనా, యూరోపియన్ యూనియన్ దేశాల ప్రతీకార సుంకాలకు సిద్ధమవుతున్నాయి. వాణిజ్య యుద్ధాలు ప్రపంచ ఆర్థికంగా ప్రభావం చూపుతాయని, దాని ప్రభావం భారత్‌పైనా ఉంటుందన్న ఆందోళనలు మన మార్కెట్‌లను పడేశాయి. ప్రతీకార సుంకాల మూలంగా అగ్రరాజ్యం మాంద్యంలోకి వెళుతుందన్న భయాలు నెలకొన్నాయి. ఫైనాన్షియల్, ఎఫ్ఎంసిజి షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా నిఫ్టీ మెటల్ 6శాతం, నిఫ్టీ ఫార్మా 4శాతంతో పాటు ఐటి, ఆటో, రియాల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్అండ్‌టి, ఇన్ఫోసిస్, టాటా స్టీల్ వంటి ప్రధాన షేర్లలో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి.

# భారీగా పెరగనున్న ఐఫోన్ ధరలు!

**వాషింగ్టన్, ఏప్రిల్ 4:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం దెబ్బకు ఆపిల్ సంస్థ విలవిల్లాడనుంది. ఐఫోన్ ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మోడల్‌ను బట్టి వీటి ధరలు 30-40శాతం వరకు పెరగవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఐఫోన్లు చైనాలో తయారవుతాయి. దీంతో ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లు వీటిపై పడతాయి. ఈ నేపథ్యంలో సంస్థ వీటిని భరించడమా, లేక వినియోగదారులపై మోపడమా అనేది యాపిల్ నిర్ణయించాల్సి ఉంది. చాలా మందికి అందుబాటులో ఉండే ఐఫోన్ 16 మోడల్ ధర 799 డాలర్లు అంటే రూ.68 వేలు. ఆపిల్ కనుక పన్నుల భారం వినియోగదారుల పైకి బదలాయిస్తే, ఇది 1,142 డాలర్లకు అంటే రూ.97వేలకు చేరవచ్చని అంచనా. ఇక ప్రీమియం మోడల్ ఐఫోన్ 16 ప్రోమ్యాక్స్ 2,300 డాలర్లకు అంటే రూ.2లక్షలకు చేరవచ్చు. గతంలో ఆపిల్ అదనపు పన్నులు తప్పించుకొనేందుకు ప్రత్యేక మినహాయింపులు పొందింది. కానీ ఈ సారి అనేవీ లభించేలా లేవు. అమెరికా వ్యాపారసంస్థలు చైనా నుంచి తమ ఫ్యాక్టరీలను తరలించేలా ఒత్తిడి పెంచేందుకు ట్రంప్ అదనపు పన్నులు విధించారు. ఇప్పటికే ఐఫోన్ల విక్రయాలు ప్రధాన మార్కెట్లలో అనుకున్న స్థాయిలో లేవు. దీనికి తోడు తాజా పన్నుల కారణంగా ధరలు పెరిగితే, వాటిపై మరింత ప్రతికూల ప్రభావం పడొచ్చు. దీంతో కస్టమర్లు ఇతర ఆప్షన్లపై దృష్టిపెట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆపిల్ ప్రధాన పోటీదారు శాంసంగ్ లబ్ధిపొందే అవకాశం ఉంది.



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల ఢంకా మోగించిన విషయం విదితమే. అమెరికాకు దిగుమతయ్యే ప్రతి వస్తువుపైనా కనిష్టంగా 10శాతం నుంచి గరిష్టంగా 49శాతం వరకు సుంకాలు విధించారు. మనదేశంపై 26శాతంతో విరుచుకుపడ్డారు. చైనాపై 34శాతం బాదేశారు. ఐరోపా దేశాలపై 20 శాతం విధించారు.

# ఫార్మా స్టాక్ డీలా

**ముంబై, ఏప్రిల్ 4:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో కొనసాగాయి. ఈ నేపథ్యంలో ఫార్మా స్టాక్స్ కూడా నష్టాల్లోకి జారుకున్నాయి. త్వరలో ఫార్మా ఉత్పత్తులపై సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడమే ఇందుకు కారణం. దీంతో నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ ఏకంగా 4.2శాతం పతనమైంది. ఇంట్రాడేలో 20,521.70 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై ఇప్పటికే సుంకాల్ని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ త్వరలో ఫార్మా ఉత్పత్తులు, సెమీ కండక్టర్లపై కూడా పన్ను విధిస్తానని వ్యాఖ్యానించారు. ఫార్మా ఒక ప్రత్యేక వర్గం అని పేర్కొన్న ట్రంప్ ఈ రంగంపై టారిఫ్ అంశం పరిశీలనలో ఉందని తెలిపారు. త్వరలో దీనిపై ప్రకటన వెలువడనుందని పేర్కొన్నారు. పరస్పర సుంకాల్లో ఫార్మాకు మినహాయింపు లభించిందన్నకారణంతో గురువారం ఔషధ రంగ స్టాక్స్ తాజా ప్రకటనతో కుదేలవుతున్నాయి. అరబిందోఫార్మా 6.25శాతం, ఐపిసిఎ లేబొరేటరీస్ 6.51శాతం, లూపిన్ 5.35శాతం, బయోకాన్ 5.05శాతం నష్టపోయాయి. సిప్లా, దివీస్ లేబొరేటరీస్, డాక్టర్‌రెడ్డీస్, సన్‌ఫార్మా షేర్లు దాదాపు 3శాతంమేర నష్టాల్లో ట్రేడయ్యాయి.



# బిలియనీర్లకు రూ.17 లక్షల కోట్ల నష్టం

**వాషింగ్టన్, ఏప్రిల్ 4:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల దెబ్బకు అంతర్జాతీయంగా అనేక ఎక్స్ఛేంజీ మార్కెట్లు కుదేలైన విషయం విదితమే. అటు అమెరికా మార్కెట్లు కూడా భారీగా పతనమయ్యాయి. ఈ ఎఫెక్ట్ బిలియనీర్లపైనా తీవ్రంగానే పడింది. ప్రపంచవ్యాప్తంగా 500 మంది కుబేరుల మొత్తం సంపద 208 బిలియన్ డాలర్లు కరిగిపోయింది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.17 లక్షల కోట్లకు పైమాటే. సంపన్నుల సంపద ఈ స్థాయిలో తరగడం గత దశాబ్ద కాలంలో ఇదే తొలిసారి. ట్రంప్‌నకు అత్యంత సన్నిహితుడైన ఎలాన్ మస్క్ ఆస్తి కూడా భారీగా తగ్గడం విశేషం. ఈ జాబితాలో అత్యధికంగా నష్టపోయింది మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్. ఆయన సంపద ఏకంగా 17.9 బిలియన్ డాలర్ల మేర ఆవిరైంది. జుకర్‌బర్గ్ మొత్తం సంపదలో ఈ నష్టం 9శాతానికి సమానం. ఇక అమెజాన్ షేర్లు 9శాతం మేర కుంగాయి. 2022 ఏప్రిల్ తర్వాత ఈ కంపెనీ షేర్లు ఇంత భారీగా తగ్గడం ఇదే తొలిసారి. దీంతో సంస్థ అధినేత జెఫ్ బెజోస్ వ్యక్తిగత నికర సంపద 15.9 బిలియన్ డాలర్లు తరిగి పోయింది.



టెస్లా షేర్లు 5.5శాతం మేర తగ్గడంతో ఎలాన్ మస్క్ సంపద 11 బిలియన్ డాలర్లు మేర కరిగిపోయింది. డెల్ సిఇఒ మైఖేల్ డెల్ సంపద 9.53 బిలియన్ డాలర్లు, ఒరాకిల్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ల్యారీ ఎలిసన్ ఆస్తి 8.1 బిలియన్ డాలర్ల మేర తగ్గింది. ఎన్విడియా సిఇఒ జేసెన్ హువాంగ్‌కు 7.36 బిలియన్ డాలర్లు, గూగుల్ మాజీ సిఇఒ ల్యారీ పేజ్‌కు 4.79 బిలియన్ డాలర్లు, గూగుల్ సహ వ్యవస్థాపకుడు సెర్గీ బ్రిన్‌కు 4.46 బిలియన్ డాలర్ల మేర నష్టం వాటి ల్లింది. ఫ్రాన్స్ సంపన్నుడు బెర్నార్డ్ ఆరాల్ట్ సంపద 6 బిలియన్ డాలర్లు తరిగిపోయిందని బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ సూచి వెల్లడించింది.

# బ్యాంకుల ఎఫ్‌డి రేట్లలో కోత

**ముంబై, ఏప్రిల్ 4:** గత కొన్ని నెలలుగా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీరేట్లను అందించిన బ్యాంకులు, ఇప్పుడు రేట్లు తగ్గించడం మొదలుపెట్టాయి. ప్రముఖ బ్యాంకులు ఇప్పటికే వడ్డీ రేట్లను సవరించాయి. ప్రైవేటు రంగ బ్యాంకింగ్ దిగ్గజంహెచ్‌డిఎఫ్‌సి సవరించిన వడ్డీరేట్లు అమల్లోకిరాగా, ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అమృత్ కలశ్ పేరిట అందిస్తున్న స్పెషల్ డిపా జిట్ స్కీమ్‌ను మార్చి 31తో నిలిపివేసింది. 2023 ఏప్రిల్‌లో 400 రోజుల కాలపరిమితితో ఈ డిపాజిట్ స్కీమ్‌ను అందిస్తున్న విషయం విదితమే. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ కమిటీ వచ్చే వారం భేటీ కాబోతోంది. 7వతేదీన ఈ భేటీ ప్రారంభమైన 9వ తేదీన నిర్ణయం వెలువడనుంది. రెండునెలల క్రితం జరిగిన ఎంపిసీ భేటీలో 25 బేసిస్ పాయింట్ల మేర వడ్డీరేట్లను తగ్గించిన ఆర్‌బిఐ, వృద్ధికి ఊతం ఇచ్చే ఉద్దేశంతో మరోమారు రెపో రేటును తగ్గించే అవకాశం ఉందనన్న అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు రంగ బ్యాంకులైన హెచ్‌డిఎఫ్‌సి, ఎస్ బ్యాంకు, పంజాబ్ అండ్ సింధ్, బంధన్ బ్యాంకులు ఎఫ్‌డి రేట్లను సవరించాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు రెండు ఎంపిక చేసిన కాలవ్యవధులపై ఎఫ్‌డి రేట్లను తగ్గించింది. 35 నెలల కాలవ్యవధి కలిగిన ఎఫ్‌డిపై 35 బేసిస్ పాయింట్లు, 55 నెలల ఎఫ్‌డిపై 40బేసిస్ పాయింట్లు మేర కోత పెట్టింది. ఇకపై ఈ రెండు కాల వ్యవధులపై రూ.3 కోట్లలోపు రిటైల్ డిపాజిట్లపై గరిష్టంగా 7శాతం మాత్రమే వడ్డీ లభించనుంది. సీనియర్ సిటిజన్లకు 50బేసిస్ పాయింట్లు అదనం. 21 నెలల కాలవ్యవధిపై మాత్రం అత్యధికంగా 7.25 శాతం వడ్డీని అందిస్తోంది. ఎస్‌బ్యాంకు కూడా ఎంపిక చేసిన కాలవ్యవధులపై 0.25శాతం వడ్డీరేట్ల లో కోత పెట్టింది. 12 నుంచి 24 నెలల మధ్య ఇంతకుముందు 8శాతం వడ్డీని అందించగా, ఇకపై 7.75శాతం మాత్రమే ఆఫర్ చేయనుంది. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు స్పెషల్ ఎఫ్‌డిలపై అందిస్తున్న వడ్డీరేట్లలో కోత



పెట్టి వాడి గడువును ఈ యేదాది జూన్ 30 వరకు పొడిగించింది. సవరించినరేట్లు అమల్లోకి వచ్చాయి. 333, 555 రోజుల ఎఫ్‌డిలను నిలిపివేసింది. 444 రోజుల కాలవ్యవధిపై వడ్డీరేటును 7.30శాతం నుంచి 7.10శాతానికి, 777 రోజుల కాలవ్యవధిపై 0.75శాతం వడ్డీని తగ్గించి 6.50 శాతానికి, 999రోజుల కాలవ్యవధి డిపాజిట్లపై 30బేసిస్ పాయింట్లు కోతపెట్టి 6.35 శాతానికి పరిమితం చేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.